ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక   PEN POWER TELUGU DAILY   ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 54 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 5 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 54 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 5 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# బీఆర్ఎస్ లో హరీశ్ గుంపు తయారు చేస్తుండు

- హరీశ్ రావును మరోసారి టార్గెట్ చేసిన కవిత
- మాజీ మంత్రి హరీశ్ రావుపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు
- ఒక్క మాటకే అసెంబ్లీని బహిష్కరించడం సరికాదని వ్యాఖ్య
- హరీశ్ పార్టీలో సొంతంగా గ్రూపు తయారు చేస్తున్నారని ఆరోపణ
- కృష్ణా జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని విమర్శ
- కర్ణాటక ప్రాజెక్టులపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్



**సూర్యాపేట: పెన్ పవర్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మరోసారి మాజీ మంత్రి హరీశ్ రావుపై హాట్ కామెంట్స్ చేశారు. వ్యక్తిగతంగా ఆయన్ను ఒక్క మాట అంటే బీఆర్ఎస్ సభ్యులంతా సభని బాయ్ కాట్ చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఆ అంశంపై వాకౌట్ చేస్తే.. తర్వాత సభకు రావొచ్చు కదా? అని అన్నారు. సూర్యాపేటలో కవిత మాట్లాడుతూ అసెంబ్లీ జరిగిన తీరు, హరీశ్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'అసెంబ్లీలో బిల్లులపై చర్చ జరుగుతుంటే ప్రతిపక్షం ఉండొద్దా? సభ నుంచి వాకౌట్ చేయాలనే నిర్ణయం ఎవరిది? బీఆర్ఎస్ పార్టీలో హరీశ్ ఒక గుంపు తయారు చేస్తుండు. కేసీఆర్ ను తిట్టినప్పుడు ఈ గుంటనక్క అలాగే వ్యవహరించిందా? బాయ్ కాట్ నిర్ణయం అధిష్టానందే అయితే అది శ్రేయస్కరం కాదు. అసెంబ్లీ బయట సభలు పెట్టేకంటే చట్టసభల్లో మాట్లాడే అవకాశం వదులుకోవడం కరెక్ట్ కాదు. గుంట నక్క హరీశ్ వ్యవహారం.. తోక కుక్కను ఊపినట్టుంది. కృష్ణా పంపకాలల్లో హక్కులు తగ్గించి సంతకం ఎందుకు పెట్టాడో చెప్పి. పీపీటీ చేయాలి. హరీశ్ ధన దాహం కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి మార్పు చేశారు. ఆయన నిర్ణయాలతోనే సాగునీటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం జరిగింది' అని ఆరోపించారు.

**ఆల్మట్టి ఎత్తు తగ్గించాలని తీర్మానం చేయండి**

'ప్రతిపక్షం లేకుండా కృష్ణా నీళ్లపై అడ్డగోలు అబద్ధాలు చెప్పారు. అసెంబ్లీలో కేసీఆర్ తప్పులు చేశాడనే తప్ప నీటి వాటా పై చర్చ. లేదు. ఆల్మట్టి ఎత్తు పెంచుకుంటే ఉత్తరం రాసి వదిలేశారు. కృష్ణాపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు సమగ్ర చర్చ జరపడంలేదు. తుంగభద్ర, కృష్ణా నీటిపై కర్నాటకతో పేచీ ఉంటే రెండు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నా ఎందుకు పరిష్కరించడంలేదు. కురచ స్వ భావంతో గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ సీఎం తప్పులు కప్పిపుచ్చుకుంటున్నడు. చి త్తశుద్ధి ఉంటే కర్ణాటక అప్పర్ భద్ర జాతీయ హోదా తొలగించాలి. ఆల్మట్టి ఎత్తు తగ్గించాల ని అసెంబ్లీలో తీర్మానం చేయాలి' అని కవిత డిమాండ్ చేశారు.



## కేసీఆర్‌ను తిడుతున్న వారిని ఎన్నిసార్లు ఉరితీయాలి?

- కరువు నేలల్లో సిరులు పండించిన పరిపాలకుడు కేసీఆర్
- పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- చెక్ డ్యాములు పేల్చేసే చెత్త ప్రభుత్వమంటూ కాంగ్రెస్ పై ఫైర్

**హైదరాబాద్ పెన్ పవర్:**కరువు నేలల్లో సిరులు పండించి రైతుల జీవితాల్లో సంతోషాన్ని నింపిన గొప్ప పరిపాలకుడు కేసీఆర్.. అలాంటి కేసీఆర్ ను తిడుతున్న వారిని ఎన్నిసార్లు ఉరితీయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భవన్ లో 'నదీ జనాలు-కాంగ్రెస్ ద్రోహాలు'అంశంపై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో కేటీఆర్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ

వివరాలు 2లో..

## మదురో అరెస్ట్‌పై భారత్ ఆందోళన.. చర్చలతోనే పరిష్కారమని సూచన



- వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసిన అమెరికా సైన్యం
- నార్కో టెర్రరిజం ఆరోపణలపై విచారణకు న్యూయార్క్‌కు తరలింపు
- తాత్కాలిక అధ్యక్షురాలిగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ నియామకం
- వెనిజులా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం
- చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపు

వివరాలు 2లో..

## ఏఐ 'గ్రోక్'పై కేంద్రం సీరియస్.. 72 గంటల గడువు



- 'గ్రోక్' ఏఐతో అశ్లీల కంటెంట్ వ్యాప్తిపై కేంద్రం సీరియస్
- ఎలాన్ మస్క్ 'ఎక్స్' యాజమాన్యానికి 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- చట్టవిరుద్ధ కంటెంట్‌ను తొలగిస్తున్నామని స్పష్టం చేసిన ఎక్స్
- నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- స్థానిక ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తామన్న యాజమాన్యం

వివరాలు 2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ ముందు హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు



- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎమ్మెల్సీ నవీన్ రావు విచారణ
- నిందితులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై ప్రశ్నలు
- ఇది రాజకీయ కుట్ర అని ఆరోపణలను ఖండించిన నవీన్ రావు
- కేసీఆర్, కేటీఆర్‌లనూ సిట్ విచారించే అవకాశం
- కీలక దశకు చేరుకున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. నవీన్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారించింది. ఆదివారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు ఆయన వాంగ్మూలం నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా

వివరాలు 2లో..

## అనుకున్న టైమ్‌కు మేడారం జాతర పనులు పూర్తి చేస్తం



**హైదరాబాద్ పెన్ పవర్:** అనుకున్న సమయానికి మేడారం జాతర పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం (జనవరి 4) మేడారంలో గద్దెల అభివృద్ధి పనులను మంత్రులు పొంగులేటి, సీతక్క పరిశీలించారు. అనంతరం మేడారం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనవరి 10వ తేదీ లోపు మేడారం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బాధ్యతగా వ్యవహరించని అధికారులపై చర్యలు తీసుకోవాలని

వివరాలు 2లో..



## సంక్రాంతికి ఊరెళ్లే వారికి.. సీపీ సజ్జనార్ కీలక సూచనలు

**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి పండక్కి ఊరెళ్తున్నారా.. అయితే, ఈ విషయం మీ కోసమే. తస్మాత్ జాగ్రత్త అంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఊరెళ్లే ముందు మీ నగలు, నగదును భద్రపర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ పోలీసులు గుర్తు చేస్తున్నారు. కచ్చితంగా మీ పక్కింటి వారికి సమాచారం ఇవ్వాలని, లేదంటే.. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ వాసులకు సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. ఊరికి వెళ్లే ముందు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా బీట్ ఆఫీసర్ కు తెలియజేయాలని సూచించారు. నగదు, బంగారం ఇంట్లో ఉంచొద్దు.. వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కి కాల్ చేయాలని సూచించారు సీపీ సజ్జనార్‌మరో వారం రోజుల్లో స్కూళ్లకు సంక్రాంతి సెలవులు రానున్నాయి. సంక్రాంతి పండుగను సంబురంగా జరుపుకొనేందుకు తెలంగాణతో పాటు ఏపీలోని సొంతూళ్లకు వెళ్తారు. ఏపీకి వెళ్లే బస్సులు, ట్రైన్లు ప్యాసింజర్లతో కిక్కిరిసిపోతాయి. అయితే, సిటీ జనం సొంతూళ్లకు వెళ్తుండటంతో.. తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేసి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. సంక్రాంతి నేపథ్యంలో కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల్లోని వారిని అలర్ట్ చేస్తున్నామని చెప్పారు.


కీలక సూచనలు సొంతూళ్లకు వెళ్లేవారు చుట్టుపక్కల ఉండే వారికి విషయం చెప్పి తమ ఇంటిని గమనిస్తూ ఉండమనాలి.

వివరాలు 2లో..

## పోలవరంపై ఏపీతో న్యాయపోరాటం... సుప్రీంలో వాదనలకు తెలంగాణ సర్కారు సిద్ధం

- పోలవరం విస్తరణపై ఏపీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ
- గోదావరి జలాల్లో తమ వాటా కోసం న్యాయపోరాటానికి సిద్ధం
- ముంబైలో సీనియర్ న్యాయవాదితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ భేటీ
- అక్రమ విస్తరణ పనులు ఆపాలని పిటిషన్‌లో విజ్ఞప్తి
- ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు నిలిపేయాలని కోరిన తెలంగాణ

వివరాలు 2లో..



## కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా



- రాయలసీమ లిఫ్ట్ పనులను ఆపింది తానేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్య
- రేవంత్ వ్యాఖ్యలతో చెలరేగిన దుమారం
- కృష్ణా జలాలపై త్వరలోనే వాస్తవాలు వివరిస్తానన్న సీఎం చంద్రబాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా నదీ జలాల వివాదంపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ దుమారం రేపాయి. తన విజ్ఞప్తి మేరకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ఎత్తిపోతల పథకం (ఆర్ఎల్ఐఎస్) పనులను నిలిపివేశారని రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రకటించడం

వివరాలు 2లో..

## 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాం

- వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్
- క్రీడాకారులను ఉద్దేశించి వర్చువల్ గా ప్రసంగించిన ప్రధాని మోదీ
- భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:**భారతదేశం క్రీడా రంగంలో సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన.. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్-17 ఫిఫా వరల్డ్ కప్,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# స్టాలిన్...విజయ్..మధ్యలో కాంగ్రెస్

తమిళనాడులో రాజకీయం రసవత్తరంగా ఉండబోతోందా అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తే అదే అనిపిస్తోంది అంటున్నారు. ఈ ఏడాది మే నెలలో తమిళనాడు శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రెండోసారి గెలిచి తన అధికారాన్ని నిలబెట్టుకోవాలని డీఎంకే చూస్తోంది. ఇక డీఎంకే కూటమిలో కాంగ్రెస్ వామపక్షాలు ఇతర చిన్న పార్టీలు ఉన్నాయి. 2021 ఎన్నికల్లో ఈ పార్టీలు అన్నీ కలసి అత్యధిక సీట్లను గెలుచుకున్నాయి. ఈసారి కూడా అదే మ్యాజిక్ ని రిపీట్ చేయాలని డీఎంకే అధినేత ముఖ్యమంత్రి స్టాలిన్ భావిస్తున్నారు. అయితే అయిదేళ్ల పాటు అధికారంలో ఉండడంతో యాంటీ ఇంకెంబెన్సీ అన్నది ఉండబోతోంది. దాంతో పాటుగా కొత్తగా సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం టీవీకే పార్టీ కూడా దూసుకుని వస్తోంది. ఇక బీజేపీ అన్నాడీఎంకే కూడా ఒక స్ట్రాంగ్ ఫోర్స్ గా ఉంది. ఈ నేపథ్యంలో ఓట్ల చీలిక వల్ల ఎవరికి లాభం అన్నది కూడా తెలియడం లేదు అని విశ్లేషణలు ఉన్నాయి.

**సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా :**

తమిళనాడులో స్టార్ హీరోగా ఎంతో పాపులారిటీ కలిగిన విజయ్ టీవీకే పార్టీ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా ఈసారి ఎన్నికల్లో ఉండబోతోంది అని అంటున్నారు. విజయ్ పార్టీతో చెలిమి కోసం బీజేపీ అన్నా డీఎంకే చేయని ప్రయత్నాలు లేవు, గత ఏడాది అక్టోబర్ లో విజయ్ సభలో 40 మందికి పైగా జనాలు చనిపోవడంతో ఆ ఘటన మీద విజయ్ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొంది. ఆ సమయంలో బీజేపీ అన్నా డీఎంకే మద్దతుగా నిలిచాయి. అయితే టీవీకే అయితే మొదటి నుంచి బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉంటోంది. ద్రవిడ భావజాలంతోనే ఆ పార్టీ ముందుకుస్ సాగుతోంది. పైగా తమిళనాడులో ద్రవిడ భావజాలం బలంగా లేదని దానిని కొనసాగించే విషయంలో డీఎంకే అన్నా డీఎంకే రెండూ ఫెయిల్ అయ్యాయన్నది టీవీకే ప్రధాన విమర్శగా ఉంది. దాంతో బీజెపేఎ అన్నా డీఎంకే కూటమి వైపు టీవీకే చేరేది ఉండదని ఆంతా అనుకుంటున్నారు.

**అనూహ్యంగా కాంగ్రెస్ :**

అయితే ఇపుడు మరో కొత్త విషయం చర్చకు వస్తోంది. అదేంటి అంటే టీవీకే కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటుందని. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి ఉంది. తమిళనాడులో డీఎంకే తో కాంగ్రెస్ ఉంది. మరి విజయ్ పార్టీ టీవీకేకి దీనిలో ఎక్కడ చోటు అన్న ప్రశ్న అయితే ఉండనే ఉంది. కానీ రాజకీయాల్లో కాదేదీ అనర్హం అన్నట్లుగా ఇపుడు టీవీకే పార్టీ ఆలోచనలు ఉన్నాయని అంటున్నారు. ఒంటరిగా పోటీ చేస్తే అధికారంలోకి రావడం కష్టమన్న ఆలోచన కూడా ఆ పార్టీకి ఉంది. దాంతో జాతీయ స్థాయిలో విపక్షంలో పెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ తో చేతులు కలిపితే ఎలా ఉంటుంది అన్నదే టీవీకే ప్రస్తుతం సాగుతున్న చర్చగా చెబుతున్నారు.

**కీలక వ్యాఖ్యలతో :**

ఇక టీవీకే జాతీయ అధికార ప్రతినిధిగా ఉన్న గెరాల్డ్ తాజాగా చేసిన కీలక వ్యాఖ్యలే దీనిని సంకేతం అని అంటున్నారు. ఆయన టీవీకే కాంగ్రెస్ సహజ మిత్రులు అన్నట్లుగా వ్యాఖ్యానించారు. రెండు పార్టీలూ లౌకిక వాదానికి కట్టుబడి ఉన్నాయని కూడా ఆయన చెబుతూనే మతతత్వానికి తాము వ్యతిరేకమని బీజేపీకి పరోక్షంగా దూరం అన్నట్లుగా చెప్పేశారు. అంతే కాకుండా తమ నాయకుడు విజయ్ అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంచి మిత్రులు అని కూడా గెరాల్డ్ చెప్పడం విశేషం.

**డీఎంకే సంగతేంటి :**

అయితే విజయ్ పార్టీ టీవీకే కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని పనిచేయడానికి తమకు అభ్యంతరం లేదన్నట్లుగా గట్టి సంకేతాలు పంపించారు. అదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నేతలతో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించుకోవాలని ఆయన అంటున్నారు. అంటే తమిళనాడులోని కాంగ్రెస్ నేతలు అయితే డీఎంకేతో ఉంటున్నారు. పొత్తు వారితోనే అని కూడా చెబుతున్నారు. అందుకే జాతీయ నాయకత్వం మీదనే భారం వేస్తూ బంతిని ఆ వైపుగా గెరాల్డ్ నెట్టారు అని అంటున్నారు. బీజేపీ అన్నా డీఎంకే పార్టీల మధ్య పొత్తు ఉంది. బీజేపీకి జాతీయ స్థాయిలో అధికార బలం ఉంది, అన్నా డీఎంకే కి లోకల్ గా పట్టుంది. క్యాడర్ బేస్ ఉంది. దాంతో పాటుగా సహజంగా అధికార పార్టీ వ్యతిరేకత వారికే మళ్ళుతుంది. విజయ్ టీవీకే ఒంటరిగా పోటీ చేస్తే బీజేపీ అన్నా డీఎంకే కి లబ్ధి కలుగుతుందని డీఎంకే వ్యతిరేక ఓట్ల కంటే బీజెపీ వ్యతిరేక ఓట్లనే టీవీకే చీలుస్తుంది అన్న విశ్లేషణ ఉంది. దాంతోనే కాంగ్రెస్ తో పొత్తుకు టీవీక ఆసక్తి చూపుతోంది అని అంటున్నారు. చూడాలి మరి కాంగ్రెస్ ఆలోచన ఏమిటో. అటు స్టాలిన్ బలమైన మిత్రుడిగా ఉన్నారు, ఆయనను కాదని కాంగ్రెస్ విజయ్ పార్టీ టీవీకే వైపు వస్తుందా అన్నదే పెద్ద ప్రశ్న.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ ముందు హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు

- మొదటి పేజి తరువాయి

ఉన్న ప్రణీత్ రావు, శ్రవణ్ కుమార్‌లతో నవీన్ రావుకు సంబంధాలున్నాయనే ఆరోపణల నేపథ్యంలో సిట్ ఆయనకు నోటీసులు జారీ చేసింది. అయితే, ఈ ఆరోపణలను నవీన్ రావు తీవ్రంగా ఖండించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేందుకే రాజకీయంగా ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. నిందితులతో తాను ఫోన్‌లో గానీ, నేరుగా గానీ ఎప్పుడూ మాట్లాడలేదని, తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో నవీన్ రావు విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారులు, జర్నలిస్టులతో పాటు కొందరు న్యాయమూర్తుల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాప్ చేశారని ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. గత నెలలో

ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావును సిట్ సుదీర్ఘంగా విచారించింది. ప్రభాకర్ రావు కస్టడీ విచారణపై సిట్ జనవరి 16న సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించనుంది. ఈ కేసులో ఇప్పటికే సిట్ అధికారులు మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ సహా పలువురు కీలక అధికారుల వాంగ్మూలాలను నమోదు చేశారు.

# పోలవరంపై ఏపీతో న్యాయపోరాటం... సుప్రీంలో వాదనలకు తెలంగాణ సర్కారు సిద్ధం

గోదావరి నదీ జలాల్లో తమకు దక్కాల్సిన వాటా విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు విస్తరణ పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులను తాము అంగీకరించలేది లేదంటూ, సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదివారం ముంబైలో సీనియర్ న్యాయ నిపుణులతో సమావేశమయ్యారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టును వ్యతిరేకించేందుకు న్యాయపరమైన చర్యలను తెలంగాణ ప్రభుత్వం ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్.. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో భేటీ అయ్యారు. కోర్టులో రాష్ట్రం తరఫున సమర్థవంతమైన,

బలమైన వాదనలు వినిపించాలని వారు న్యాయ నిపుణులను కోరారు. అవసరమైన అన్ని పత్రాలు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను సీఎం కార్యాలయం అప్రమత్తం చేసింది.తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా పోలవరం ప్రాజెక్టును బనకచర్ల లేదా నల్లమల సాగర్‌తో అనుసంధానించే విస్తరణ పనులను ఏపీ ప్రభుత్వం చేపడుతోందని పిటిషన్‌లో ఆరోపించింది. ఈ పనులను తక్షణమే ఆపాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని కోరింది. ఆమోదించిన అసలు డిజైన్ ప్రకారమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగాలని స్పష్టం చేసింది.తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నల్లమల సాగర్ ప్రాజెక్టు నివేదికలను

పరిశీలించడాన్ని కూడా పిటిషన్‌లో తప్పుబట్టింది. కేంద్ర జల సంఘం మార్గదర్శకాలను ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం డీపీఆర్ సిద్ధం చేస్తోందని, ఈ విస్తరణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, ఆర్థిక సహాయం నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ పిటిషన్ త్వరలో సుప్రీంకోర్టులో విచారణకు రానుంది.

# కేసీఆర్‌ను తిడుతున్న వారిని ఎన్నిసార్లు ఉరితీయాలి?

- మొదటి పేజి తరువాయి

యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ ను ఎన్నిసార్లు ఉరితీయాలని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని.. 420 హామీలు ఇచ్చి ఎగ్గొట్టినందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 420 సార్లు ఉరితీయాలని అన్నారు.

**చెక్ డ్యాములను పేల్చేసే చెత్త ప్రభుత్వం**

చరిత్రలో ఎన్నో చూశాం కానీ చెక్ డ్యామ్‌లను పేల్చేసే ఇలాంటి చెత్త ప్రభుత్వం ఇంకెక్కడా చూడలేమని కేటీఆర్ అన్నారు. నదీజలాలపై కాంగ్రెస్ దశాబ్దాలుగా చేస్తున్న ద్రోహాలకు కొన్ని వాస్తవాలు తెలంగాణ ప్రజల ముందు పెడుతున్నామని చెప్పారు. అవమానాలు భరించి ఆకలి బాధలు మాయం చేసిన మహానాయకుడు, తెలంగాణను అన్నపూర్ణగా మార్చిన నాయకుడు, రైతుబంధు కేసీఆర్ ను రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

**కూల్చివేతలు, పేల్చివేతలే..**

సమైక్య వాదుల బూట్లు పాలిష్ చేసిన అల్పుడి చేతిలో తెలంగాణ ఉండటం బాధగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి బేసిన్లు, బేసిక్స్ తెలవదని ఎద్దేవా చేశారు. వట్టెం, సుంకిశాలకు నష్టం జరిగితే బాగు చేయలేని అసమర్థ నాయకుడని విమర్శించారు. పేల్చివేతలు, కూల్చివేతలు, ఎగవేతలు తప్ప రాష్ట్రంలో ఏమీ జరుగడం లేదని కేటీఆర్ ఆరోపించారు.

# సంక్రాంతికి ఊరెళ్లే వారికి.. సీపీ సజ్జనార్ కీలక సూచనలు

- మొదటి పేజి తరువాయి

విలువైన వస్తువులను ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీ, కారు డిక్కీలో పెట్టొద్దు. బైక్‌లు, కార్లను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. రోడ్ల పక్కన చేయొద్దు.

ఊళ్లకు వెళ్లే వారు ఇంట్లోని బీరువా తాళాలను వారి వెంటే తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి . సొంతూళ్లకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక రూమ్‌లో లైట్ వేసి ఉంచాలి. ఇంటి ముందు చెత్త, న్యూస్ పేపర్, పాల ప్యాకెట్లు జమ కాకుండా చూడాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. బంగారు నగలు, క్యాష్ ఉంటే వాటిని బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలి. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని బస్సులు, రైళ్లలో జర్నీ చేస్తున్నప్పుడు ఆ బ్యాగ్‌ను కూర్చున్న సీటు దగ్గరే పెట్టుకోవాలి. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలను ఆన్‌లో ఉంచి మొబైల్‌కు కనెక్ట్ చేసుకొని గమనిస్తూ ఉండాలి. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్ మెంట్లలో కమిటీలను నియమించుకొని వాచ్ మన్లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. సొంతూళ్లకు వెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి అడ్రెస్, ఫోన్ నంబర్‌ను సంబంధిత పీఎస్‌లో ఇవ్వాలి. పోలీసులు ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకొని ఆ ఇంటి వద్ద గస్తీ ఏర్పాటు చేస్తారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి. ఈ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ చేయాలి

# ఏఐ 'గ్రోక్'పై కేంద్రం సీరియస్.. 72 గంటల గడువు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్)కు భారత ప్రభుత్వం స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఎక్స్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టూల్ 'గ్రోక్' ద్వారా అశ్లీల, అసభ్యకర కంటెంట్ సృష్టి, వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించింది. దీనిపై 72 గంటల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని స్పష్టం చేసింది.ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'గ్రోక్' లేదా ఎక్స్ఏఐ (IAI)కి చెందిన ఇతర సర్వీసులను దుర్వినియోగం చేసి అశ్లీల, నగ్న, అసభ్యకరమైన కంటెంట్‌ను హోస్ట్ చేయడం, ప్రచురించడం, షేర్ చేయడం వంటివి జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ నోటీసులో పేర్కొంది.కేంద్రం ఆదేశాలపై ఎలాన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ కార్ప్' ఆదివారం స్పందించింది. తమ ప్లాట్‌ఫామ్‌పై చట్టవిరుద్ధమైన కంటెంట్‌కు, ముఖ్యంగా చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (జూూవీ)కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటూనే ఉన్నామని తెలిపింది.

అవసరమైతే స్థానిక ప్రభుత్వాలు, చట్ట అమలు సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని 'ఎక్స్ సేఫ్టీ' విభాగం వెల్లడించింది. చట్టవిరుద్ధ కంటెంట్ కోసం 'గ్రోక్'ను వాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని

మస్క్ చేసిన పోస్టుకు 'ఎక్స్ సేఫ్టీ' బదులిచ్చింది.

నిబంధనలు పాటించని పక్షంలో ఐటీ చట్టం,బీఎన్ఎస్, ఇతర చట్టాల ప్రకారం తీవ్రమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్రం హెచ్చరించింది. చట్టవిరుద్ధ కంటెంట్ కాకుండా 'గ్రోక్' సాంకేతిక, పాలనాపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను సమగ్రంగా సమీక్షించాలని కూడా ఎక్స్‌ను ఆదేశించింది. ఆదేశాలను పాటించకపోతే ఐటీ చట్టంలోని సెక్షన్ 79 కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణను కోల్పోవాల్సి వస్తుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

### అనుకున్న టైమ్‌కు మేడారం

# జాతర పనులు పూర్తి చేస్తం

- మొదటి పేజి తరువాయి

కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. చెప్పిన టైమ్‌కు మేడారం అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. 20వ తేదీ లోపు సీఎం రేవంత్ రెడ్డి మేడారంలో పర్యటిస్తారని.. ఇక్కడే బస చేస్తారని చెప్పారు. దేశ నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# కృష్ణా జలాలపై త్వరలో అన్ని విషయాలు మాట్లాడతా

- మొదటి పేజి తరువాయి

ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. "నా మీద ఉన్న గౌరవంతో చంద్రబాబు ఆ పనులు ఆపేశారు" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈ నేపథ్యంలో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వివాదంపై స్పందించారు. కృష్ణా జలాల విషయంలో అసలు ఏం జరిగిందో త్వరలోనే మీడియా ద్వారా అన్ని వాస్తవాలు వివరిస్తానని ఆయన తెలిపారు. చంద్రబాబు వివరణ తర్వాత ఈ వివాదం ఎలాంటి మలుపు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# మదురో అరెస్ట్‌పై భారత్ ఆందోళన.. చర్చలతోనే పరిష్కారమని సూచన

వెనిజులాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అమెరికా డెల్టా దళాలు శనివారం అరెస్ట్ చేశాయి. వెనిజులాలోని ఓ సైనిక స్థావరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం వారిని యుద్ధనౌక ద్వారా న్యూయార్క్‌కు తరలించాయి. మదురోపై అమెరికా తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది. గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈ కేసులో మదురో భార్య, కుమారుడితో పాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు.మదురో అరెస్ట్ నేపథ్యంలో వెనిజులా సుప్రీంకోర్టు ఆదివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశ పరిపాలనలో అంతరాయం కలగకుండా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమించింది. దేశ సమగ్రత, పరిపాలనా కొనసాగింపునకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది.

**వెనిజులా పరిణామాలపై భారత్ ఆందోళన**

ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనిజులాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

# 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు.వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ.. ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత (బ్యాలెన్స్)తో కూడిన ప్రక్రియ అని మోదీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. 'టీమ్ ఫస్ట్' అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడాస్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు నిర్మాణం.




# భూదాన్ భూముల కబ్జా..! పేదల పట్టాలతో దందా..!
# రెవెన్యూ అండా.. దండా..?



గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో మరో అక్రమ షెడ్డుపై, ఆర్ఐ నిర్లక్ష్యపు చర్యలు..

### ఆ మండలంలో కబ్జాలకు రెవెన్యూ అధికారుల 'కొత్త నిర్వచనం'..!

- గాగిల్లాపూర్ భూధాన్ భూమిలో భారీ అక్రమ షెడ్డుకు ప్రజాప్రతినిధి సిఫార్సులట..?
- దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో కబ్జాలపై చర్యలకు అడ్డెవరు..?
- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పేదల పట్టాలతో ఆ అక్రమ నిర్మాణాలు..
- అక్టోబర్ 11న ఎందుకు కూల్చారు.. మళ్ళీ నిర్మిస్తే చర్యల్లేకుండా మౌనం ఎందుకు..?
- అధికారుల చర్యలకు 'కొత్త నిర్వచనం'.. బాధ్యతలకే తూట్లు..!
- ఇందిరమ్మ కాలనీలోనూ ఆ గల్లీ నాయకుడి సిఫార్సులకు రెవెన్యూ ప్రాధాన్యత..
- కమిట్‌మెంట్ ఇచ్చినవరకు కట్టుకోండి కొత్తవి నిర్మిస్తే కూల్చేస్తాం:రెవెన్యూ హైడ్రామా..?
- అధికారుల హాస్యాస్పద విధులు..!నోటీసులు ఇచ్చిన 227లో అక్రమ షెడ్డుపై చర్యలు నిల్.
- కూల్చినవి మళ్ళీ నిర్మించినా చర్యలు శూన్యం..! కొత్త కట్టడాలపై ఉదాసీనత..!
- అధికారుల విధుల పారదర్శకత ఎటువైపు..? పైఅధికారులు చెప్పినా..! పట్టించుకోరు..!

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పేదల పట్టాల పేరుతో, క్రయవిక్రయాల దందా..





బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో కూల్చేసిన తర్వాత, ఇలా అక్రమ నిర్మాణం పూర్తి..

- "తప్పైనా-ఒప్పైనా" వాళ్ళు 'చెప్పేది' చట్టం'..! 'చేసేదే శాసనం'..!
- దుండిగల్ మండలంలో అటకెక్కిన రెవెన్యూ చర్యలు..!
- తహశీల్దార్ మారినా..! ప్రభుత్వ భూముల పరిరక్షణపై నిర్లక్ష్యమే..
- వచ్చీరాగానే సర్వే నెం.120లో 28 అక్రమ నిర్మాణాలు కూల్చేసిన తహశీల్దార్..
- కొత్తగా నిర్మించే అక్రమ కట్టడాలపై ఉదాసీనతతో వ్యవహరించడం గమనార్హం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 4: దుండిగల్ గండిమైసమ్మ మండలంలో ప్రభుత్వం జారీచేసిన పేదల ట్టాలపై రెవెన్యూ అధికారులకు అవగాహన ఉందో.. లేదో అర్థం కాని పరిస్థితి..? లేకపోతే అధికారులుగా తాము ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే అహంకారమో తెలియదు కానీ..! దుండిగల్ రెవెన్యూ అధికారుల విధులు, కబ్జాలను ప్రోత్సహించే విధంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది..! 'తానా తందానా' అన్నట్టు పై అధికారులు సైతం మౌనం వహించడం, తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. "డి-నోటిఫికేషన్"తో గాగిల్లాపూర్ భూదాన్ భూములను కలెక్టర్ పరిరక్షిస్తుంటే..! ప్రజాప్రతినిధి సిఫార్సుల పేరుతో, భూదాన్ భూమిలో అక్రమ షెడ్లకు దుండిగల్ రెవెన్యూ అధికారులు సహకరించడంలో అర్థం ఏమిటని ప్రశ్నిస్తున్నారు..?ఇలాంటి రెవెన్యూ అధికారులే గతంలో చేసిన పొరపాట్లను 2024 "జనవరి-ఫిబ్రవరి" నెలలో గత "కలెక్టర్ గౌతమ్ పోట్రు" డి-నోటిఫికేషన్‌తో రద్దుచేశారు.. ఇప్పుడు కొత్తగా మరికొన్ని అక్రమ షెడ్లకు దుండిగల్ గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారులు బహిరంగంగానే సహకరించడం, ఏమనుకోవాలి..? ముడుపులు స్వీకరించారని అనుకోవాలా..? సిఫార్సులు అడ్డుపడ్డాయాని భావించాలా..? రెండు అక్రమ నిర్మాణాల కోసం ఇరవై మందిని వెంటేసుకొని ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్తే సక్రమం అయిపోతుందా..? సక్రమం అయితే ప్రెస్‌నోట్ రిలీజ్ చేయండి..

-4లో

## బహుదూర్‌పల్లి శ్రీరామ అయోధ్య విల్లాస్..
# నూతన కమిటీ ఎన్నిక..
### అధ్యక్షుడిగా వెంకట్రావు ఏకగ్రీవం.. ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు..



బహుదూర్‌పల్లి శ్రీరామ అయోధ్య విల్లాల నూతన కమిటీ

**దుండిగల్, పెన్ పవర్, జనవరి 4:** బహుదూర్‌పల్లి శ్రీరామ అయోధ్య విల్లాస్‌లో నూతన కార్యవర్గం కమిటీ ఎన్నికలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సభ్యుల సమ్మతితో వెంకట్రావు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.. ఉపాధ్యక్షుడిగా మదన్ రావు, జనరల్ సెక్రెటరీగా సగ్గిడి నర్సింగ్ రావు, కోశాధికారిగా గోవర్ధన్ రెడ్డి గెలుపొందారు. అలాగే ఇతర కమిటీ సభ్యులు కూడా ఎన్నికై, నూతన కార్యవర్గం పూర్తిగా ఏర్పాటైందని ప్రధాన కార్యదర్శి సగ్గిడి నర్సింగరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కాలనీ వాసులు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ, శ్రీ రామ అయోధ్య విల్లాస్ అభివృద్ధి, కాలనీ సమస్యల పరిష్కారం, నివాసితుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పారదర్శక పాలనతో పాటు సమిష్టి నిర్ణయాల ద్వారా కాలనీని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.. నూతన కమిటీపై కాలనీ వాసుల్లో ఆశలు నెలకొన్నాయి. భవిష్యత్తులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, భద్రత, శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని నివాసితులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు..

# కవ్వాల్ టైగర్ జోన్‌లో..!
# ఇసుక తవ్వకాలు





### టైగర్ జోన్‌లో పాగా వేసిన ఇసుక మాఫియా..!

- పులుల సంరక్షణ కేంద్రంలో మార్మోగుతున్న ఇసుక ట్రాక్టర్‌ల ఇంజన్‌ల మోత..
- వన్యప్రాణుల ఆవాసాలలో, అక్రమార్కుల తవ్వకాలు..
- జన్నారం "ఎకో సెన్సిటివ్"లో అక్రమ ఇసుక రవాణాపై అటవీశాఖ ఉక్కుపాదం..
- ట్రాక్టర్‌లకు నెంబర్‌లు ఉండవు.. డ్రైవర్‌లకు లైసెన్స్‌లు ఉండవు..
- అడవుల పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలన్న ఎఫ్ఆర్ఓ..

### ట్రాక్టర్‌లకు నెంబర్‌లు ఉండవు.. డ్రైవర్‌లకు లైసెన్స్‌లు ఉండవు..

పట్టుబడిన ట్రాక్టర్లకు కనీసం రిజిస్ట్రేషన్ నెంబర్లు లేవు. రోడ్ల మీద యథేచ్ఛగా తిరుగుతున్నా స్థానిక పోలీసులు (సబ్ ఇన్‌స్పెకర్) ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తుండగా..? డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేకపోయినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి..? అడవిని కాపాడటం కేవలం అటవీ శాఖ బాధ్యతేనా..? పోలీసు, రెవెన్యూ విభాగాలకు బాధ్యత లేదా..? అంటూ స్థానిక నాయకులు నిలదీస్తున్నారు.. ఎకో సెన్సిటివ్ జోన్‌లో తవ్వకాలు జరిపితే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని, అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేటగాళ్లు, స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, అటవీ సంపదను దోచుకుంటే జైలు శిక్ష తప్పదని ఎఫ్ఆర్ఓ స్పష్టం చేశారు. సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, అడవిని కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు..

అదిలాబాద్, పెన్ పవర్, జనవరి 4:కవ్వాల్ టైగర్ జోన్ అది ఒక పులుల సంరక్షణ కేంద్రం.. నిశ్శబ్దంగా ఉండాల్సిన అడవిలో ఇప్పుడు ట్రాక్టర్ల ఇంజన్ల మోత మార్మోగుతోంది. వన్యప్రాణుల ఆవాసాలను ఇసుక మాఫియా యథేచ్ఛగా తవ్వేస్తోంది. జన్నారం 'ఎకో సెన్సిటివ్ జోన్'లో అక్రమార్కులు సాగిస్తున్న దందాపై అటవీశాఖ అధికారులు ఉక్కుపాదం మోపినప్పటికీ, స్థానిక పౌర యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.. అడవిలో 'మెరుపు' దాడి చేసి రెండు ట్రాక్టర్లు సీజ్ చేశారుశనివారం ఇందన్పల్లి సెక్షన్ పరిధిలో అడవి తల్లి కడుపు కోసి ఇసుకను తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో జన్నారం ఎఫ్.ఆర్.ఓ లక్ష్మీనారాయణ బృందం రంగంలోకి దిగింది. అటవీ మార్గాల్లో మాటు వేసి, అక్రమంగా వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ఎఫ్.ఎస్.ఓలు రవి, హన్మంతరావు, ఎఫ్.బి.ఓలు రాజేశ్వర్, శ్రీనివాస్, తన్వీర్ పాషా మరియు బేస్ క్యాంప్ సిబ్బంది అత్యంత ధైర్యసాహసాలతో పాల్గొన్నారు. వ్యవస్థల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..అటవీ శాఖ అధికారులు ఒకవైపు అడవిని కాపాడేందుకు పోరాడుతుంటే, మరోవైపు మండలంలోని సంబంధిత పలు విభాగాలు అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి..

అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో కేవలం అటవీ శాఖ మాత్రమే స్పందిస్తే సరిపోదు. స్థానిక పోలీస్, రెవెన్యూ యంత్రాంగం కూడా సమన్వయంతో పనిచేస్తేనే మాఫియా ఆటలు అరికట్టడానికి వీలవుతుంది.. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జన్నారం అడవిలో సాగుతున్న ఈ ఇసుక అక్రమ దందాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

# భూదాన్ భూముల కబ్జా..!

## పేదల పట్టాలతో దందా..! రెవెన్యూ అండా.. దండా..?


















డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో..


డి.పోచంపల్లి సర్వే నెం.120లో


దుండిగల్ మండలం డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో..


డి.పోచంపల్లి సర్వే నెం.120/45లో.

**సర్వే నెం.120 ప్రభుత్వ భూమి కబ్జాలను కొందరు విలేఖరుల ముసుగులో, రెవెన్యూ అధికారుల చర్యలకు అడ్డు పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. కబ్జాదారుల వెంటే ఉంటున్న ఆ విలేఖరులు, కబ్జాల్లో వాటాదారులా..? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. అక్రమమని తెలిసినా, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా, చేతులు ముడుచుకొని కూర్చోవడంలో అర్ధం..? గాగిల్లాపూర్ భూదాన్ భూమిలోనూ అక్రమ భారీ షెడ్డుకు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలను కూడా ధిక్కరించి, ప్రజాప్రతినిధి సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.. చర్యలు తీసుకోకుండా, నిర్లక్ష్యం వహించే దుండిగల్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై తీవ్ర విమర్శలు ఉన్నాయి.. భూదాన్ భూముల పరిరక్షణపై స్పష్టమైన నిబంధన లతో కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ..! భూదాన్ భూమిలో అక్రమ షెడ్లను ప్రోత్సహించేది ఎవరు..? బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో లబ్దిదారులకు కేటాయించిన కాలం చెల్లిన పట్టాలను, ఇతరులు కొనుగోలు చేస్తే ప్రభుత్వ పట్టాల స్వరూపం కోల్పోతుందని దుండిగల్ రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం బాధాకరం.. ఖాళీస్థలాలను స్వాధీన పరుచు కోకుండా, ఏవిధంగా సక్రమం చేస్తున్నారో తహశీల్దార్ సమాధానం ఇవ్వాలి..? బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుకు నోటీసులు ఇచ్చిన దుండిగల్ గండిమైసమ్మ మండలం తహశీల్దార్, నేటికీ చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.. అధికారులు ఉన్నదే అక్రమ నిర్మాణాలను సక్రమం చేసేందుకేనా..?**

-3 పేజి తరువాయి

ఒకవేళ నేతల సిఫార్సులే అయితే, కొత్తగా "చట్టబద్దత" ఏమైనా కల్పించారా..? అదైనా చెప్పండి..! లేకపోతే ఉన్నతాధికారుల మద్దతు కూడా ఉందా..? బౌరంపేట్, గాగిల్లాపూర్, దొమ్మర పోచంపల్లి గ్రామాల కబ్జాలపై "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలు వచ్చినా స్థానిక తహశీల్దార్ స్పందించక పోవడం,పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు, ఈ విషయంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్, జిల్లా అడిషనల్ కలెక్టర్ అండ్ మల్కాజిగిరి ఆర్డీవో మౌనానికి సంకేతం..? మౌనం వీడి అక్రమమా.. సక్రమమా తేల్చండి..

### అనాలోచిత నిర్ణయాలతో.. అక్రమ కట్టడాల ప్రోత్సాహం..?

బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో అక్టోబర్ 11న ఆర్ఐ రవికుమార్ కూల్చివేతలు, బెదిరింపుల చర్యలా..? కూల్చివేసిన నాగరాజు బేస్మెంట్, మరుసటిరోజు నుంచే పనులు చేపట్టి ఇళ్ళు నిర్మాణం పూర్తి చేయడంలో సహకరించిన అధికారులు ఎవరు..? ఇందిరమ్మ కాలనీలోనే జగన్నాథ్ రెడ్డి అక్రమ నిర్మాణంపై గుంతలు తీసిన నాటి నుండి అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా నేడు స్లాబుల నిర్మాణం వరకు ఎలా తయారైంది..? విఆర్ఏలు, జిపివో, నిత్యం పనులు నిలిపేశామని చెప్పినప్పటికీ..! మొదటి స్లాబు పూర్తిచేసి రెండవ స్లాబుకు సిద్దం కావడానికి అధికారుల ప్రమేయం లేదంటే నమ్మవచ్చా..? కాలం చెల్లిన పేదల పట్టాలు అంటూ, వార్తలు వచ్చినా చర్యలేవి తహశీల్దార్ సారూ..? పత్రికల్లో వార్తలు పదే పదే వస్తున్నాయని, పలు విధాలుగా ఆలోచించిన అధికారులు..! అక్రమ నిర్మాణాల పట్ల చర్యలు తీసుకోకుండా మౌనం వహించడంలో ఆంతర్యం..? బేస్మెంట్ దశలోనే కూల్చేసిన అక్రమ కట్టడాలు మళ్ళీ నిర్మిస్తుంటే, చర్యలు లేవంటే ఉద్దేశపూర్వకంగానే సహకరించే ధోరణితో విధులు నిర్వర్తిస్తున్నట్టా..? సంబంధిత నిర్మాణాలు సక్రమమేనని జిల్లా అడిషనల్ కలెక్టర్‌తో (రెవెన్యూ) వివరణ ఇప్పించగలరా..? తమకున్న పలుకుబడితో కబ్జాదారులకు అండగా ఉంటూ, అధికార దుర్వినియోగానికి పాల్పడితున్నారా..? సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ భూములు పరిరక్షిస్తున్నారా..? పరులకు కట్టబెడుతున్నారా..? సమాధానం చెప్పాల్సిన సమయం

త్వరలోనే వస్తుంది.. ఓ రెవెన్యూ అధికారి బరితెగింపు సమాధానం, ఈ రెండు మాత్రమే కట్టుకోండి, (నాగరాజు–జగన్నాథ్‌రెడ్డి).. మళ్ళీ కొత్తగా ఎవరైనా నిర్మిస్తే పత్రికల్లో వార్తలు వచ్చేలోపే కూల్చేస్తామని హాస్యాస్పదంగా హెచ్చరించారట..! హెచ్చరిక బాగాన ఉన్నప్పటికీ..!


దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120లో..

"అందరికో న్యాయం.. ఈ ఇద్దరికో న్యాయమా..? అంటూ విమర్శలు వెల్లువెత్తాయి.. ఇప్పుడు ఇదే విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది..
18 ఏళ్ళనాటి ప్రభుత్వ పట్టాలు, కొనుగోలు చేసి, నిర్మించి, అమ్ముకునే, క్రయవిక్రయాల దందాలను దుండిగల్ రెవెన్యూ అధికారులు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారా..?


సర్వే నెం.120 దొమ్మర పోచంపల్లి..


డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో


దుండిగల్ మండలం డి.పోచంపల్లి 120లో..

# ట్రాఫిక్ సెన్స్ లోపల వల్లే ప్రాణాలు హరిస్తున్నాయి..

**హైదరాబాద్ పెన్ పవర్:**ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామ సమీపంలో కాంక్రీట్ కూలీల వాహనం బోల్తా, ఒకరు మృతి పలువురికి గాయాలు. క్షతగాత్రులను 108 ద్వారా ఏటూరునాగారం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు జరిగిన సంఘటనపై మరింత వివరణ తెలియాల్సి ఉంది.. ఆకస్మికంగా చోటు చేసుకున్న ఘటనపై రంగ ప్రవేశం చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.. పొట్ట చేత పట్టుకొని రెక్క ఆడితే కానీ డొక్కాడని కార్మికుల బతుకులు ట్రాఫిక్ సెన్స్ వైఫల్యం వల్ల కార్మికుల ప్రాణాలు గాల్లోకి కలుస్తున్నాయి.. గతంలో కూడా మిర్చి కోత రైతులు ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలను తరలించే క్రమంలో కూడా ఎన్నో ఘటనలు ప్రమాదానికి గురైనప్పటికీ, సంబంధిత రవాణా శాఖలో మాత్రం చలనం లేదు ములుగు జిల్లా వ్యాప్తంగా ఇసుక క్వారీలు అధిక సంఖ్యలో కొనసాగుతున్నందున, రోడ్ల దుస్థితి విషమించినందున ప్రయాణికులు జర అప్రమత్తంగా ప్రయాణాన్ని కొనసాగించాలి అంటూ పలువురి సూచన విధానం. ఇప్పటికైనా సంబంధిత శాఖ నిద్ర మత్తును వేడి జరుగుతున్న విపత్తుల విషయంలో అప్రమత్తంగా అధికారులు ప్రవర్తించాలి అంటూ ప్రయాణికులలో పలువురు సూచన..



# నిర్వహణ భారంగా మారుతున్న సిఏసి సెంటర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్ర ప్రభుత్వ పరిధిలో నిర్వహిస్తూ ఉన్న సిఎస్సి సెంటర్లు కాలం చెల్లె స్థాయికి రానున్నాయి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు మరియు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిఎస్సి మీసేవ సెంటర్లను నిర్వహిస్తూ ఉన్నాయి కానీ వీటి మధ్య సమన్వయ లోపం వలన రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న మీసేవ సెంటర్లకే అన్ని రకములైన సేవలను కేటాయిస్తూ ఉండటం వలన సిఎస్సి సెంటర్ నిర్వాహకులు నష్టాల బారిన పడుతున్నారు అలాగే మీసేవ సెంటర్లు మండల స్థాయిలలో ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటాయి కానీ సిఎస్సి సెంటర్లు ప్రతి గ్రామస్థాయిలలో ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటాయి అలాగే నిత్యం ప్రజల్లో మమేకంగా సి ఎస్ సి సెంటర్ నిర్వాహకులు ఉంటారు కానీ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నటువంటి ఆధార్ కార్డు పాన్ కార్డు ఓటర్ కార్డ్ రైతు గుర్తింపు కార్డు లాంటి ప్రతి వాటిని మీసేవ సెంటర్లకు కేటాయించడం జరిగేను తద్వారా సిఎస్సి సెంటర్ల నిర్వహణ అనేది సిఎస్సి సెంటర్ నిర్వాహకులకు భారంగా మారెను సిఎస్సి విభాగం నందు ఉన్నటువంటి జిల్లా స్థాయి యంత్రాంగం కేవలం టార్గెట్లను మాత్రమే చూపిస్తూ ఉండటము ఏ రకమైన కొత్త సర్వీస్ లో తీసుకుని రాకపోవడం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి ఇన్ని రోజులు అవుతున్న నేటికి సిఎస్సి సెంటర్ విభాగంలో తెలంగాణ ప్రభుత్వం యొక్క సర్వీసులు లేకపోవడం గమనార్హం పేర్కొనవచ్చును అదేవిధంగా పక్కనే ఉన్న మిగిలిన రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం యొక్క సర్వీసులు సిఎస్సి విభాగాలలో ఉండడం ప్రశ్నలకు తావు ఇస్తూ ఉన్నది ఒక సిఎస్సి సెంటర్ నిర్వహణ కొరకు కనీసం రెండు లక్షల రూపాయల వ్యయంతో కూడుకున్న పరిస్థితి కలదు తెలంగాణ రాష్ట్ర పరిధిలో రిజిస్ట్రేషన్ జరిగి ఉన్నటువంటి సి ఎస్ సి సెంటర్లు కనీసం పదివేల పైచిలుకు కలవు పరోక్షంగా యువత ఉపాధికి సి ఎస్ సి సెంటర్లు కూడా నిలయంగా ఉన్నాయి కానీ ప్రస్తుతం జరుగుతున్న సర్వీసుల ప్రక్రియల మూలంగా సి ఎస్ సి సెంటర్ల నిర్వహణ భారంగా మారనుంది అనేది కొంతమంది సిఎస్సి సెంటర్ల నిర్వహిస్తున్నటువంటి వి ఎల్ ఈ ఆవేదన జిల్లా స్థాయి యంత్రాంగం ఈ విషయం మీద ఆలోచన చేయని పక్షంలో గ్రామస్థాయిలలో ప్రభుత్వ సంక్షేమం అనేది నిర్వీర్యంగా మారే అవకాశం కలదు.

# హైదరాబాద్ లో పెరిగిన వీధికుక్కల బెడద..చిన్నారులపై దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గోల్నాక డివిజన్ అన్నపూర్ణ నగర్ లో ఓ ఎనిమిది ఏళ్ల బాలుడు పై వీధి కుక్కలు మూక్కుమ్మడిగా దాడి చేసి తీవ్రంగాగాయపరిచాయి. కాళ్లు, గజ్జలు, వెనక భాగంలో రక్తం చిందేలా కుక్కలు కరిచాయి. దీంతో ఆ బాలుడు వణికిపోయి పరుగులు తీయడంతో వెంటపడి మరీ కుక్కలు కరిచాయి.పోలీసులు తెలిపిన కథనం ప్రకారం గోల్నాక అన్నపూర్ణ నగర్ లోమల్లేష్ అనే వ్యక్తి ఇటీవలనే కిరాయికి వచ్చాడు. అతని కుమారుడు ఎనిమిదేళ్ల రుత్విక్ సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో బస్తీలోని సాయిబాబా గుడి దగ్గర తన స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు.

**ఒక్కసారిగా దాడిచేయడంతో**

అదే సమయంలో అక్కడకు వచ్చిన ఎనిమిది వీధి కుక్కలు ఒక్కసారిగా ఆ బాలుడు పై దాడి చేశాయి. ఎక్కడపడితే అక్కడకరిచాయి. ఇది గమనించిన స్థానికులువెంటనే ఆ కుక్కలను తరిమికొట్టి వాటి నుంచి ఆ బాలుడిని రక్షించారు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా.. ఆ బాలుడు ని తీసుకొని మొదట సల్లకుంటలోని ఫీవర్ హాస్పిటల్ కి వెళ్ళారు. కుక్క కాటు తీవ్రంగా ఉండడంతో వారు ప్రాథమిక చికిత్స చేసి తదుపరి మంచి చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. ఈ ప్రాంతంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

~చాశ్రీంశీ =ముఎ – వీవతీశీ ఎతీుఱఅ : మెట్రో రైలు డెడ్ స్లో.. కారణం తెలిస్తే ఆశ్చర్యపోతారంతే

**అధికారులకు ఫిర్యాదు చేసినా...**

మహిళలు చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయని ఎన్ని మార్లు జీహెచ్ఎంసీ అధికారులకు తెలిపినా స్పందించడం లేదని అంటున్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కమల నగర్ లో కూడా ఓ బాలికను కుక్కలు మూసి లోకి వెళ్ళిన సంఘటన చోటుచేసుకుందని స్థానికులు గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీధికుక్కలను తీసుకెళ్లాలని లేకపోతే తమ ప్రాంతంలో మనుగడ కూడా కష్టంగా మారుతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# అంబేద్కర్ విగ్రహం ఎస్సీ కమిటీ హాల్ మరచిన ప్రజా ప్రతినిధులు...



**హైదరాబాద్ పెన్ పవర్:** మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఏఎంసీ కాలనీలో చీకటి దశమ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్ రాజు పాల్గొని మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా గడుస్తున్న ఇప్పటి వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించలేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. దీనికి బాధ్యులు ఎవరు అని ఆయన ప్రశ్నించారు ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆరు సంవత్సరాలుగా నిర్మాణం కాక శిథిలావస్థ కు చేరిందని, చెత్త చదరంతో ముళ్ళకంపలతో అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రపంచ జ్ఞాని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విషయంలో ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ, పట్టించుకోవట్లేదనీ, ఏజెన్సీలో దళితులను ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారని, దళితుల అభ్యున్నతి కృషి చేయడంలో విఫలం చెందారని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాల మహానాడు ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు శాంతి రాజు , బర్ల రామకృష్ణ, కుషిని శ్యామ్ రాజు, యేసు, కొంగ, దిలీప్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉచిత సంతాన సాఫల్య శిబిరం....



**హైదరాబాద్ పెన్ పవర్:** సంతానం లేక ఇబ్బంది పడుతున్న దంపతుల కోసం భద్రాచలం పట్టణంలోని జీవన్ హాస్పిటల్స్ మరియు 9ఎం ఫెర్టిలిటీ వారి సాధ్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో 80 మంది మహిళలు కు కావలసిన పరీక్షలు చేపించి సంతాన సాఫల్యం కోసం చేయవలసిన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ జీవన్ హాస్పిటల్స్ వైద్యురాలు చల్లగుళ్ల స్పందన మాట్లాడుతూ జీవన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంత మహిళల సౌలభ్యం కోసం నైన్ ఎం వారి సహకారంతో ఉచితంగా సంతాన సాఫల్య శిబిరం నిర్మించామని తెలిపారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న దంపతులకు కావలసిన పరీక్షలను సైతం ఉచితంగా నిర్వహించా మని అన్నారు. సంతానం అనుకున్న సమయానికి కలగకపోవడం భార్యతో భర్తతో తప్పుగా భావించి కుటుంబాల్లో కలహాలు రావటం సహజమని వాటికి చెక్ పెట్టేందుకే వైద్యరంగంలో ఉన్న నూతన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సంతానం లేని దంపతులకు సంతాన సరైన పద్ధతిలో కలిగే విధంగా ఈ శిబిరం నిర్వహించామని అన్నారు. వైద్యరంగం ఎంతగానో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సరైన సమయంలో సరైన వైద్యులను సంప్రదించి మనకున్న సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని సూచించారు .జీవన్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంత మహిళల కోసం గత నెలలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు సైతం నిర్వహించామని వారికి కావలసిన వైద్య సలహాలతో పాటు అన్ని రకాల పరీక్షలను ఉచితంగానే అందించామని గుర్తు చేశారు. జీవన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గర్భిణీ దాల్చిన నాటి నుండి మహిళలకు కావలసిన వైద్య సేవలతో పాటు మానసిక ధైర్యం పెంపొందించేందుకు కావలసిన కౌన్సిలింగ్ కూడా అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోనే అత్యధిక నార్మల్ డెలివరీ లు చేసిన ఘనత కూడా జీవన్ హాస్పిటల్ కి దక్కుతుందని ఈ సందర్భంగా స్పందన స్పష్టం చేశారు.

# మెట్రో రైలు డెడ్ స్లో.. కారణం తెలిస్తే ఆశ్చర్యపోతారంతే

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఇంకా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అందుకు అనేక కారణాలున్నాయి.అధికారుల నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్ మెట్రో రైల్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు. హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టి కొన్నేళ్లుగా నిర్వహిస్తుంది. అయితే నష్టాలు అధికంగా వస్తున్నాయని చెప్పి తాము మెట్రో రైలు నుంచి తప్పుకుంటామని చెప్పింది. ఇందుకు ప్రభుత్వం కూడా అంగీకరించింది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి పదిహేను వేల కోట్లు చెల్లించి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించారు.

**టేకోవర్ చేసే ప్రక్రియ...**

మెట్రోరైలును టేకోవర్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కానీ ఈ ప్రకటన చేసి నాలుగు నెలలు గడచినా టేకోవర్ నేటికీ పూర్తి కాలేదు. టేకోవర్‌ను జరిపించడానికి టెండర్ వేసి మరీ ఎంపిక చేసిన ట్రాన్సాక్షన్ అడ్వైజర్ "ఐడీబీఐ క్యాపిటల్" సంస్థకు మెట్రో రైల్, లేదా మామూలు రైల్వే టెక్నాలజీని సాంకేతికంగా మదింపు చేసే అనుభవం కానీ సామర్థ్యం కానీ లేవని తెలిసింది. దీంతో తలపట్టుకున్న అధికారులు ఈ అంశాల్లో పూర్వ అనుభవం ఉన్న మరొక కన్సల్టెంట్ కోసం వెతుకుడుతున్నారని తెలిసింది. దీంతో మెట్రో రైలు టేకోవర్ అంశం ఇంకా నలుగుతూనే ఉంది. దీనిపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సీరియస్ అయినట్లు తెలిసింది.



**మరికొంతకాలం పట్టే అవకాశం...**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మూడు నెలల్లో ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ చేస్తామని నాలుగు నెలల క్రితం చెప్పినా, నిజానికి ఇప్పుడు కొత్త ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌ను ఎన్నిక చేసే ప్రక్రియనే మరో ఆరునెలలు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎల్ అండి టి సంస్థ ఎన్నో ఒప్పందాలు కుదుర్చుకుందని, అవన్నీ సరిగ్గా అధ్యయనం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేస్తే, ఆ తరువాత న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మెట్రో ఉన్నతాధికారులు చెబుతున్నారు. మెట్రోను టెకోవర్ చేయడానికి రూ 15,000 కోట్ల డబ్బు కావాలని. అసలే ఆర్థిక పరిస్థితి సరిగ్గాలేని ఈ సమయంలో అంత డబ్బును సమకూర్చుకోవడం కూడా కష్టమేనని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. మరి మెట్రో రైలు ప్రాజెక్టును ఎప్పటికి టేకోవర్ చేస్తారు? మెట్రో రైలు విస్తరణ పనులు ఎప్పుడు చేపడతారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగానే ఉంది.

# బాబూ.. జర జాగ్రత్త.. చలిలో బయటకు వచ్చారో ఇక అంతే?



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా చలితీవ్రత ఎక్కువగా ఉంది. అందులోనూ ఎప్పుడూ లేని విధంగా తెలుగు రాష్ట్రాలు కూడా చలితీవ్రతకు ఇబ్బంది పడుతున్నాయి. గడ్డకట్టే పరిస్థితులు నెలకొని ఉండటంతో అందరిలోనూ ఆందోళన ఎక్కువగా ఉంది. రానున్న కాలంలో చలితీవ్రత మరింత ఎక్కువవుతుందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వచ్చే నెల వరకూ చలిగాలుల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది. ప్రజలు చలిగాలులతో మరో నెల రోజుల పాటు ఇబ్బందులు పడక తప్పదని చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రావద్దని చెబుతున్నారు.

**అన్ని ప్రాంతాల్లో...**

ఆంధ్రప్రదేశ్ లోనూ చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. గత నెలరోజులకు పైగానే చలితీవ్రత ఎక్కువగా ఉంది.ఏజెన్సీ ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు అప్పుడూ.. ఇప్పుడూ.. ఎప్పుడూ.. నమోదవుతూనే ఉంటాయి. అందులోనూ ఉక్కపోత వాతావరణం ఉండే కోస్తాంధ్ర ప్రాంతంలోనూ చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం గమనార్హం. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రాంతాల్లో ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. కానీ గత కొన్ని రోజుల నుంచి ఇక్కడ కూడా చలితీవ్రత ఎక్కువగా ఉంది. మరొకవైపు ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదయ్యే రాయలసీమ జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత ఎక్కువ కావడం విశేషం. అందుకే ఏపీ అంతటా చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది.

**మూడు నెలల నుంచి...**

తెలంగాణలో చలిగాలుల పరిస్థితి ప్రతి సీజన్ లో ఉంటుంది. నవంబరు నెల నుంచి డిసెంబరు వరకూ చలి కొంత అధికంగానే తెలంగాణలో ఉంటుంది. కానీ ఈసారి నవంబర్ నెలలో ప్రారంభమైన చలితీవ్రత ఇప్పటి వరకూ కొనసాగుతూనే ఉంది. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలులతో మరింత చలి తీవ్రత ఎక్కువయింది. ప్రధానంగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కొమ్రంభీ ఆసిఫాబాద్, వరంగల్ వంటి ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో పాటు దట్టమైన పొగమంచు కూడా కురుస్తుండటంతో వాహనదారులను ఇబ్బందులు పెడుతుంది.

# ఆదివాసి ఆనవాళ్లు...!

**తెరపైకి ఇలవేల్పుల చరిత..**
**పీవో రాహుల్ అద్భుత సృష్టి...**
**పుస్తక రూపంలో అందుబాటులోకి...**
**భావితరాలకు సజీవ సంస్కృతి...**

**పక్షుల కిలకిల రావాలు..! జింక పిల్లల గంతులు...! పచ్చని అడవులు...! ఆదివాసీల జీవనం...! మాఘ పున్నమి పండు వెన్నెల్లో ఇలవేల్పుల జాతరలు...! ప్రకృతి సమతుల్యత...! సాంప్రదాయ సజీవం...! ఇది ఆదివాసీ సమాజం...! అందమైన వారి నినాదం...!'**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివాసీ తెగల జీవన విధానం, సజీవ సాక్షాలను ఇప్పటికే ట్రైబల్ మ్యూజియంలో భద్రపరిచిన భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ మరో అడుగు ముందుకేశారు. ఆదివాసి ఇలవేల్పుల చరితను వెలుగులోకి తెచ్చి భావి ఆదివాసీ సమాజానికి అందించేందుకు పూనుకున్నారు. తలపతులు, ఆర్తి బిడ్డల బృందం కొండ కోనల్లో సేకరించిన సమాచారం పుస్తక రూపం దాల్చుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...


**తెరపైకి ఆదివాసీల ఇలవేల్పుల చరిత :**

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ గిరిజన పాలన సర్వత్ర ప్రశంసలు అందుకుంటోన్న విషయం విధితమే. ప్రతి అంశం వారికి ప్రత్యేకమే. గిరిజన అభ్యున్నతికి, వారి భాష, సంస్కృతికి పెద్దపీట వేస్తూ వచ్చిన పిఓ రాహుల్ అద్భుత ఆలోచన ట్రైబల్ మ్యూజియం ఆధునికీకరణ. అంతటితోనే పిఓ రాహుల్ ఆగిపోలేదు. మరో నూతన సృష్టికి తెర లేపారు. అదే ఆదివాసి ఇలవేల్పుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం. తలపతులు, ఆర్తి బిడ్డలను బృందంగా ఏర్పాటు చేసి ఆంధ్ర, తెలంగాణ గోదావరి తీర ప్రాంతాల్లో సుమారు 142 ఇలవేల్పులు వెలిసిన ప్రదేశాలను సందర్శించి ఆదివాసి పెద్దమనుషులను, పూజరులను కలిసి 7గట్టు గోత్రాలు, 750 ఇంటిపేర్లతో ఉన్న ఇలవేల్పుల చరిత్రను సేకరింపజేశారు. పిఓ కూడా స్వయంగా ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొన్నారు. సేకరించిన ఈ సమాచారాన్ని పుస్తక రూపంలో తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఐటీడీఏ పీవో రాహుల్ స్వయంగా ఈ విషయాన్ని పరిశీలిస్తున్నారు. త్వరలోనే ఇది అందుబాటులోకి రానుంది. రాబోయే తరానికి ఈ ఆదివాసి చరిత్ర ఎంతగానో ఉపకరించనుంది.

**అద్భుత సాంస్కృతిక సంకలనం :**

ఆదివాసి కోయ ఇలవేల్పుల చరిత్ర ఒక అద్భుతమైన సాంస్కృతిక సంకలనం అని చెప్పవచ్చు. అడవులు, కొండలు, నదులతో అనుబంధంగా జీవించే కోయ సమాజం తమ జీవన విధానంలో దేవతలను కేవలం ఆరాధన మూర్తులుగా మాత్రమే కాకుండా, తమ రక్షకులుగా, మార్గదర్శకులుగా, సామూహిక చైతన్యానికి ప్రతీకలుగా భావిస్తుంది. తరతరాలుగా నోటి మాటల ద్వారా,ఆచారాలు–సాంప్రదాయాల ద్వారా నిలిచిన ఈ కులదేవతల విశ్వాసాలు కోయ తెగ యొక్క చరిత్ర, సామాజిక వ్యవస్థ,నైతిక విలువలను ప్రతిబింబిస్తాయి.22 అంశాల ఆధారంగా సేకరించబడిన సవివివరణాత్మక సమాచారం, సమగ్రంగా విశదీకరించడం ఈ గ్రంథానికి ప్రామాణికతను సంతరించి పెట్టింది. కోయ తెగలో వివిధ కులదేవతల ఆవిర్భావ కథలు, పూజా విధానాలు,పండుగలు, ఇలవేల్పుల పండుగలు జరుపుకునే సమయము,వాటి వెనుక ఉన్న లోతైన అర్ధాలను సమగ్రంగా పరిచయం చేసిన విశ్వసనీయమైన ప్రయత్నం ఈ పుస్తకంలో కనిపిస్తుంది. ఆధునికత ప్రభావంతో వేగంగా మారుతున్న జీవనశైలిలో కనుమరుగవుతున్న ఈ ఆచారాలను లిఖిత రూపంలో భద్రపరచటం గమనార్హం. ఈ గ్రంథం ద్వారా కోయ తెగ ఆధ్యాత్మిక వారసత్వాన్ని గౌరవిస్తూ భవిష్యత్తు తరాలకు ఒక అమూల్యమైన సంపద అందజేయడం చోటు చేసుకుంది. కోయ కులదేవతల అధ్యయనం ద్వారా మనకు ప్రకృతి – మానవ సంబంధం,సామాజిక జీవనస్ఫూర్తి, భక్తి యొక్క సరళమైన శక్తివంతమైన రూపం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.ఈ పుస్తకం పరిశోధకులకు, విద్యార్థులకు అలాగే సాంస్కృతిక సంపదపై ఆసక్తి కలిగిన ప్రతి పాటకునికి ఒక విశ్వసనీయ మార్గదర్శిగా నిలుస్తుందనటంలో ఏమాత్రము అతిశయోక్తి లేదు. ఈ అరుదైన సమగ్ర సంకలనం రూపకల్పనకు మార్గదర్శకులు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఐఏఎస్ ను మరి అభినందిద్దామా...!

# చంద్రబాబుని ఇరికించిన రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణా రాజకీయాలు నీటి వివాదాలు అధికార ప్రతిపక్షాల మధ్య సవాళ్ళు ప్రతి సవాళ్ళూ ఇవన్నీ కలసి ఏపీ సీఎం చంద్రబాబుని మధ్యలోకి లాగుతున్నాయి. ఏపీకి తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారు అంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా ఏపీ సీఎం చంద్రబాబును ముగ్గులోకి లాగేశారు. తాను సూటిగా బాబుకు చెప్పడం మీదనే ఆయన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపేశారు అని నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ప్రకటించి సంచలనం రేపారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలుపు చేయాల్సిందే అని తాను షరతు పెట్టాను అన్నారు. అలా చేసిన పక్షంలోనే ఏపీతో తాము ఏ చర్చకు అయినా సిద్ధపడతామని కూడా ఆయన చెప్పారు. అయితే తాను చెప్పిన మాటను విన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆ విధంగా పనులు ఆపేశారు అని రేవంత్ రెడ్డి చెప్పారు.

**బాబుతోనైనా పోరు :**

తాను తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితో అయినా పోరు చేస్తాను అని చెప్పారు. అందుకే ఏపీ సీఎం చంద్రబాబుతో కూడా ఇదే తీరున తాను ఒత్తిడి పెట్టానని చెప్పారు. తాను తెలంగాణాకు అన్యాయం చేయను అని చెప్పి ముందు ప్రాంతం తరువాతనే పార్టీ అని కూడా తెలియచేసి ఆనాడు టీడీపీ నుంచి బయటకు వచ్చాను అని కూడా రేవంత్ రెడ్డి సభకు స్పష్టం చేశారు. రాష్ట్రం కోసం రాజీ పడే ప్రసక్తి లేదని ఎవరితో అయినా పోరాడుతాను అని కూడా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాను చేసిన గట్టి ప్రయత్నాల వల్లనే ఏపీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిచిపోయాయని ఆయన బల్ల గుద్ది మరీ చెప్పారు.

**కావాలంటే కమిటీ :**

ఒకవేళ ఎవరికైనా ఏ రకమైన డౌట్ ఈ విషయంలో ఉంటే అసెంబ్లీ స్పీకర్ ని కమిటీ వేయాలని ఆయన ముఖ్యమంత్రి హోదాలో కోరారు. ఆ కమిటీలో బీఆర్ఎస్ బీజేపీ మజ్లీస్ వామపక్షాలు సహా అంతా ఉండొచ్చని మీరంతా వెళ్లి ఏపీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆగాయో లేదో చూసి రావాలని కూడా రేవంత్ రెడ్డి కోరడం విశేషం. ఒక విధంగా తాను ఏపీ మీద సాధించిన విజయంగా పై చేయిగా రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా చెప్పదలచారు అని అర్ధం అయింది. అంతవరకూ బాగానే ఉన్నా ఏపీ ఈ విషయంలో చిక్కుల్లో పడింది అని అంటున్నారు.

**రాయలసీమకు మరణ శాసనం :**

దీని మీద ఏపీలో విపక్షం అయిన వైసీపీ మండిపడుతోంది, తమ సొంత రాజకీయాల కోసం ఏపీని చంద్రబాబు తాకట్టు పెట్టారు అని వైసీపీ నేత విశ్వేశ్వరరెడ్డి విమర్శిస్తున్నారు. రాయలసీమకు చంద్రబాబు మరణశాసనం రాశారు అని ఆయన మండిపడ్డారు. బాబు చర్యలతో రాయలసీమ మొత్తం ఎడారిగా మారే ప్రమాదం ఏర్పడింది అని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ బాబు మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో వైసీపీ ఈ విధంగా చంద్రబాబు మీద విమర్శల దాడి పెంచేందుకు అవకాశం ఏర్పడింది అంటున్నారు.

**రేవంత్ వ్యాఖ్యలు తప్పు :**

ఇదిలా ఉంటే ఈ విషయం మీద టీడీపీ కూడా గట్టిగానే రియాక్ట్ అయింది. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పింది తప్పు అని కూడా ఏపీ టీడీపీ ఖండించింది. వైసీపీ హయాంలో ప్రాజెక్ట్ అవకతవకగా ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టారని నిందించింది. అందువల్లనే పనులు నిలిచిపోయాయని టీడీపీ స్పష్టం చేసింది. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏపీ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేస్థన్ పనులు ఆపేసింది అన్నది పూర్తిగా అబద్ధం అని పేర్కొంది. ఇక దీంతో రేవంత్ రెడ్డి మీద టీడీపీ ఆగ్రహంగా ఉంది అని అంటున్నారు. ఏది ఏమైనా రేవంత్ వర్సెస్ బీఆర్ఎస్ ల మధ్య జల జగడం డైలాగ్ వార్ కాస్తా చంద్రబాబు వైపు రావడంతో ఏపీలో వైసీపీ వర్సెస్ టీడీపీగా కొత్త వార్ స్టార్ట్ అవుతోంది. చూడాలి మరి ఇది ఎంత దూరం వెళ్తుందో.

# జగన్ చూపిన దారిలో బీఆర్ఎస్!



**హైదరాబాద్ పెన్ పవర్:** నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అని ఒక సామెత ఉంది. అలా ఏపీ తెలంగాణాలోని రెండు ప్రతిపక్షాలు ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తున్నారా లేక అనుకరిస్తున్నారా అన్నది అయితే తెలియడం లేదు కానీ రాజకీయంగా చూస్తే ఆసక్తిని పెంచుతున్నాయి అని చెప్పాల్సి ఉంది. ఏపీలో 2024 లో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అసెంబ్లీ సమావేశాలు ఇప్పటికి అనేక సార్లు జరిగాయి కానీ జగన్ ఆయన ఎమ్మెల్యేలు మాత్రం సభకు హాజరు కాలేదు, విపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామని మెలికి పట్టి సభకు దూరం పాటిస్తున్నారు. బడ్జెట్ సెషన్ సందర్భంలో మాత్రమే సభకు జగన్ ఆయన ఎమ్మెల్యేలు హాజరవుతున్నాయి.

**మీడియా మీట్ :**

ఇక సభకు హాజరు కాకుండా సభ జరిగే సమయంలో జగన్ మీడియాను పిలిచి మరీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ వస్తున్నారు. ప్రభుత్వం తీసుకుని వచ్చిన బిల్లుల విషయంలోనూ అలాగే తమ మీద చేసిన విమర్శల విషయంలోనూ ఆయన ఈ ప్రజంటేషన్ ద్వారా వైసీపీ విధానం ఏమిటో చెబుతున్నారు. అలాగే పాలక పక్షాన్ని కూడా విమర్శిస్తున్నారు. అసెంబ్లీ జరిగే సమయంలో మీడియా మీటింగ్ ద్వారా మాట్లాడుతూ జగన్ కొత్త రకం పొలిటికల్ ట్రెండ్ ని అయితే క్రియేట్ చేశారు. దీని మీద ఎన్ని విమర్శలు వచ్చినా ఆయన అయితే అదే పంధాను అనుసరిస్తున్నారు. సభకు రావాలని కదా ప్రజలు ఎన్నుకున్నది అని తోటి విపక్షాలు ప్రశ్నించినా అలాగే సభకు రాకపోతే సభ్యత్వాలు రద్దు చేస్తామని కూటమి పెద్దలు హెచ్చరించినా వైసీపీ ఇదే స్టాండ్ మీద ఉంది.

**బీఆర్ఎస్ సైతం :**

ఇక బీఆర్ ఎస్ కూడా ఇదే రూట్ లో ఉందా అన్న డౌట్ వస్తోంది అంటున్నారు. సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వడం లేదని స్పీకర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నరని బీఆర్ఎస్ కి చెందిన మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అంటున్నారు. అలాంటపుడు సభకు వెళ్ళి ఉపయోగం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తప్పులను ఎత్తి చూపేందుకు మైకు ఇవ్వడం లేదని సీఎం ని విమర్శిస్తే మైక్ ఇవ్వమని స్పీకర్ స్వయంగా చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి ఏపీలో ఉన్నపుడు కూడా అసెంబ్లీలో తమకు ఇలాంటి పరిస్థితి లేదని ఆయన అంటున్నారు. మొత్తం మీద అసెంబ్లీకి బీఆర్ఎస్ దూరంగా ఉండడమే కాదు తెలంగాణా భవన్ లోనే మీడియాను పిలిచి జల వివాదాల మీద పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వబోతోంది. దీనిని బట్టి చూస్తే మైక్ ఇవ్వరని ముందే ఊహించి వైసీపీ మొదటి నుంచే సభకు దూరంగా ఉంటే రెండేళ్ళ పాటు అసెంబ్లీకి వెళ్ళిన తరువాత ఇపుడు మైక్ తమకు ఇవ్వడం లేదని చెబుతూ బీఆర్ ఎస్ సభకు దూరంగా ఉండడం విశేషంగానే ఉంది అని అంటున్నారు.మరి సభకు వెళ్ళకుండా విపక్షాలు మీడియా మీట్లతోనే గడిపితే ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు ప్రజాస్వామ్యంలో విధులు, బాధ్యతలు గురించి కూడా చర్చ వస్తోంది. అయితే అసెంబ్లీ అంటే కేవలం అధికార పక్షంలో ఉంటేనే వెళ్లాలన్న ధోరణి మారాల్సిన అవసరం ఉందని మేధావులు సూచిస్తున్నారు. అలాగే మైక్ ఇవ్వడం లేదు అన్నది కాకుండా ప్రజా సమస్యల మీద పోరాడడానికి ఇంకా గట్టిగా చట్ట సభలనే వేదికగా చేసుకోవాలని కూడా కోరుతున్నారు.

# తెలంగాణాకు కేసీఆర్ మరణ శాసనం!



**హైదరాబాద్ పెన్ పవర్:** నిజానికి చూస్తే ఇది అత్యంత తీవ్రమైన విమర్శ. ఒక విధంగా పదేళ్లు తెలంగాణాకు సీఎం గా పనిచేసి తెలంగాణా రాష్ట్రం కోసం ఉద్యమించిన కేసీఆర్ వంటి నాయకుడి దక్షత నిబద్ధత మీద వేసిన పదునైన ప్రశ్న. నీరు, నిధులు నియామకాలు అన్న అంశాలనే ముందు పెట్టుకుని తెలంగాణా ప్రత్యేక రాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారు. పద్నాలుగేళ్ళ పాటు ఉద్యమాన్ని నడిపించారు. అలా కేసీఆర్ తెలంగాణా జాతి పితగా తన పార్టీ వారి చేత మెప్పులు పొందారు. మరి కేసీఆర్ హయాంలోనే నీటి కేటాయింపుల విషయంలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది అంటే అది నిజంగా బీఆర్ఎస్ పునాదుల మీదనే కుదుపు లాంటి వార్త. కానీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే ఈ మాట అంటున్నారు. ఏకంగా నిండు సభలో ఆయన కేసీఆర్ మీద అతి పెద్ద విమర్శను సైతం చేశారు.


**కేసీఆర్ అంగీకారం :**

కృష్ణా బేసిన్ లో తెలంగాణా ప్రాజెక్టులకు 490 టీఎంసీల కేటాయింపు ఉండేదని రేవంత్ రెడ్డి సభకు తెలిపారు. అయితే రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నపుడు చివరి సీఎం గా పనిచేసిన ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం ఈ కేటాయింపులను తెలంగాణాకు కేవలం 299 గా పేర్కొంది అని ఆయన గుర్తు చేశారు. ఇక ఆనాడు ఈ ఎన్ సీ గా ఉన్న మురళీధర్ రావు కూడా తెలంగాణాకు 299 టీఎంసీలు అని ఒక తప్పుడు నివేదిక ఇచ్చారని ఆయన చెప్పారు. అలా మొత్తం విషయం ఉంటే కేసీఆర్ తెలంగాణకు తొలి సీఎం అయిన తర్వాత 490 టీఎంసీల కోసం పోరాడకుండా 299 టీఎంసీలకు అంగీకరిస్తూ సంతకం చేశారు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. దాని ఫలితంగా ఆ అంగీకారం తెలంగాణాకు ఒక రకంగా మరణ శాసనం అయింది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**పోరాడాల్సిన వేళ :**

తెలంగాణా తొలి సీఎం గా వచ్చిన కేసీఆర్ ఈ విషయం మీద పోరాడాల్సింది పోయి 299 టీఎంసీలకు అంగీకరించడమేంటని ఆయన ప్రశ్నించారు. మరి ఈ విధంగా చేయడం ఏ మేరకు సబబు అని ఆయన అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ నిలదీశారు. అయితే ఈ విషయం మీద బీఆర్ఎస్ ఎలా స్పందిస్తుందో తెలియదు, అయితే రేవంత్ రెడ్డి ఇంతకు ముందు కూడా ఈ విషయం మీద మాట్లాడారు. కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలంగాణాకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ మాత్రమే అని కూడా స్పష్టంగా చెబుతూ వస్తున్నారు. దానికి సంబంధించి తన దగ్గర ఉన్న ఆధారాలను గణాంకాలను ఆయన వివిధ వేదికల మీద పెట్టి మరీ బీఆర్ఎస్ ని కార్నర్ చేస్తున్నారు. అయితే దీనిని ధీటైన జవాబు అయితే బీఆర్ ఎస్ నుంచి రావాల్సిన అవసరం ఉందని అంటున్నారు. లేకపోతే ఏ నీటి కోసం అయితే తీరని అన్యాయం జరిగింది అని తెలంగాణా ఏపీ నుంచి విడిపోయిందా ఇదే అంశం మీద ఎంత రచ్చ చేయాలో అంతా చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ హయాంలోనే తెలంగాణాకు నీటి విషయంలో నోట్లో మన్ను పడింది అని కాంగ్రెస్ అంటున్న దానికి జనాలు కూడా తమదైన శైలిలో రియాక్ట్ అవుతారు అని అంటున్నారు.

## టార్గెట్ హరీశ్... కానీ బద్నాం అయ్యేది మాత్రం బీఆర్ఎస్.. ఇదేంది కవితక్కా




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ కు పెద్ద అడ్డుగా మారారు. కల్వకుంట్ల కవిత కారు స్పీడుకు బ్రేకులు వేస్తున్నట్లే కనిపిస్తుంది. ఒకరకంగా రాజకీయంగా కాంగ్రెస్ ను అణగదొక్కి తాము పైకి రావాలని భావిస్తున్న గులాబీ పార్టీకి ముల్లులాగా కల్వకుంట్ల కవిత తయారైందని చెప్పాలి. ఆమె ఆగ్రహం హరీశ్ రావు పైన. ఆమె కోపం సంతోష్ రావు పైన. ఆమె అసంతృప్తి కేటీఆర్ పైన. కానీ ప్రతి రోజూ కల్వకుంట్ల కవిత చేసే వ్యాఖ్యలు ఆ పార్టీని రాజకీయంగా ఇబ్బందులు పెడుతున్నాయి. సొంత పార్టీలోనే కవిత వ్యాఖ్యలను సమర్ధించే వారు అనేక మంది ఉన్నారు. తాజాగా హరీశ్ రావు పై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు మరోసారి గులాబీ పార్టీలో కలకలం రేపుతున్నాయనే చెప్పాలి.

**హరీశ్ రావు వల్లనే...**

ఒకవైపు కృష్ణా నది జలాల అంశంపైన, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపైన ప్రభుత్వ విమర్శలను తిప్పి కొట్టాలని బీఆర్ఎస్ భావిస్తుంటే దానికి కల్వకుంట్ల కవిత గండి కొడుతున్నట్లే కనపడుతుంది. హరీశ్ రావును ఒక మాట అంటే అసెంబ్లీ ని బాయ్ కాట్ చేశాడన్నారు. మరి కేసీఆర్ ని ఎన్నో మాటలు అన్నప్పుడు ఎందుకు చేయలేదని కవిత ప్రశ్నించారు. గుంట నక్క హరీశ్రావు ధనదాహం తీర్చుకోవడం కోసం పాలమూరు ప్రజల నోట్లో మట్టి కొట్టాడంటూ కల్వకుంట్ల కవిత ఆరోపించార. జూరాల నుంచి నిర్మించాల్సిన పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చింది హరీశ్ రావే నని అన్నారు. కేవలం కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు దండుకోవడానికే ఈ మార్పు చేశాడంటూ కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు.

**కాంగ్రెస్ విమర్శలకు ఊతమిస్తూ...**

సొంత రాష్ట్రం వస్తే నీళ్లు వస్తాయని, వలసలు ఆగిపోతాయని, తమ బతుకులు బాగుపడతాయని అనుకున్న పాలమూరు ప్రజలు గుంట నక్క హరీశ్ రావు చేతుల్లో బలైపోయారంటూ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. హరీశ్ రావు ధనదాహానికి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజలు బలైపోయారంటూ కల్వకుంట్ల కవిత అనడంతో ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఊతమిచ్చినట్లయింది. అయితే కల్వకుంట్ల కవిత కు కౌంటర్ ఇచ్చే వారు ఇప్పుడు బీఆర్ఎస్ లో కనిపించడం లేదు. అలాగే హరీశ్ రావు కూడా తనపై కవిత చేస్తున్న ఆరోపణలకు కూడా సమాధానం ఇవ్వలేదు. కల్వకుంట్ల కవిత ను కంట్రోల్ కేసీఆర్ పెట్టకుంటే పార్టీ మరింత డ్యామేజ్ అవుతుందని గులాబీ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం కల్వకుంట్ల కవిత కారు స్పీడ్ కు బ్రేకులు వేస్తున్నారన్నది సుస్పష్టంగా తెలుస్తోంది.

## చీమునెత్తురునోడివైతే... మనిషివైతే రాజనామా చేయ్.. రేవంత్ కు హరీశ్ సవాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నీరు గార్చింది రేవంత్ రెడ్డి మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. ఆయన తెలంగాణ భవన్ లో నీటి పారుదల అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరాన్ని కాలరాసిందని, పాలమూరును పండబెట్టిందని ఆరోపించారు. కృష్ణా నది ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. పాలమూరు వలసలకు కారణం కాంగ్రెస్ మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో కోటి ఎకరాలకు సాగు నీరందిందని తెలిపారు. అందువల్లనే తెలంగాణ వరి పండించడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుందని హరీశ్ రావు తెలిపారు.

**బీఆర్ఎస్ హయాంలోనే...**

బీఆర్ఎస్ హయాంలో అనేక ప్రాజెక్టులను పూర్తి చేశామన్న హరీశ్ రావు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి తమ పార్టీని బద్నాం చేస్తుందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకోవడమే కాని, పిడికెడు బువ్వ పెట్టిన పాపాన ఎన్నడూ పోలేదన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు అన్నీ అబద్ధాలే శాసనసభలో చెప్పాలన్నారు. నాడు తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ తో కలిపి మరణ శాసనం రాసింది కాంగ్రెస్ మాత్రమేననిహరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత నీటిపారుదల విషయంలోనూ, తాగు నీటి విషయంలోనూ సరైన చర్యలు తీసుకోవడం వల్లనే ఈనాడు భూముల విలువ కోట్ల రూపాయలకు పెరిగిందని గుర్తు చేశారు.

**తెలంగాణను మోసం చేసింది కాంగ్రెస్ ....**

తెలంగాణ ఉద్యమాన్ని గత కొన్ని దశాబ్దాలుగా నీరు గార్చింది కాంగ్రెస్ మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇచ్చిన తెలంగాణను వెనక్కు తీసుకుని వందలాది మంది యువకుల ప్రాణాలను బలితీసుకుంది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎన్ని లక్షల ఎకరాలకు సాగు నీరందిందో తెలుసా? అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అటువంటి కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. అసెంబ్లీని, రైతులను, తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడిన రేవంత్ రెడ్డి నాలుక కోయాలని హరీశ్ రావు అన్నారు. చీము నెత్తురున్నోడయితే.. మనిషైతే నేరుగా రాజీనామా చేయాలని హరీశ్ రావు అన్నారు. ఈ మాటలు అన్నందుకు తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తాడని, అయినా తనకు భయం లేదని అన్నారు.

## వెనిజుల ఆపరేషన్ ఎలా జరిగింది? అధ్యక్షుడిని అమెరికా ఎలా బంధించింది.. తెరవెనుక జరిగిందిదీ..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అగ్రరాజ్యం హోదాలో ఏం చేసినా చెల్లుతుందా? ఒకదేశంపైకి వెళ్లి ఆ దేశ అధ్యక్షుడిని అరెస్ట్ చేసి అమెరికా తీసుకొచ్చేందుకు దానికి ఏం రైట్స్ ఉన్నాయి? అధ్యక్షుడినే అరెస్ట్ చేస్తుంటే వెనిజుల సైన్యం, పోలీసులు, ప్రజలు ఏం చేస్తున్నారు.? ఎందుకు తిరగబడలేదు. అంత సులువుగా అమెరికా వెనిజులాలో అధ్యక్షుడిని పదవీ చిత్యుడిని ఎలా చేయగలిగింది.. ఇప్పుడు ఇదే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ప్రస్తుత ప్రపంచంలో ఏ దేశమైనా సరే తన గగనతల భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉంటుంది. శత్రు దేశపు చిన్న డ్రోన్ లేదా బెలూన్ కనిపిస్తేనే క్షిపణులతో కూల్చేసేంత అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంది. ఇటీవల అమెరికా గగనతలంలోకి వచ్చిన చైనా బెలూన్‌ను అమెరికా యుద్ధ విమానాలు ఎలా వెంటాడి కూల్చాయో ప్రపంచం చూసింది. కానీ, వెనిజులా వంటి దేశంలోకి అమెరికా యుద్ధ విమానాలు యధేచ్ఛగా ప్రవేశించి ఆ దేశ అధ్యక్షుడినే బంధించి తీసుకువెళ్తుంటే.. అక్కడి రక్షణ వ్యవస్థలు ఎందుకు స్పందించలేదు? రాడార్లు ఎందుకు మూగబోయాయి? దీని వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి? అన్నది హాట్ టాపిక్ గా మారింది..

**పాకిస్తాన్ 'అబోటాబాద్' ఆపరేషన్ పునరావృతమైందా?**

చరిత్రను ఒక్కసారి వెనక్కి తిరగేస్తే.. 2011లో పాకిస్తాన్‌లోని అబోటాబాద్‌లో అమెరికా జరిపిన ఆపరేషన్ గుర్తుకు వస్తుంది. అప్పట్లో ఒబామా ప్రభుత్వం అత్యంత రహస్యంగా హెలికాప్టర్లను పంపి అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చింది. ఆ సమయంలో పాకిస్తాన్ సైన్యానికి గానీ ప్రభుత్వానికి గానీ సమాచారం లేదని అమెరికా ప్రకటించింది. కానీ ఒక దేశపు సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తూ విదేశీ విమానాలు లోపలికి వచ్చినప్పుడు సైన్యం చూస్తూ ఊరుకుంటుందా? పాకిస్తాన్ సైన్యం మౌన సహకారం లేకుండా అది సాధ్యం కాదని అప్పట్లో అంతర్జాతీయ విశ్లేషకులు తేల్చి చెప్పారు. ఇప్పుడు వెనిజులాలో మదురో విషయంలోనూ అదే 'పాకిస్తాన్ మోడల్' పునరావృతమైందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**వెనిజులా అధ్యక్షుడి అరెస్ట్.. అసలు ఆపరేషన్ ఎలా జరిగింది?**

వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో , ఆయన సతీమణిని అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకుని అమెరికా విమానాలు నేరుగా రాజధానిలోకి ప్రవేశించాయి. వెనిజులా రక్షణ వ్యవస్థ నిశ్చలంగా ఉండటం వెనుక ఆ దేశ సైన్యంలోని కొందరు ఉన్నతాధికారుల హస్తం ఉందని తెలుస్తోంది. అమెరికా బలప్రయోగం కంటే వెనిజులా సైన్యం అందించిన 'లోపలి సహకారం' వల్లే మదురోను బంధించడం సులువైందనే వాదన బలంగా ఉంది. అరెస్ట్ చేసిన వెంటనే వారిని అమెరికాకు తరలించి, న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టడం అంతర్జాతీయ సమాజంలో తీవ్ర చర్చకు దారితీసింది.

**అమెరికా సామ్రాజ్యవాదం.. ఆధిపత్య పోరాటమా?**

లాడెన్ ఘటన ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగిందని చెప్పుకున్నా.. వెనిజులాలో జరిగిన మార్పు వెనుక అమెరికా రాజకీయ ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెనిజులాలో ఉన్న అపారమైన చమురు నిల్వలపై నియంత్రణ సాధించడం.. తమకు అనుకూలంగా లేని ప్రభుత్వాలను కూలదోసి, తమకు నచ్చిన వారిని గద్దెనెక్కించడం... లాటిన్ అమెరికా దేశాల్లో తమ మాటే చెల్లాలని అమెరికా భావించడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

**అమెరికాది కుటిల ప్రజాస్వామ్య వాదం?**

ఒక దేశ ప్రజలు ఎన్నుకున్న నాయకుడిని.. మరో దేశం వచ్చి తన చట్టాలతో అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసం? ఇది ఉగ్రవాద నిరోధమా లేక ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చడమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అమెరికా తన ప్రయోజనాల కోసం ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని కాలరాస్తోందనే విమర్శలకు ఈ ఘటన బలమైన సాక్ష్యంగా నిలుస్తోంది.పాకిస్తాన్‌లో అబోటాబాద్.. ఇప్పుడు వెనిజులాలో మదురో అరెస్ట్.. పేర్లు మారినా దేశాలు మారినా అమెరికా అనుసరిస్తున్న వ్యూహం మాత్రం ఒక్కటే. అది "లోపలి సైన్యాన్ని లొంగదీసుకోవడం.. గగనతలాన్ని ఆక్రమించడం.. లక్ష్యాన్ని ఛేధించడం... భద్రతా వ్యవస్థలు ఎన్ని ఉన్నా.. దేశద్రోహం లేదా అంతర్గత కుట్రలు తోడైనప్పుడు ఏ దేశానికైనా రక్షణ కరువవుతుందని వెనిజులా ఉదంతం నిరూపిస్తోంది.

## పిచ్చి మదురో...చెప్పినా వినలేదు !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎవరీ మదురో...అంతర్జాతీయ సమాజంలో ఒక్కసారిగా పాపులర్ అయిపోయాడు, ఏమిటి ఈయన కథ అంటే అదే ఇపుడు వరల్డ్ వైడ్ హాట్ టాపిక్. వెనిజులా దేశానికి అధ్యక్షుడిగా ఉన్న నికోలస్ మదురో ఆయన భార్యను అమెరికా సైన్యాలు అరెస్ట్ చేసి మరీ న్యూయార్క్ కి తీసుకుని వచ్చాయి. అమెరికా చట్ట అమలు సంస్థలతో కలిసి నిర్వహించిన సైనిక చర్యలో మదురోను పట్టుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. ఇక ఈ దంపతుల మీద మాదకద్రవ్యాలు ఆయుధ నేరాల అభియోగాలు మోపారు. దాంతో అమెరికా చట్టం ప్రకారం విచారించి కఠిన శిక్షలు అమలు చేస్తారు అని అంటున్నారు.

**చెప్పినా వినలేదు :**

ఇదిలా ఉంటే నికోలస్ మదురో ఎన్నో ఆఫర్లు ఇచ్చామని వైట్ హౌస్ వర్గాలు అంటున్నాయి. ఆయనను దేశం విడిచి పారిపోమని గత ఏడాది నవంబర్ లోనే హెచ్చరించామని చెబుతున్నాయి. ప్రాణాలతో బయటపడేందుకు అది ఒక మార్గంగా చెప్పామని అంటున్నారు. అంతే కాదు మరెన్నో బంపర్ ఆఫర్లు డీల్స్ కూడా ఆయన ముందు పెట్టామని అయితే వేటికీ ఆయన స్పందించలేదని పట్టనట్లుగా ఉండడం వల్లనే ఈ రోజు పట్టుబడి అమెరికా చట్టాల ముందు బంధీ అయ్యారని అంటున్నారు.

**ప్రకంపనలు రేపింది :**

ఇదిలా ఉంటే శనివారం తెల్లవారుజామున రాజధాని కారకాస్‌లో అమెరికా సైనిక దళ భారీ ఎత్తున పేలుళ్లు నిర్వహించింది. ఆ తరువాత మదురో కాంపౌండ్‌లోకి అమెరికన్ సైన్యం ప్రవేశించింది అక్కడ మదురో ఒక కోట లాంటి ఇంట్లో ఉంటున్నాడు. అర్ధరాతి కారకాస్‌లోని లైట్లు మొత్తం అమెరికన్ సైన్యం ఆపివేశారు. చీకట్లోనే మదురో ఇంట్లోకి నట్టింట్లోకి ఏకంగా మదురో బెడ్ రూం లోకి ప్రవేశించి మరీ ఆయనను భార్యను అక్కడే పట్టుకుని తమ వెంట తీసుకుని పోయారు.

**వేల కిలోమీటర్లు :**

ఇక బంధీగా పట్టుకున్న నికోలస్ మదురో ని ఆయన భార్యను ఏకంగా మూడు వేల 200 కిలోమీటర్ల దూరమంతా తిప్పారని అంతర్జాతీయ వార్తలు చెబుతున్నాయి. ఇక ఆ సమయంలో మదురో కళ్ళకు గంతలు కట్టి మరీ బయటకు తెచ్చి ఈ విధంగా తిప్పారు అని అంటున్నారు. నికోలస్ మదురో ఈ విధంగా పట్టు బడడానికి కారణం వెనిజులా ప్రభుత్వంలోని సిఐఎ అని చెబుతున్నారు. ఇది అమెరికా విస్తృతమైన నిఘా నెట్‌వర్క్‌లో విభాగంగా ఉంది. అలా అమెరికాకు మదురో ఎక్కడ ఉంటారో ఆయన సురక్షితమైన స్థావరం ఏమిటి ఎలా ప్రవేశించాలి అన్నది పూర్తిగా ట్రాక్ చేయడంలో సహాయపడింది అని అంటున్నారు. ఈ మొత్తం ఆపరేషన్ లో ఏకంగా 150 కి పైగా విమానాలను ఉపయోగించారని తెలుస్తోంది.

**జస్ట్ మిస్ అయింది :**

ఇదిలా ఉంటే ఇంత పకడ్బందీగా నికోలస్ మదురోని అమెరికా సైన్యం పట్టుకున్నప్పటికీ వెనిజులా అధ్యక్షుడు చివరి దాకా తన ప్రయత్నాలు తాను చేస్తూ వచ్చాడని అంటున్నారు. దాంతో మదురో ఉక్కుతో రూపొందించిన బలమైన సురక్షిత ప్రదేశంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడని చెబుతున్నారు. అయితే ఆయన ఆ సేఫ్ జోన్ లోని తలుపు వద్దకు చేరుకున్నాడని కానీ దానిని మూసివేయలేకపోయాడని అంటున్నారు. అక్కడే అమెరికా సైన్యం సక్సెస్ అయింది. దాంతో నికోలస్ మదురో అడ్డంగా దొరికిపోయాడని తెలుస్తోంది. ఇపుడు నికోలస్ మదురో జీవితం ఏమిటి అన్నది ట్రంప్ చేతులలో ఉందని అంటున్నారు. ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని చెబుతున్నారు. మరి అమెరికాను ఎదిరించాలని ఒక దశలో అనుకున్నా అదే ట్రంప్ తో డీల్ చేసుకుని తాను అధ్యక్షుడుగా కొనసాగడానికి సైతం నికోలస్ మదురో చివరి దశలో ప్రయత్నాలు చేశారని అంటున్నారు. అయితే ట్రంప్ కి అమెరికాకు ఆయన అధ్యక్ష పదవిలో ఉండడం ఇష్టం లేదని అందుకే పారిపోవాలని చెప్పారని అంటున్నారు.

# తోక ఎవరు? కుక్క ఎవరు కవితక్కా?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నేరుగా తండ్రి కేసీఆర్ ను, సోదరుడు కేటీఆర్ ను ఏమీ అనలేక.. కక్కలేక మింగలేక బావ హరీష్ రావు మీద పడిపోతున్నట్టుగా ఆమె మాటలను బట్టి తెలుస్తోంది. తాను ఎంత మొత్తుకున్నా హరీష్ రావుపై దుమ్మెత్తిపోసినా కేసీఆర్ ఏమాత్రం లెక్క చేయకుండా అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవిని కట్టబెట్టడంతో కవిత తాజాగా తన అసహనం మొత్తాన్ని బయటపెట్టారు. కేసీఆర్ ను పరోక్షంగా ప్రస్తావిస్తూ హరీష్ రావుపై అనరాని మాటలు అనేశారు. తెలంగాణ రాజకీయాల్లో కవిత విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి.



బీఆర్‌ఎస్ పరిణామాలపై కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీ వర్గాల్లో కాకరేపుతున్నాయి. "హరీష్‌కు ఎలాంటి బాధ్యతలు ఇవ్వొద్దు" అని కవిత ఎంతగా హెచ్చరించినా, పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం ఆ మాటలను పట్టించుకోకుండా బాధ్యతలు అప్పగించడంతో కవిత బరెస్ట్ అయ్యారు. ఇటీవల అసెంబ్లీలో బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా హరీష్‌రావుకు బాధ్యతలు అప్పగించడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టిన సంగతి తెలిసిందే. తెలంగాణలో నీళ్ల రగడ ముదిరిన నేపథ్యంలో ఈ అంశంపై స్వయంగా కేసీఆరే అసెంబ్లీలో మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. హరీష్ ఏం చెప్పినా అది ప్రజల్లోకి వెళ్లదని, ఆయన ముందుకు రావడం వల్ల లాభం కంటే నష్టమే జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

**అసెంబ్లీ బహిష్కరణ.. వెనుక అసంతృప్తి**

నీటి అంశాలపై జరిగిన చర్చలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీరు, సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలకు అనుమతి లేకపోవడంపై పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**తెలంగాణ భవన్‌లో హరీష్ షో**

అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించింది. ఈ మొత్తం ప్రక్రియను హరీష్‌రావు తన భుజాలపై వేసుకుని నడిపించారు. నీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన పనులు, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న ఆరోపణలను స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశారు.

**కవిత వర్సెస్ హరీష్.. అసలు పోరు ఇదేనా?**

హరీష్‌ను పక్కన పెట్టకపోతే దేవుడు కూడా బీఆర్‌ఎస్‌ను కాపాడలేడు అన్న స్థాయిలో కవిత వ్యాఖ్యలు చేసినా కేసీఆర్‌తో పాటు కేటీఆర్ వాటిని పట్టించుకోలేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కవిత కంటే హరీషే పార్టీకి కీలకమన్న సంకేతం ఇది అని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

**'తోక కుక్కని ఊపే పరిస్థితి' సెటైర్**

ఇలాంటి పరిణామాల మధ్యే కవిత తాజాగా విలేకరుల సమావేశంలో బరెస్ట్ అయ్యారు. "గుంట నక్క వ్యవహారం చూస్తే...తోక కుక్క ని ఊపే పరిస్థితి వచ్చింది..' అని నాకు అనిపిస్తోందని కవిత సంచలన సెటైర్ వేశారు. ఎవరు ఏమనుకున్నా.. ఎవరు ఏం అర్థం చేసుకున్నా తనకు తెలియదని.. ఒక్క మాట కాంగ్రెస్ వాళ్లు అంటే మొత్తానికి మొత్తం సభ వాయిదా వేసుకొని 5 రోజులు వాకౌట్ చేయడం ఎంతవరకు కరెక్ట్ అని కవిత నిలదీశారు. సభ పెట్టింది ఎవరికోసం అంటూ నిలదీశారు. దీంతో కవిత వ్యాఖ్యల్లో 'తోక ఎవరు? కుక్క ఎవరు?' అన్న పదాలు బీఆర్‌ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ నిర్ణయాలు ఎవరి చేతుల్లో ఉన్నాయన్న ప్రశ్నకు ఈ వ్యాఖ్యలు ప్రతిబింబమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హరీష్‌కు పగ్గాలు అప్పగించడం వల్ల పార్టీపై నియంత్రణ ఎవరిదన్న సందేహం కార్యకర్తల్లోనూ నెలకొంది. మొత్తానికి బీఆర్‌ఎస్‌లో కవిత మాటల యుద్ధం హాట్ టాపిక్ గా మారుతోంది. కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలతో మరింత ముదురుతోంది. ఇది అంతర్గత విభేదాలకే పరిమితమవుతుందా? లేక భవిష్యత్ రాజకీయ దిశను మార్చుతుందా? అన్నది కాలమే తేల్చాలి.

# సీబీఎన్ ను ఎదిరించిన రేవంత్! అసెంబ్లీలో వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇన్నాళ్లు చంద్రబాబు అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయనను విమర్శించమని చాలా మంది చెప్పినా, తాను ఆ పని చేయలేదని చెబుతూ వస్తున్న రేవంత్ రెడ్డి శనివారం తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. సీఎం ప్రసంగం అనంతరం గురుశిష్యుల బంధంలో సంవాదం కూడా ఉందా? అనే చర్చ జరుగుతోంది. 'నీళ్లు-నిజాలు' అనే అంశంపై తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపితేనే ఏపీ ప్రభుత్వంతో చర్చలకు వస్తానని చంద్రబాబుకు తేల్చిచెప్పానని ప్రకటించారు. చంద్రబాబుపై ఒత్తిడి తీసుకువచ్చి ఆ ప్రాజెక్టును నిలిపివేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే తాను తెలంగాణ కోసం ఎవరితోనైనా పోరాడతానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబుపై ఒత్తిడి తీసుకువచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపించానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. "ఆయన (చంద్రబాబు) నాయకత్వంలో పనిచేసిన నేను ఆయన నాయకత్వాన్ని కాదని, ఆయన నాయకత్వాన్ని వదులుకుని కాంగ్రెసులో చేరిన నేను ప్రజలకు ద్రోహం చేస్తానా" అంటూ ప్రశ్నించారు. చంద్రబాబును ఎదిరించి తెలంగాణ కోసం తాను అసెంబ్లీలో ఏం మాట్లాడానో తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



తెలంగాణకు ద్రోహం చేయాలని చూస్తే జూరాల నుంచి 70 టీఎంసీలను నీళ్లను తీసుకుని పాలమూరు, రంగారెడ్డి, నల్గొండకు నీళ్లను తరలిస్తానని, ఎవరు అడ్డు వస్తారో చూస్తానంటూ రేవంత్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. ఈ విషయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ ను ఎదిరిస్తానని ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. తెలంగాణపై ఆన ఈ కుర్చీలో ఉన్నంత కాలం తెలంగాణకు నష్టం కలిగే చిన్న తప్పు కూడా చేయబోను అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య మంచి వాతావరణం ఉండాలని ఇన్నాళ్లు తాను సాధించిన విజయాలను చెప్పలేదు అంటూ రేవంత్ రెడ్డి వెల్లడించారు.

ఏ ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ఇలా మాట్లాడారో కానీ, చంద్రబాబును ఎదిరించినట్లు సీఎం తొలిసారిగా చెప్పడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నుంచి కాంగ్రెస్ లో చేరి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్న రేవంత్ రెడ్డి గతంలో ఎప్పుడూ ఇలా చంద్రబాబుపై వ్యాఖ్యలు చేయలేదు. చంద్రబాబును ఎదిరించినట్లు చెప్పడమే కాకుండా, ఆయన పేరు ప్రస్తావిస్తూ జూరాల నుంచి నీళ్లు తెచ్చుకుంటే ఎలా ఆపుతారో చూస్తానని ప్రకటించడం కూడా చర్చకు దారితీస్తోంది. ఇదే సమయంలో తనకు చంద్రబాబు అంటే భయం లేదని, కేసీఆర్ మాత్రం తన పాత యజమానిని (చంద్రబాబు) చూస్తే భయపడతారని వ్యాఖ్యానించారు. "ఒక వేళ చంద్రబాబు ముందు మాట్లాడటానికి నీకు భయం అవ్వొచ్చు. ఎందుకంటే చంద్రబాబు నీకు పాత యజమాని కాబట్టి, పాత యజమాని ముందు నిలబడి మాట్లాడటానికి కడుపులో గుబులు ఉండొచ్చు. పాత యజమాని ముందు మాట్లాడాలంటే కొన్నిసార్లు నెర్వెస్ అయిపోతాం. 2016లో చంద్రబాబు ముందు నిలబడి మాట్లాడటానికి బయటపడి మాట్లాడలేకపోతే, 2020లో నీకన్నా చిన్నోడు, తొలిసారి ముఖ్యమంత్రి జగన్ ముందు మాట్లాడటానికి భయపడిపోయావా" అంటూ కేసీఆర్ పై సీఎం రేవంత్ మాటల దాడి చేశారు. మొత్తానికి అసెంబ్లీ ఎపిసోడ్ లో తాను చంద్రబాబును ఎదిరించానని చెప్పడం ద్వారా తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఏపీ సీఎంను కేంద్ర బిందువుగా మార్చేశారని అంటున్నారు.

# ఏపీ పోలీసుల రికార్డు యాత్ర.. 1300 కి.మీ. సైకిల్ ర్యాలీ చాలా స్పెషల్



**హైదరాబాద్ పెన్ పవర్:** 'డ్రగ్స్ వద్దు.. భవిష్యత్తు ముద్దు" అనే నినాదంతో ఉత్తరాంధ్రలో పోలీసులు నిర్వహించిన సైకిల్ ర్యాలీ ముగిసింది. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం పోలీసులు ఉత్తరాంధ్రలోన ఐదు జిల్లాల్లో ఈ ర్యాలీ నిర్వహించారు. నవంబరు 13న అనకాపల్లి జిల్లాలో మొదలైన సైకిల్ యాత్ర సుమారు 1300 కిలోమీటర్లు సాగింది. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువత, విద్యార్థులలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆధ్వర్యంలో పోలీసులు ఈ ర్యాలీ చేపట్టారు. అనకాపల్లి జిల్లాలో హోంమంత్రి ప్రారంభించగా, శ్రీకాకుళం జిల్లాలో ముగింపు వేడుకలు శనివారం జరిగాయి. ఇచ్ఛాపురం పట్టణంలో అట్టహాసంగా అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం సైకిల్ యాత్ర చేసిన పోలీసులను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమానికి గుర్తుగా పట్టణ పోలీస్ స్టేషన్లో పైలాన్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌ను మత్తు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పంతో ఉన్నారని, ఆయన లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేయాలనే సంకల్పంతోనే పోలీసులు ఈ వినూత్న కార్యక్రమం చేపట్టారని అంటున్నారు.హోంమంత్రి అనిత సొంత నియోజకవర్గం పాయకరావుపు నుంచి ప్రారంభించిన సైకిల్ ర్యాలీ ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లో ప్రతి ఊరి మీద నుంచి సాగింది. 23 మంది పోలీసులు నిరంతరం సైకిల్ యాత్ర చేశారు. ఇప్పటివరకు తెలుగునాట రాజకీయ లక్ష్యాలతోనే ఇలాంటి తరహా యాత్రలు జరిగేవి. కాని తొలిసారిగా ఒక సామాజిక లక్ష్యంతో సైకిల్ ర్యాలీ నిర్వహించడం ఆసక్తి రేపుతోంది. గంజాయి, డ్రగ్స్ వాడొద్దని చెప్పడమే కాకుండా, పోలీసులు ఈ విషయంలో ఎంత బలంగా పనిచేస్తామో చెప్పడం విశేషంగా చెబుతున్నారు.

ఇక పోలీసులు ధృడమైన లక్ష్యంతో చేపట్టిన సైకిల్ ర్యాలీకి ప్రభుత్వం కూడా గట్టి మద్దతు ప్రకటించింది. ఇచ్ఛాపురంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహననాయుడుతోపాటు రాష్ట్ర హోంమంత్రి అనిత ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు హాజరయ్యారు. పోలీసులు స్వతహాగా నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రజాప్రతినిధులు కూడా ముందుకు రావడం వల్ల సైకిల్ ర్యాలీ చేసిన పోలీసులకు మంచి ప్రోత్సాహం అందించినట్లైందని అంటున్నారు. పోలీసులు చేసిన వినూత్న కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు స్వాగతించి ప్రభుత్వంపై ఉద్యోగులకు గౌరవం పెరుగుతుందని, కమిట్మెంట్ తో పనిచేస్తారని కూడా చెబుతున్నారు.

# అమెరికా vs వెనిజులా : ఎవరి సైనిక బలం ఎంత? యుద్ధం చేసే దమ్ముందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మరియు వెనిజులా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. 'ఆపరేషన్ అబ్సొల్యూట్ రిసాల్వ్' అనే పేరుతో అమెరికా మెరుపు దాడులు చేసింది. ఏకంగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకుంది. ఈ పరిణామం ప్రపంచ దేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో వెనిజులా సైనిక శక్తి ఎంత? అది నిజంగా అమెరికా వంటి అగ్రరాజ్యాన్ని ఢీకొనగలదా? అన్నది హాట్ టాపిక్ గా మారింది.వెనిజులా సైన్యాన్ని నేషనల్ బొలివేరియన్ ఆర్మ్డ్ ఫోర్సెస్ (ఎఫ్.ఏ.ఎన్.బీ) అని పిలుస్తారు. దీని వెనుక రష్యా , చైనా వంటి దేశాల సాంకేతిక సహకారం కొంత ఉన్నప్పటికీ అమెరికాతో పోలిస్తే పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.



**ఎవరి సైన్యం ఎంత?**

వెనిజులా వద్ద సుమారు 1.9 లక్షల మంది క్రియాశీల సైనికులు ఉన్నారు. దీనికి తోడు ప్రభుత్వంపై విధేయత చూపే మిలీషియా పౌర సైన్యం దళాలు భారీగా ఉన్నాయి. రికార్డుల ప్రకారం సుమారు 20 లక్షల మంది వరకు మిలీషియా సభ్యులు ఉన్నట్లు అంచనా. ఒకవేళ విదేశీ దాడులు జరిగితే గెరిల్లా యుద్ధం చిన్న చిన్న బృందాలుగా విడిపోయి మెరుపు దాడులు చేయడం ద్వారా అమెరికాను ఇబ్బంది పెట్టడానికి వెనిజులా వ్యూహం పన్నింది..

**ఆయుధ సంపత్తి ఎంత?**

వెనిజులా ప్రధానంగా రష్యా నుండి కొనుగోలు చేసిన ఆయుధాలపై ఆధారపడి ఉంది. రష్యాకు చెందిన ఎస్.యూ-30ఎంకే2 యుద్ధ విమానాలు వెనిజులాకు ప్రధాన బలం. ఇవి శక్తివంతమైనవే కానీ.. అమెరికాలోని ఐదవ తరం స్టెల్త్ ఫైటర్ల ఎఫ్-22, ఎఫ్-35 ముందు వీటి మనుగడ ప్రశ్నార్థకమే. రష్యా తయారు చేసిన ఎస్-300 గగనతల రక్షణ వ్యవస్థలు వెనిజులా వద్ద ఉన్నాయి. ఇవి శత్రు విమానాలను అడ్డుకోవడంలో సమర్థవంతమైనవి.

**అమెరికా - వెనిజులా సైనిక శక్తి ఇదీ**

అమెరికా రక్షణ బడ్జెట్ 800 బిలియన్లు కాగా.. వెనిజులాది కేవలం 5 బిలియన్లలోపే ఉంటుంది. ఇక అమెరికా వద్ద 13వేల యుద్ధ విమానాలున్నాయి. వెనిజులా వద్ద కేవలం 300 లోపే ఉంటాయి. విమాన వాహక నౌకలు అమెరికా వద్ద ఏకంగా 11 ఉన్నాయి. వెనిజులా వద్ద ఒక్కటి లేవు. ఇక అమెరికా అణ్వాయుధాలు ఏకంగా 5500 వరకూ ఉంటాయి. వెనిజులా వద్ద అసలు లేనే లేవు. అమెరికా వద్ద అత్యాధునిక స్టెల్త్, శాటిలైట్ టెక్నాలజీ ఉంది. వెనిజులా వద్ద పాత తరం పరిమితమైన వనరులున్నాయి.

**ప్రత్యక్ష యుద్ధం జరిగితే పరిస్థితి ఏంటి?**

నిపుణుల విశ్లేషణ ప్రకారం, సంప్రదాయ యుద్ధం జరిగితే వెనిజులా అమెరికా ముందు కొన్ని రోజులు కూడా నిలబడటం కష్టం. దీనికి ప్రధాన కారణాలున్నాయి. గత దశాబ్ద కాలంగా వెనిజులా ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభం వల్ల సైనిక వాహనాల నిర్వహణ, విడిభాగాల కొరత తీవ్రంగా ఉంది. ఆకలితో అలమటిస్తున్న సైనికుల నైతిక బలం కూడా బలహీనపడింది. అమెరికా వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం వెనిజులా కమ్యూనికేషన్ వ్యవస్థను నిమిషాల్లో కుప్పకూల్చగలదు. సముద్రం మధ్యలో ఉండే అమెరికా విమాన వాహక నౌకల నుండి వచ్చే దాడులను అడ్డుకునే శక్తి వెనిజులా నావికా దళానికి లేదు.

**రష్యా, చైనాల పాత్ర కీలకం**

వెనిజులాకు సొంత బలం తక్కువైనా దానికి రష్యా, చైనాల వెన్నుదన్ను ఉంది. అందుకే సీక్రెట్ గా వెనిజులాపై దాడిచేసి అధ్యక్షుడిని అరెస్ట్ చేసి అమెరికా తీసుకెళ్లారు.ప్రత్యక్ష యుద్ధం జరిగితే చైనా, రష్యాలు వెనిజులాకు బోలెడంతా సాయం చేసి దెబ్బతీసే ప్రయత్నం చేసి ఉండేవి.మొత్తానికి వెనిజులా సైన్యం తన పొరుగు దేశాలతో పోలిస్తే బలంగానే ఉన్నప్పటికీ అమెరికా వంటి సూపర్ పవర్‌తో పోల్చడం అశాస్త్రీయమే అవుతుంది. 'ఆపరేషన్ అబ్సొల్యూట్ రిసాల్వ్' వంటి పరిణామాలు నిజమైతే అది వెనిజులా చరిత్రలోనే కాదు.. ప్రపంచ రాజకీయాల్లోనే ఒక భారీ మలుపుగా మారుతుంది.

# అనుమతులు తెచ్చింది అశోక్... వైసీపీకి ఝలక్



**హైదరాబాద్ పెన్ పవర్:** భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ విషయంలో టీడీపీ వైసీపీల మధ్య క్రెడిట్ వార్ సాగుతోంది. క్రెడిట్ చోరీ చేశారు చంద్రబాబు అని వైసీపీ మాజీ మంత్రులు సీనియర్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది అంతా జగన్ సీఎం గా ఉండే సమయంలో అని చెబుతున్నారు. జగన్ అనుమతులు అన్నీ తెచ్చారని కోర్టులలో వివాదాలు క్లియర్ చేయించారు అని భూసేకరణ జరిపించి శంకుస్థాపన చేశారు అని వైసీపీ చెబుతోంది. మొత్తం 80 శాతం పైగా వర్క్ అంతా వైసీపీ హయాంలో జరిగింది అని గుర్తు చేస్తోంది. అయితే దాని మీద టీడీపీ కౌంటర్లు వేసింది. బుర్ర ఉన్నవాడు ఎవడూ భోగాపురంలో ఎయిర్ పోర్టు కడతారా అని జగన్ అప్పట్లో విపక్ష నేతగా ఉన్నపుడు ప్రశ్నించిన వీడియోను కూడా మీడియాకు వదిలి ఇదీ మీ విజన్ అని సెటైర్లు వేస్తోంది.

**అశోక్ హయాంలోనే :**

ఇదిలా ఉంటే భోగాపురం ఎయిర్ పోర్టు మీద కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక కామెంట్స్ చేశారు. ఢిల్లీ నుంచి వాణిజ్య విమానంలో నేరుగా భోగాపురం ఎయిర్ పోర్టులో దిగి ట్రయల్ రన్ ని సక్సెస్ ఫుల్ గా పూర్తి చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎయిర్ ఇండియా సహకారంతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌లో తొలి విమానం విజయవంతంగా ల్యాండ్ కావడం గర్వకారణం అన్నారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్ట్‌లో తొలి ఫ్లైట్ దిగడం చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. అంతే కాదు భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి 2016లోనే అప్పటి సివిల్ ఏవియేషన్ మంత్రి అశోక్ గజపతి రాజు అనుమతులు తెచ్చారని గుర్తు చేశారు. ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో ప్రాజెక్టును వేగవంతం చేశామని ఆయన చెప్పారు.

**ఆరు నెలలు ముందుగా :**

ఇక ఈ ఏడాది డిసెంబర్ కి పూర్తి అవుతుంది అని లక్ష్యంగా పెట్టుకున్న పనులను ఆరు నెలలు ముందుగానే పూర్తి చేస్తున్నామని కేంద్ర మంత్రి చెప్పడం విశేషం. ఈ ప్రాజెక్టులో ఎల్అండ్టీ జీఎంఆర్ డీజీసీఏ అధికారులు కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. అలాగే భూములు త్యాగం చేసిన స్థానిక రైతాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు కూడా కేంద్ర మంత్రి చెబుతూ వారి సహకారం మరువలేనిది అన్నారు.


**వరల్డ్ క్లాస్ ఏవియేషన్ హబ్‌గా :**

భోగాపురం వరల్డ్ క్లాస్ ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చెందనుందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఒకప్పుడు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌పై వచ్చిన విమర్శలకు భోగాపురమే సమాధానంగా ఉందని ఆయన అన్నారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల దిశ దశ ఈ విమానాశ్రయంతో పూర్తిగా మారనున్నాయని జోస్యం చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌తో టూరిజం, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని కూడా ఆయన అంచనా వేస్తున్నారు. విశాఖ రీజియన్ రోజురోజుకీ ఆర్థికంగా బలోపేతం అవుతుందని ఆయన అన్నారు.

ఇక భోగాపురం ఎయిర్ పోర్టు మరో నాలుగైదు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభం అవుతుందని కేంద్ర మంత్రి చెప్పారు. అన్ని సాంకేతిక, నియంత్రణ ప్రక్రియలు పూర్తయ్యాయని, ఫ్లైట్ ల్యాండ్ కావడం అంటే ఎయిర్‌పోర్ట్ పనులు దాదాపు పూర్తైనట్టే అని ఆయన స్పష్టం చేశారు. ఒడిశా, రాయపూర్ ప్రాంతాల ప్రజలకు కూడా భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉపయోగపడనుందని అన్నారు. అలాగే అన్ని ప్రాంతాలకు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇక భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాందిగా మారిందని ఆయన చెప్పారు, స్థానిక యువతకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని కేంద్ర మంత్రి చెప్పడం విశేషం.

# హైదరాబాద్ లో మరో భర్త ప్రాణాల్ని తీసిన భార్య

**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లైన తర్వాత పరాయి మగాడి మోజులో పడిన భార్య.. కట్టుకున్న భర్తను పాశవికంగా హత్యలు చేస్తున్న పరంపర అంతకంతకూ ఎక్కువ అవుతోంది. నిజానికి భర్తతో తనకు సంతోషంగా లేకున్నా.. ఆనందంగా ఉండలేకపోయినా.. తనకు కలిసి జీవించటం సాధ్యం కాదని డిసైడ్ అయిన తర్వాత చట్టబద్ధంగా విడిపోవటం సముచితం. అయితే.. అందుకు సమాజం.. చుట్టూ ఉన్న పరిస్థితులు అనుకూలించవన్న ఉద్దేశం ఒక వైపు..మరోవైపు తమకు మించిన తెలివైనోళ్లు ఎవరూ ఉండరన్నట్లుగా భావించి సింపుల్ గా హత్య చేసేసి తప్పించుకోవచ్చన్న అతి తెలివి అంతకంతకూ ఎక్కువ అవుతోంది.తాజాగా మరోసారి అలాంటి దారుణ ఉదంతమే హైదరబాద్ లో చోటు చేసుకుంది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్న ఉద్దేశంతో భర్తను చంపేసిన భార్య ఉదంతమిది. ఒడిశాకు చెందిన 32 ఏళ్ల నారాయణకు, 27 ఏళ్ల బంధితకు ఎనిమిదేళ్ల క్రితం పెళ్లైంది. వారికి ఆరేళ్ల కుమార్తె ఉంది. హైదరాబాద్ లో సెటిల్ అయిన నారాయణ.. ప్లంబర్ గా పని చేస్తుంటాడు.నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ లో వీరి నివాసం. ఇదిలా ఉండగా పాతికేళ్ల విద్యాసాగర్ బిహార్ కు చెందిన వాడు. ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చి ఉంటున్నాడు. నారాయణ, విద్యాసాగర్ ఇళ్లు పక్కపక్కనే ఉండేవి. ఈ సందర్భంగా వీరి మధ్య మొదలైన పరిచయం చివరకు వివాహేతర సంబంధంగా మారింది. ఈ క్రమంలో తమ సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను వదిలించుకోవటానికి భర్తను హత్య చేయటమే పరిష్కారంగా భావించింది.ఇందులో భాగంగా నారాయణ, విద్యాసాగర్ కలిసి మద్యం తాగారు. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన భర్తతో గొడవ పెట్టుకున్న బంధిత.. తమ ప్లాన్ లో భాగంగా ప్రియుడితో కలిసి భర్త తల మీద ఐరన్ రాడ్ తో బలంగా కొట్టటంతో అక్కడికక్కడే మరణించాడు. అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసిన పోలీసులు రోజు వ్యవధిలోనే నిందితుడ్ని గుర్తించి అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో భర్తను ప్లాన్ చేసి చంపేసిన వైనం ఒప్పుకోవటంతో వారిని రిమాండ్ కు తరలించారు. ఈ ఉదంతం స్థానికంగా సంచలనంగా మారింది.



## జెలెన్స్కీ మీద పుతిన్ అదే పని చేస్తే ?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ రోజున అగ్ర రాజ్యం అమెరికా ప్రపంచానికి సరికొత్త నీతిని బోధించింది. అదేంటి అంటే బలవంతుడిదే రాజ్యం అని. ఎవడి దగ్గర గట్టిగా బలం బలగం ఉంటుందో వాడు ఏమైనా చేయవచ్చు అని. రాత్రికి రాత్రి సైన్యాన్ని మోహరించి బాంబులు పేల్చి శత్రువు అనుకున్న వాడిని లొంగదీసుకోవచ్చు. ఏకంగా వారి బెడ్ రూం దాకా వెళ్ళి మరీ కిడ్నాప్ చేసేయవచ్చు. భార్యతో సహా వెంట తెచ్చుకోవచ్చు. ఇదే నయా యుద్ధ నీతి. ఇదే ఇపుడు చెల్లుబాటు అని అగ్ర రాజ్యం ప్రపంచ పోలీసుగా భావించే పెద్దన చెప్పే నీతి సూత్రం ఇదే అంటున్నారు.

**చేష్టలుడిగిన తీరు :**

ఇదిలా ఉంటే ఈ ప్రపంచంలో చాలా కాలంగా అనేక దేశాల మధ్య ప్రత్యక్ష యుద్ధాలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్ ఇరాక్ మధ్య యుద్ధం చూసినా రష్యా ఉక్రెయిన్ యుద్ధం చూసినా అలాగే అనేక దేశాల మధ్య యుద్ధ సన్నాహాలు కానీ ప్రచ్ఛన్న యుద్ధాలు కానీ చూసినా అంతర్జాతీయ సంస్థలు ఏమి చేస్తున్నాయన్న సందేహాలు రాక మానదు, ఐక్య రాజ్యసమితి అని అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేసుకున్నాం. మరి శాంతి కోసం పనిచేయాలి, దేశాల మధ్యన ఘర్షణలు చోటు చేసుకోకుండా ముందే నివారించాలి. కానీ అలాంటిది ఏదీ జరగడం లేదని అంటున్నారు. 1945 తరువాత అప్పటిదాకా ఉన్న నానా జాతి సమితి ప్లేస్ లో ఐక్య రాజ్య సమితిని ఏర్పాటు చేశారు. కానీ పెద్దన్నల ఆధిపత్య పోకడలే అంతర్జాతీయంగా ఎక్కడ చూసినా యధేచ్ఛగా సాగిపోతున్నాయి. అదే సమయంలో ఘర్షణలు నివారించే సన్నివేశాలు కనిపించడం లేదు. ఉక్రెయిన్ రష్యాల మధ్య గత అయిదేళ్ళుగా సాగుతున్న యుద్ధమే ఇందుకు ఉదాహరణ అని చెబుతారు.

**జెలెన్స్కీ ఇలా తెస్తే :**

యుద్ధం సుదీర్ఘంగా జరుగుతున్నా జెలెన్స్కీ మీద రష్యా అయితే ఇంతవరకూ బల ప్రయోగం చేయలేదు. వెనెజులా అధ్యక్షుడిని అమెరికా బంధీ చేసిన మాదిరిగా రష్యా అధినేత పుతిని చేస్తే ఏమవుతుంది అన్న కొత్త చర్చ మొదలైంది. అంతే కాదు బలవంతుడు ఎవరైనా ఎక్కడైనా ఇలా దేశాల మీద దాడులు చేసి అక్కడ పాలకులను బంధించి తమ వెంట తీసుకుని వచ్చే విధానం వల్ల అంతర్జాతీయ చట్టాలు నింబంధనలు ఇబ్బందుల్లో పడతాయి అని అంటున్నారు.

**ఒవైసీ సలహానా :**

ఇదిలా ఉంటే అమెరికా పెద్దన్న చేసినట్లుగా మోడీ కూడా పాక్ మీదకు వెళ్ళి ముంబై దాడుల సూత్రధారిని పట్టి తీసుకుని రావచ్చు కదా అని మజ్లీస్ అధినేత ఒవైసీ సలహా లాంటి సూచన చేశారు. మరి ఆయన ఏ ఉద్దేశ్యంతో అన్నారో ఏమో తెలియదు. మరో వైపు ఇలా దేశాల మీద పడిపోయి ఈ విధంగా కూడా చేయాలీ అనుకుంటే అపుడు అగ్ర రాజ్యాలే మిగులుతాయి, ఏ దేశాధినేత కూ రక్షణ ఉండదు, ఏ దేశమూ శాంతిగా ఉండదు, అక్కడ ప్రజలు సైతం ప్రాణాలు అర చేతులలో పెట్టుకోవాల్సిందే అంటున్నారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం మీద అయితే మిశ్రమ స్పందన వస్తోంది. అమెరికా చేయడం కరెక్ట్ అన్న దేశాలు కొన్ని ఉంటే కాదు అన్నవి మరి కొన్ని దేశాలు. మరి ఈ అంతర్జాతీయ న్యాయంలో ఏది నిజం ఏది తప్పు అన్నది కాలం కూడా అంచనా వేసి జవాబు చెప్పగలుతూందా అన్నదే చూడాల్సి ఉంది.

## వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్.. ఎవరీమె? బ్యాక్ గ్రౌండ్ ఏంటి?



**హైదరాబాద్ పెన్ పవర్:** వెనెజువెలాలో చోటుచేసుకున్న అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్స్ పేరు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోంది. నికొలస్ మదురో అరెస్ట్ తర్వాత దేశ పగ్గాలు చేపట్టిన ఆమె నేపథ్యం.. రాజకీయ ప్రస్థానం.. ఆమె ముందున్న సవాళ్లు అధికంగా ఉన్నాయి.

**కుటుంబ నేపథ్యం.. రాజకీయ అడుగులు**

వెనెజువెలా రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన మహిళగా ఎదిగిన డెల్సీ రోడ్రిగ్స్, ఇప్పుడు ఆ దేశ సంక్షోభ సమయంలో కీలక బాధ్యతను భుజానికెత్తుకున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తాత్కాలిక అధ్యక్షురాలిగా నియమితులైన ఆమె రాజకీయ ప్రయాణం ఆసక్తికరం. డెల్సీ రోడ్రిగ్స్ 1969లో కారకాస్‌లో జన్మించారు. ఆమె తండ్రి జోర్జ్ ఆంటోనియో రోడ్రిగ్స్ వెనెజువెలాలోని 'సోషలిస్ట్ లీగ్' వ్యవస్థాపకుడు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న డెల్సీ చిన్నప్పటి నుంచే వామపక్ష భావజాలంతో పెరిగారు. ఆమె సోదరుడు జోర్జ్ రోడ్రిగ్స్ కూడా వెనెజువెలా ప్రభుత్వంలో కీలక నేతగా కొనసాగుతున్నారు.

**మదురో ప్రభుత్వంలో నమ్మకస్తురాలు..**

నికొలస్ మదురో అధికారంలో వచ్చినప్పటి నుండి డెల్సీ ఆయనకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఆమె ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవించారు. అంతర్జాతీయ వేదికలపై వెనెజువెలా వాణిని బలంగా వినిపించారు. 2018 నుంచి దేశ రెండో అత్యున్నత పదవిలో కొనసాగుతూ పాలనపై పట్టు సాధించారు. దేశ ఆర్థిక మూలస్తంభమైన చమురు రంగాన్ని పర్యవేక్షించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు.

**ఆర్థిక సంక్షోభం.. వ్యూహకర్తగా డెల్సీ**

వెనెజువెలా చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు డెల్సీ వినూత్న ప్రయత్నాలు చేశారు. అమెరికా ఆంక్షల మధ్య రష్యా, చైనాలతో సంబంధాలను బలపరిచారు. దేశీయంగా ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి పడిపోతున్న కరెన్సీ విలువను కాపాడే ప్రయత్నం చేశారు.

**అంతర్జాతీయ మద్దతు.. అమెరికా వైఖరి**

సాధారణంగా అమెరికా, వెనెజువెలా మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా ఉంటాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమె పట్ల సానుకూలత వ్యక్తం చేయడం గమనార్హం. "వెనెజువెలాను మళ్ళీ గొప్పగా మార్చే క్రమంలో డెల్సీ సహకరిస్తారు" అని ట్రంప్ వ్యాఖ్యానించడం.. అంతర్జాతీయంగా కొత్త దౌత్య మార్పులకు సంకేతంగా కనిపిస్తోంది.తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీకి పూలపాన్పు ఎదురుకావడం లేదు. ఆమె ముందు ప్రధానంగా పెద్ద సవాళ్లు ఉన్నాయి.. కుప్పకూలిన దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి నిర్మించడం.. ఆకలి చావులను అరికట్టడం అంత ఈజీ కాదు.. రాజకీయ స్థిరత్వం కోసం మదురో వర్గానికి.. ప్రతిపక్షాలకు మధ్య సమన్వయం సాధించడం అవసరం. ఆంక్షలను తొలగించుకుని, ప్రపంచ దేశాలతో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించడం ఎంతో కీలకం. డెల్సీ రోడ్రిగ్స్ కేవలం ఒక రాజకీయ నాయకురాలు మాత్రమే కాదు.. తీవ్ర సంక్షోభంలో ఉన్న దేశానికి ఆశాదీపం లాంటి వారు. మదురో శకం ముగిసిన తర్వాత ఆమె వెనెజువెలాను ప్రజాస్వామ్య , ఆర్థిక స్థిరత్వం వైపు నడిపిస్తారా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రాత్రికి రాత్రే కోటీశ్వరుడు: మదురో అరెస్ట్‌ను ముందే ఊహించి రూ. 3.6 కోట్లు కొల్లగొట్టాడు!




**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్ట్ కావడంతో కొందరు వ్యాపారులు మాత్రం తెలివిగా భారీగా లాభపడ్డారు. ఎలా అని ఆశ్చర్య పోతున్నారా... సాధారణ ప్రజలు మదురో అరెస్ట్ వార్త ఒక్కసారిగా తెలియగానే ఆశ్చర్యపోయారు... కానీ కొందరు వ్యాపారులు మాత్రం ఈ విషయాన్ని ముందే ఊహించి పందెం వేశారు. పాలిమార్కెట్ (గ్రాశీశ్రీఎమ్ఖతీఎవ్) వంటి అంచనా మార్కెట్లలో మదురో పట్టుబడటం లేదా అరెస్ట్ అవుతాడని పందెం వేసి వేల డాలర్లు గెలుచుకున్నారు. శనివారం ఉదయం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారికంగా ప్రకటించక ముందే, శుక్రవారం రాత్రి నుంచే ఈ మార్కెట్లలో మదురో పై పందాలు పెరిగిపోయాయి. విషయం ఏంటంటే ఈ మార్కెట్లలో ఒక కొత్త అకౌంట్ ద్వారా శుక్రవారం రాత్రి సుమారు వి30,000 అంటే సుమారు 25 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. మదురో అరెస్ట్ అయిన తర్వాత, పెట్టిన ఆ పెట్టుబడి విలువ ఏకంగా వి4,36,759 అంటే సుమారు 3.6 కోట్ల రూపాయలకు చేరింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మదురో పదవి నుంచి తప్పుకుంటారనే బెట్టింగ్ రేట్లు అకస్మాత్తుగా పెరిగాయి. అంటే ఎవరో ముందే ఈ సమాచారాన్ని ఊహించారని లేదా ఇంటర్నల్ సమాచారం తెలిసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ పరిణామాలు, స్పోర్ట్స్ లేదా ఎన్నికల ఫలితాలపై ఇలాంటి అంచనా మార్కెట్లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. 2024 అమెరికా ఎన్నికల సమయంలో కూడా ఈ మార్కెట్లు ఇలాగే వార్తల్లో నిలిచాయి. అయితే, ఇలాంటి సున్నితమైన రాజకీయ విషయాలపై పందాలు వేయడం, ఇంటర్నల్ సమాచారాన్ని వాడుకోవడం వంటి అంశాలపై ఇప్పుడు తీవ్ర చర్చ మొదలైంది.

# విమాన ప్రయాణికులకు బిగ్ అలర్ట్: ఫ్లైట్‌లలో పవర్ బ్యాంక్ వినియోగంపై డీజీసీఏ నిషేధం





**హైదరాబాద్ పెన్ పవర్:** విమాన భద్రతా చర్యల్లో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విమాన ప్రయాణంలో పవర్ బ్యాంక్ వినియోగంపై నిషేధం విధించింది. ఇటీవల విమానాల్లో పవర్ బ్యాంక్‌ల్లో ఉపయోగించే లిథియం బ్యాటరీల్లో మంటలు చెలరేగిన వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డేంజరస్ గూడ్స్ అడ్వైజరీ పేరుతో డైరెక్టరేట్ జనరల్ సివిల్ ఏవియేషన్ (ణ+జూా) సర్క్యులర్ జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం.. విమాన ప్రయాణ సమయంలో ఓవర్ హెడ్ కంపార్ట్‌మెంట్లలో పవర్ బ్యాంకులు, విడి లిథియం బ్యాటరీలను ఉంచడం నిషేధం. ఇకపై వీటిని ప్రత్యేక లగేజీలో కాకుండా మనమే క్యారీ చేయాల్సి ఉంటుంది. అలాగే.. ప్రయాణీకులు ఇకపై తమ పవర్ బ్యాంక్‌లను విమానం సీటు పవర్ సాకెట్‌లకు కనెక్ట్ చేసి చార్జ్ చేసుకోవడానికి అనుమతి ఉండదు. 100 వాట్-అవర్స్ (27,000హెూప్ర) కంటే తక్కువ సామర్థ్యం ఉన్న పవర్ బ్యాంక్‌లు మాత్రమే విమాన ప్రయాణానికి అనుమతిస్తారు.

**నిషేధానికి ముఖ్య కారణం..?**

సాధారణంగా పవర్ బ్యాంకులు, పోర్టబుల్ ఛార్జర్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లలో ఉపయోగించే లిథియం బ్యాటరీలు కొన్ని పరిస్థితుల్లో వేడెక్కడం, మంటలు అంటుకోవడం లేదా పేలిపోతుంటాయి. ఈ క్రమంలోనే స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లు, పవర్ బ్యాంకులు వంటి పరికరాల్లో లిథియం బ్యాటరీలను విస్తృతంగా ఉపయోగించడం వల్ల మంటలు చెలరేగే అవకాశం ఉంది. 2025, అక్టోబర్ 19న ఢిల్లీ విమానాశ్రయంలో ఇండిగో విమానం టేకాఫ్ అవుతుండగా ఓ ప్రయాణికుడి వద్ద ఉన్న పవర్ బ్యాంక్‌లో మంటలు చెలరేగాయి. క్యాబిన్ సిబ్బంది సకాలంలో స్పందించడం వల్ల పెను ప్రమాదం తప్పింది. ఈ తరహా ఘటనలు విమానాల్లో ఇటీవల ఎక్కువయ్యాయి. దీంతో అప్రమత్తమైన డీజీసీఏ భద్రతా చర్యల్లో భాగంగా విమాన ప్రయాణంలో పవర్ బ్యాంక్ వినియోగంపై నిషేధం విధించింది. ముఖ్యంగా పవర్ బ్యాంకులు, పోర్టబుల్ ఛార్జర్లను ఓవర్ హెడ్ బిన్‌లలో ఉంచినప్పుడు పొగ లేదా మంటలను గుర్తించడం కష్టతరమవుతోందని, ఇది విమాన భద్రతకు పెను ముప్పని డీజీసీఏ పేర్కొంది.

# పిల్లల ప్రాణాలతో చెలగాటం: స్కూల్ వ్యాన్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్న విద్యార్థులు..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్ జిల్లా పడ్రౌనాలోని ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక చిన్న ఎస్‌యూవీ వాహనంలో స్కూల్ విద్యార్థులు సామర్థ్యానికి మించి కిక్కిరిసి ప్రయాణిస్తున్న దృశ్యాలు అందరినీ భయాందోళనకు గురిచేస్తున్నాయి. స్కూలుకు వెళ్లే చిన్న పిల్లలు ఈ వాహనం లోపల ఇరుక్కుని కూర్చోవడమే కాకుండా, కొందరు విద్యార్థులు వాహనం వెనుక భాగంలో వేలాడుతూ ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడమే ఇలాంటి పరిస్థితులకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిబట్టి చూస్తే స్కూల్ వాహనాలు పాటించాల్సిన కనీస భద్రతా ప్రమాణాలను కూడా ఇక్కడ పూర్తిగా విస్మరిస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ స్కూల్ వాహనం సామర్థ్యానికి మించి పిల్లలను ఎక్కించడం వల్ల ఏదైనా చిన్న ప్రమాదం జరిగినా భారీ ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు వెళ్తున్న తరుణంలో ఇలాంటి దృశ్యాలు బాధాకరం అని కొందరు, ఆర్టీఓ (ఙూ) అధికారులు ఏం చేస్తున్నారో? అని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతుండగా... కుషినగర్ జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి, స్కూల్ కు సురక్షితమైన రవాణా సౌకర్యాలు కల్పించేలా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది.

# జపాన్‌తో దూరం.. చైనాతో స్నేహం: కొరియా శాంతి కోసం అధ్యక్షుడి పర్యటన.. జీ జిన్‌పింగ్‌తో భేటీ !



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర కొరియా మిసైల్ ప్రయోగాలు చేసిన కొద్ది గంటలకే, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ ఆదివారం చైనా పర్యటన ప్రారంభించారు. కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం. అయితే జూన్‌లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత లీ జే మ్యుంగ్ చైనాకు ఇదే తొలి పర్యటన.

ఈ పర్యటనలో లీ జే మ్యుంగ్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం కానున్నారు. వీరిద్దరూ గత రెండు నెలల్లో కలవడం ఇది రెండోసారి. జపాన్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో చైనా ఇప్పుడు దక్షిణ కొరియాతో ఆర్థిక సహకారాన్ని, పర్యాటకాన్ని పెంచుకోవాలని చూస్తోంది. తైవాన్ విషయంలో జపాన్ చేసిన వ్యాఖ్యల వల్ల చైనా అసంతృప్తిగా ఉంది. మరోవైపు, ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలు చేస్తూ చైనా, దక్షిణ కొరియాల మధ్య సంబంధాలను అడ్డుకోవాలని చూస్తోంది. ఈ పర్యటనలో లీ జే మ్యుంగ్ వెంట సుమారు 200 మంది వ్యాపార దిగ్గజాలు ఉన్నారు. వీరిలో ముఖ్యులైన శామ్సంగ్ చైర్మన్ జే వై. లీ, ఖఖ గ్రూప్ చైర్మన్ చెయ్ టే-వోన్, హ్యుందాయ్ మోటార్ గ్రూప్ చైర్మన్ యుయిసున్ చుంగ్ ఉన్నారు. ఈ నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండు దేశాలు వస్తువుల ఉత్పత్తి & సరఫరాలో పెట్టుబడులు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, రెండు దేశాల మధ్య కళలు ఇంకా సంస్కృతిని ప్రోత్సహించడం అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా కొరియా ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మీ నెల జీతంతో కోటీశ్వరులు అవ్వడం ఎలా? ఇప్పటి నుండే రూ. 10వేల పెట్టుబడితో ఇలా ప్లాన్ చేసుకోండి..




**హైదరాబాద్ పెన్ పవర్:** మీరు ఒక మంచి ఉద్యోగంతో నెలకు రూ. 50వేల జీతం సంపాదిస్తుంటే... ముఖ్యంగా ముంబై, ఢిల్లీ లేదా బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో పెరుగుతున్న ఖర్చుల కారణంగా పెద్ద మొత్తం సేవింగ్స్ కష్టం అని మీరు అనుకోవచ్చు. కానీ మంచి విషయం ఏమిటంటే క్రమశిక్షణ పద్ధతితో సేవింగ్స్, తెలివైన పెట్టుబడి మెల్లిమెల్లిగా గొప్ప కార్పస్‌ను నిర్మించడంలో మీకు సహాయపడతాయి. కాంపౌండింగ్, స్థిరమైన పెట్టుబడులు, కొంచెం ఓపిక ద్వారా రూ.1 కోటి కూడబెట్టడం ఖచ్చితంగా సాధించవచ్చు.

ఈరోజుల్లో యువత తమ కెరీర్ ప్రారంభంలోనే ఆర్థిక క్రమశిక్షణతో గొప్ప సంపదను సృష్టిస్తోంది. ఇందుకు ఎక్కువగా ఎంచుకుంటున్న మార్గం మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP). ఉదాహరణకి చెప్పాలంటే మీరు నెలకు కేవలం 10వేల రూపాయలతో SIP ద్వారా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడితే, అది 1 కోటి రూపాయల భారీ నిధిగా మారవచ్చు.

ఇందుకు పెట్టుబడి వ్యవధి: 21 సంవత్సరాలు
లిఅంచనా వేసిన రాబడి: 12% మొత్తం
లిపెట్టుబడి మొత్తం: రూ. 25.2 లక్షలు
లిఅంచనా వేసిన రాబడి: రూ. 79.1 లక్షలు
లిమెచ్యూరిటీ కార్పస్: రూ. 1.04 కోట్లు.

ఇలా ప్రతినెలా పెట్టుబడి మొత్తం ఎక్కువగా ఉండటం వల్ల వేగంగా ఫలితాలు వస్తాయి. ఉదాహరణకు, ప్రతినెలా ాఞా మొత్తం రూ. 20 వేలు, అంచనా వేసిన రాబడి రేటు 12% అయితే, మీరు దాదాపు 16 సంవత్సరాలలో రూ. 1 కార్పస్‌ను సాధించవచ్చు.

మీరు మీ 20 ఏళ్లకి పెట్టుబడి పెట్టడం ప్రారంభించి, మరో 2030 సంవత్సరాలు పెట్టుబడి చేస్తే 'కాంపౌండింగ్' అంటే చక్రవడ్డీ మీ సంపదను ఊహించలేనంతగా పెంచుతుంది. ఎంత ఎక్కువ కాలం మార్కెట్‌లో ఉంటే, మీ పెట్టుబడి అంత వేగంగా పెరుగుతుంది. మీ వయసు తక్కువగా ఉండటం వల్ల మీరు ధైర్యంగా కొన్ని మార్కెట్ రిస్క్‌లు తీసుకోవచ్చు. ఒకవేళ మార్కెట్ పడిపోయినా, తిరిగి కోలుకోవడానికి మీకు తగినంత సమయం ఉంటుంది. కాబట్టి నష్టాల గురించి భయపడాల్సిన అవసరం ఉండదు.

నెలకు రూ. 50,000 జీతం నుండి కనీసం 2030% సేవింగ్స్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోండి. అంటే నెలకు రూ.10,00015,000. ఈ మొత్తం మీ జీతం క్రెడిట్ అయిన వెంటనే పెట్టుబడిలోకి ఆటోమేట్ చేయండి. మీ ఆదాయం లేదా జీతం పెరుగుతున్న కొద్దీ, మీ ఖర్చులు పెంచుకునే బదులు ఈ మొత్తాన్ని పెట్టుబడి పెంచుకునేలా చూసుకోండి.

మీ మొదటి జీతం మీకు చివరిది కాదు కాబట్టి పదోన్నతులు, ఉద్యోగ మార్పులు సాధారణంగా మెల్లిమెల్లిగా ఆదాయాన్ని పెంచుతాయి. అలాగే కనీసం ఆరు నెలల ఖర్చులకి సరిపోయే అత్యవసర నిధి మీ వద్ద ఉండేలా చూస్కోండి. ఇందుకు ఆరోగ్య, టర్మ్ బీమా కూడా చాల ముఖ్యం. ఇవి అత్యవసర సమయంలో పెట్టుబడులు విత్ డ్రా చేయకుండా కొంత రక్షణగా ఉంటాయి. గుర్తుంచుకోండి, రూ. 50,000 జీతం అనేది చిన్న ప్రారంభం కావొచ్చు, కానీ అది మీ భవిష్యత్తును నిర్ణయించదు. మీరు ఎంత త్వరగా పెట్టుబడి మొదలుపెడితే, కాంపౌండింగ్ వల్ల అంత ఎక్కువ లాభం పొందుతారు.

# పెయిన్ కిల్లర్స్ మంచివా? కాదా? పారాసిటమాల్ పర్లేదు కానీ.. ట్రమడాల్‌శ్రీకు మాత్రం అడిక్ట్ అవ్వొద్దు !



**హైదరాబాద్ పెన్ పవర్:** తలనొప్పి, నడుము నొప్పి.. ఇలా ఒంట్లో ఏ నొప్పులు ఉన్నా వెంటనే గుర్తొచ్చేది పెయిన్ కిల్లర్. మెడికల్ షాప్‌లో ఈజీగా, తక్కువ ధరకు దొరికే ఈ నొప్పి నివారణ మాత్రలు వేసుకోగానే నిమిషాల్లో రిలీఫ్ ఇస్తాయి. అందుకే నొప్పులతో బాధపడేవారు ఒక దశలో వీటికి అలవాటు పడిపోతారు. కానీ, కొంతకాలం తర్వాత ఆ మాత్రలు వేసుకున్నా నొప్పులు తగ్గట్లేదని డాక్టర్ దగ్గరకు వెళ్తారు. అప్పుడు తెలుస్తుంది అసలు సమస్య! మరి పెయిన్ కిల్లర్స్ మంచివా? కాదా?

కిల్లర్ వేసుకోగానే చాలా ఫాస్ట్‌గా రిలీఫ్ వస్తుంది. అందుకే చాలామంది రెగ్యులర్‌గా వాడుతుంటారు. కానీ.. అలా వాడితే గ్యాస్ట్రైటిస్, ఎసిడిటీ పెరుగుతుంది. వీటిని ఏడాదికో, నెలకో ఒకటి రెండు సార్లు వాడితే పర్లేదు. అంతకుమించి వాడితే కడుపులో అల్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే కిడ్నీల మీద ప్రభావం చూపిస్తాయి. ఈ విషయాలన్నీ పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్ వాడేవాళ్లకు తెలిసినవే. కానీ, తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయి.

గతేడాది అక్టోబర్‌లో 'బిఎమ్‌జె ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్' పబ్లిష్ చేసిన జర్నల్ ప్రకారం దీర్ఘకాలిక నొప్పులను నివారించేందుకు ట్రమడాల్ ట్యాబ్లెట్ పెద్దగా ప్రభావం చూపించట్లేదు. రీసెర్చర్లు సుమారు 6,500 మందిపై19 రకాల క్లినికల్ ట్రయల్స్ డేటాను పరిశీలిస్తే ఈ మందు మంచికన్నా చెడు ఎక్కువగా చేస్తుందని గుర్తించారు. మామూలుగానే ఈ తరహా పెయిన్ కిల్లర్స్ వాడినప్పుడు మలబద్ధకం, మగతగా అనిపించడంతోపాటు కొంతమందికి వాంతులు కూడా అవుతాయి. ఈ టాబ్లెట్స్ వాడితే అలవాటు పడే చాన్స్ కూడా ఉంది.

అయితే లేటెస్ట్ రీసెర్చ్‌శ్రీలో ట్రమడాల్‌వాడడం వల్ల చాతీ నొప్పి, కరోనరీ ఆర్టరీ డిసీజ్, హార్ట్ ఫెయిల్యూర్ వంటివి జరిగే ప్రమాదం ఉందని తేలింది. ట్రమడాల్ అనేది ఒపియాయిడ్ అనే మత్తు మందు రకానికి చెందినది. కాబట్టి మెదడుకు సంకేతాలు అందకుండా మందగించేలా చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఆరు కోట్ల మంది ఈ డ్రగ్‌కు బానిస అయినట్లు అంచనా. అందుకని దీని వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని ఎక్స్‌పర్ట్స్ చెప్పారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తోనే వాడాలి. కామన్ రీజన్స్‌పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల క్రియాటిన్ పెరిగి కాళ్లు, మొహంలో వాపు కనిపిస్తుంది. కాబట్టి ముందు నొప్పి ఎందుకు వస్తుందో తెలుసుకోవాలి. ఉదాహరణకు కాల్షియం, విటమిన్‌డి వంటివి తక్కువైతే ఒళ్లు నొప్పులు వస్తాయి. యూరిక్ యాసిడ్ పెరిగినా పెయిన్స్ వస్తాయి. ఇలా రకరకాల కారణాలు ఉంటాయి. అందుకని నొప్పులు ఎందుకు వస్తున్నాయో తెలుసుకుని వాడితే తిరిగి రాకుండా ఉంటాయి. తలనొప్పి, నడుము నొప్పి అంటూ ప్రతిదానికీ పెయిన్ కిల్లర్స్ వాడొద్దు.

పీరియడ్ టైంలో వచ్చే నొప్పికి కూడా డాక్టర్ సలహా మేరకు మాత్రమే వాడాలి. ఎందుకంటే నొప్పికి రకరకాల కారణాలు ఉండొచ్చు అంటున్నారు గైనకాలజిస్ట్‌లు. ఏ టాబ్లెట్ అయినా డాక్టర్ చెప్పిన టైం వరకే వాడాలి. ఆ తర్వాత కంటిన్యూ చేయకూడదు. మళ్లీ డాక్టర్‌ని సంప్రదించి సలహా తీసుకోవాలి. అంతేకానీ, మెడికల్ షాప్‌శ్రీలో దొరుకుతున్నాయని వాడితే టాబ్లెట్స్‌కి అలవాటుపడిపోతారు. దీంతో సమస్య తగ్గకపోగా పెద్దదవుతుంది.

పారాసిటమాల్ పర్లేదు!

అన్నింటికన్నా ఎక్కువగా వాడేది పారాసిటమాల్. ఇది సాధారణంగా జ్వరానికి వాడతారు. కానీ, ఇది కొన్ని రకాల నొప్పుల నుంచి రిలీఫ్ ఇస్తుంది. కాబట్టి కొంతమంది వీటిని నొప్పులకు కూడా వాడుతుంటారు. అయితే దీనివల్ల సైడ్ ఎఫెక్ట్స్ చాలా తక్కువ. అందుకని పెయిన్ కిల్లర్ వాడాలనుకుంటే ఇది బెటర్. అలాగని రోజూ వాడకూడదు.

**నొప్పి ఎందుకు వస్తుంది ?**

ఆర్థోపెడిక్ సమస్యలకు పెయిన్ కిల్లర్స్ వాడాల్సి వస్తుందని ఆర్థోపెడీషన్లు చెప్తున్నారు. దాంతోపాటు ఈ పెయిన్ కిల్లర్స్‌ని లాంగ్ టర్మ్‌లో వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని కూడా అంటున్నారు. అయితే అసలు నొప్పులు ఎందుకొస్తాయనేది ఇలా వివరించారు. సాధారణంగా ఏదైనా గాయమైనప్పుడు నొప్పి వస్తుంది. అక్కడ రిపేర్ జరగాల్సిన అవసరం ఉందని బ్రెయిన్‌కి సిగ్నల్ వెళ్తుంది. దీంతో గాయం తగ్గడానికి బాడీలో రియాక్షన్స్ జరుగుతాయి. అయితే, బాడీలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు) వల్ల నొప్పి వస్తుంది. ఎలాగంటే.. ప్రోస్టాగ్లాండిన్స్ అనే కెమికల్స్ రిలీజ్ అవ్వడం వల్ల రియాక్షన్ జరిగి నొప్పి వస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే క్రానిక్ పెయిన్‌కి కారణమవుతుంది.

నిజానికి ప్రోస్టాగ్లాండిన్స్ బాడీలో స్టమక్, ఇంటస్టైనల్ లైనింగ్‌లా ఉండే మ్యూకోసాను పొట్టలో విడుదలయ్యే యాసిడ్స్ నుంచి రక్షిస్తుంటాయి. అలాగే దెబ్బ తగిలినప్పుడు వెంటనే రక్తం గడ్డకట్టడానికి

ప్రోస్టాగ్లాండిన్స్ ఉపయోగపడతాయి. ఇవి సైక్లోఆక్సిజనేస్ అనే ఎంజైమ్ నుంచి ప్రొడ్యూస్ అవుతాయి. అయితే వీటిలో రెండు రకాలున్నాయి. మొదటిరకం బాడీకి మేలు చేస్తుంది. సైక్లోఆక్సిజనేజ్ 2 నుంచి విడుదలయ్యే ప్రోస్టాగ్లాండిన్స్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. పెయిన్ కిల్లర్స్ సైక్లోఆక్సిజనేజ్1, 2 ఎంజైమ్స్ రెండింటి మీద ప్రభావం చూపిస్తాయి. దాంతో ప్రోస్టాగ్లాండిన్స్ ప్రొడక్షన్ తగ్గుతుంది. దీంతో వాపు తగ్గిపోతుంది. అయితే, రెగ్యులర్‌గా పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల పొట్ట, పేగుల్లో ఉండే మ్యూకోసా పొర మీద ఎఫెక్ట్ చూపిస్తుంది. మొదటి రకం ఎంజైమ్ రకాన్ని ప్రభావితం చేయడం వల్ల అల్సర్లు, ఎసిడిటీ వంటివాటితోపాటు పేగుల్లో బ్లీడింగ్ అయ్యే ప్రమాదం ఉంది. రక్తం పలచగా అవుతుంది. గాయమైతే రక్తస్రావం ఎక్కువగా ఉంటుంది. దీన్ని అరికట్టడానికి సైక్లోఆక్సిజనేజ్ 2 ఇన్‌హిబిటర్స్ అనే టాబ్లెట్స్‌ను సైంటిస్ట్‌లు కనిపెట్టారు. వీటిని వాడాలంటే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి. ఎందుకంటే గుండె, కిడ్నీ, లివర్, అలెర్జీ సమస్యలు ఉన్నవాళ్లు వాడకూడదు. చిన్నపిల్లలు వీటికి దూరంగా ఉండాలి.

## 2 వేలు మీవి కాదనుకుంటే ఈ సోలార్ పవర్ బ్యాంక్ కొనేయొచ్చు.. ఇది ఎంత బెటర్ అంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** కరెంట్ సౌకర్యం కూడా లేని మారుమూల ప్రాంతాలకు క్యాంపింగ్‌కు వెళ్లినప్పుడు, ట్రావెలింగ్‌లో ఉన్నప్పుడు గాడ్జెట్స్‌కి చార్జ్ చేసుకోవడం కష్టమవుతుంది. అలాంటప్పుడు ఈ సోలార్ పవర్ బ్యాంక్ బాగా ఉపయోగడుతుంది. దీన్ని ట్రస్ట్ బాస్కెట్ అనే కంపెనీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఇందులోని బ్యాటరీ 20,000ఎంఏహెచ్ కెపాసిటీతో వస్తుంది. దీనికి 4 సోలార్ ప్యానెల్స్ ఉంటాయి. వాటితో బ్యాటరీ రీచార్జ్ అవుతుంది. ప్యానెల్స్‌ని ఓపెన్ చేసి బ్యాక్‌ప్యాక్ లేదా ట్రావెల్ బ్యాగ్‌కి తగిలిస్తే సరిపోతుంది.

యూఎస్‌బీ, టైప్ సీ అవుట్‌పుట్ పోర్ట్‌లతో రావడం వల్ల ఫోన్లు, టీడబ్ల్యూఎస్ బడ్స్, స్మార్ట్ వాచ్.. ఇలా అన్ని రకాల గాడ్జెట్స్‌కి సపోర్ట్ చేస్తుంది. అంతేకాదు.. దీనికి మల్టీ ఫంక్షనల్ ఎల్ఈడీ ఫ్లాష్‌లైట్ కూడా ఉంటుంది. హైక్వాలిటీ ప్రీమియం పాలిమర్ బ్యాటరీని వాడారు. దీన్ని పవర్ అడాప్టర్‌తో కూడా చార్జ్ చేయొచ్చు. ఫుల్ చార్జ్ కావడానికి 5 గంటల టైం పడుతుంది.

**ధర : 1999**

### అవుట్‌డోర్ లైట్

పవర్ సప్లై చేయడం కుదరని ప్లేస్‌ల్లో ఈ లైట్లు బాగా ఉపయోగపడతాయి. ఇవి సోలార్ పవర్‌తో వెలుగుతాయి. వీటిని వర్నిత్యా అనే కంపెనీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఎండ ఎక్కువగా ఉంటే 45 గంటల్లో ఫుల్ చార్జ్ అవుతుంది. తక్కువగా ఉంటే చార్జింగ్ టైం ఇంకాస్త పెరుగుతుంది. దీనికి స్విచ్ కూడా ఉండదు. సూర్యాస్తమయం తర్వాత దానంతటదే ఆన్ అవుతుంది. తెల్లవారుజామున ఆఫ్ అవుతుంది. వీటిని ముఖ్యంగా గార్డెన్, కాంపౌండ్ వాల్, స్టెయిర్స్, బాల్కనీ, బ్యాక్‌యార్డ్, గ్యారేజ్ లాంటి ప్రదేశాల్లో వాడుకోవచ్చు. ఈ లైట్లను ఎక్కడైనా ఈజీగా ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. రెండు స్క్రూలను బిగిస్తే సరిపోతుంది. వర్షపు చినుకులు, మంచు పడినా తట్టుకుంటుంది. ఇది ఫుల్ చార్జ్ కావడానికి 6 నుంచి 8 గంటల టైం పడుతుంది. ధర: నాలుగింటికి రూ. 379

### సోలార్ కెమెరా

నిర్మాణ స్థలాలు, పొలాలు లాంటివాటి దగ్గర కూడా అప్పుడప్పుడు దొంగతనాలు జరుగుతుంటాయి. అందుకే దొంగల భయం ఉన్న ప్లేస్‌ల్లో ఇలాంటి కెమెరాని బిగించుకుంటే సరిపోతుంది. దీన్ని యాక్టివ్ పిక్సెల్ అనే కంపెనీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఇది సోలార్ పవర్‌తో 24/7 పనిచేస్తుంది. ప్రత్యేకంగా చార్జ్ చేయాల్సిన అవసరం లేదు. ఇది హై కెపాసిటీ సోలార్ ప్యానెల్, రీచార్జబుల్ బ్యాటరీతో వస్తుంది. 4ఎంపీ అల్ట్రా హెచ్‌డీ కెమెరా ఉంటుంది. నైట్ విజన్‌కు కూడా సపోర్ట్ చేస్తుంది.ఇన్‌బిల్ట్‌గా పీఐఆర్ సెన్సర్‌తో రావడం వల్ల మానవ కదలికలను గుర్తించి, వెంటనే స్మార్ట్‌ఫోన్‌కు అలెర్ట్స్ పంపుతుంది. కాకపోతే డేటా ట్రాన్స్‌ఫర్, అలర్ట్స్ కోసం ఇందులో సిమ్‌కార్డ్ వేయాల్సి ఉంటుంది. ఇది 4జీ నెట్‌వర్క్‌కి సపోర్ట్ చేస్తుంది. మైక్రోఫోన్, స్పీకర్ కూడా ఉంటాయి. వాటి వల్ల కెమెరా దగ్గర ఉన్నవాళ్లతో స్మార్ట్ ఫోన్‌లోని యాప్ ద్వారా మాట్లాడొచ్చు. ఇది ఐపీ 65 వాటర్‌ప్రూఫ్ డిజైన్‌తో రావడం వల్ల వర్షం, దుమ్ము, వేడిని తట్టుకోగలదు. ఎస్డీ కార్డ్‌కు కూడా సపోర్ట్ చేస్తుంది.ధర: రూ. 4,499

## పెళ్లయ్యాక అమ్మా నాన్నలతో అపార్థాలు.. నాపై నిందలు.. ఈ మధ్యనే ఎందుకిలా?



**హైదరాబాద్ పెన్ పవర్:** గతేడాది జూన్‌లో నాకు పెళ్లైంది. మా దంపతుల మధ్య సాన్నిహిత్యం బాగానే ఉంది గానీ.. ఇంట్లో అమ్మ, నాన్నతో అపార్థాలు ఎక్కువయ్యాయి. లేనిపోని నిందలు నాపై పడుతున్నాయి. నాలుగేళ్లుగా నేను సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధిస్తూ మంగళవారాలు నియమంగా చేస్తున్నా. వ్యాపారంలోనూ నష్టాలొస్తున్నాయి.. కొత్త బిజినెస్ చేద్దామంటే సరిగా డబ్బు చేతికి అందక మానసికంగా ఇబ్బంది పడుతున్నా. ఇదంతా ఈ మధ్యనే ఎందుకో తెలియచేయగలరు. – శివ మీ జాతకంలో ప్రస్తుతం బుధ – చంద్ర దశ నడుస్తోంది. ఈ మధ్య కాలంలో ఆర్థిక ఒత్తిడి, కుటుంబంలో అపార్థాలు, లేనిపోని నిందలు, వ్యాపార నష్టం, మానసిక వేదన పెరగడానికి ప్రధాన కారణం 'కాల ప్రభావమే'. ఇది మీరు చేసిన తప్పుల వల్ల మాత్రమే వచ్చిన పరిస్థితి కాదు. బుధ – చంద్ర దశలో మనసు చాలా సున్నితంగా ఉంటుంది. చిన్న విషయాలకే ఎక్కువగా బాధపడే స్వభావం వస్తుంది. కుటుంబ సభ్యులతో మాటల తేడాలు, అపార్థాలు సులభంగా ఏర్పడతాయి. నిందలు పడినట్టు, ఎవరు అర్థం చేసుకోవడం లేదన్న భావన కలుగుతుంది. ఇవన్నీ ఈ దశలో సాధారణంగా కనిపించే పరిస్థితులే.

వ్యాపార విషయాల్లో గోచారంలో అష్టమ గురువు ప్రభావం ఉండటం వల్ల డబ్బు చేతిలో నిలవకపోవడం, నమ్మించి మోసం చేసే వ్యక్తులు ఎదురవ్వడం, చేసిన పెట్టుబడులు ఫలించకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొన్నారు. అందుకే రూ.3 లక్షల వరకు నష్టం జరిగింది. ఈ కాలంలో కొత్త బిజినెస్ మొదలుపెట్టినా డబ్బు సరిగా చేతికి అందడంలేదు. ఈ పరిస్థితి శాశ్వతం కాదు. ఈ దశ "పరీక్షించే కాలం" మాత్రమే. ముఖ్యంగా వ్యాపారంలో ఎవరి మాటలనూ వెంటనే నమ్మొద్దు. మొహమాటం పనికిరాదు. లెక్కలు, ఒప్పందాలు, డబ్బు లావాదేవీల్లో చాలా స్పష్టత అవసరం. మీరు నాలుగేళ్లుగా సుబ్రహ్మణ్యస్వామిని భక్తితో ఆరాధించడం చాలా మంచి విషయం. అది మీకు రక్షణగా ఉంది. దాంపత్య జీవితాన్ని నిలబెట్టినదీ అదే దైవబలమే. బుధ మహాదశ సాధారణంగా ధనం, జ్ఞానం, ఎదుగుదల ఇచ్చే దశ. చంద్ర అంతర్దశలో కొంత మానసిక ఒత్తిడి, అస్థిరత ఉన్నా.. ఇదే దశలో ధార్మికత పెరుగుతుంది. దేవుడిపై నమ్మకం బలపడుతుంది. ఓర్పు, సహనం పెరిగితే పరిస్థితులు క్రమంగా మారతాయి. వ్యాపారంలో కొత్త పెట్టుబడుల విషయంలో జాగ్రత్త వహించండి. ఎవరి మాటలపైనా పూర్తిగా ఆధారపడకుండా మీ నిర్ణయాలు మీరే తీసుకోవాలి. గురుశ్లోకం లేదా గురు ధ్యానం, లక్ష్మీ ధ్యానం నిత్యం చేయండి. ఇది మీ ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తుంది. మాట్లాడేటప్పుడు కుటుంబంలో శాంతిగా, మౌనాన్ని ఎక్కువగా పాటించండి. కాలమే అపార్థాలను తగ్గిస్తుంది. మొత్తం మీద ఈ కాలం మిమ్మల్ని జాగ్రత్తగా ఆలోచించేలా, భవిష్యత్తులో బలంగా నిలబడేలా చేస్తున్న దశ. దాంపత్య బలం అనుకూలంగా ఉంది. ఆర్థిక ఒత్తిడి కూడా క్రమంగా తగ్గే సూచనలు ఉన్నాయి. ఓర్పు, ధైర్యం పెట్టుకుంటే ఈ దశ దాటాక పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

# ఒక వీడియో బాగా వైరల్.. 34 నెలల్లోనే మిలియన్ వ్యూస్.. కూతురితో కలిసి సాధించింది !



**హైదరాబాద్ పెన్ పవర్:** చదువు పూర్తికాకముందే పెండ్లి జరిగింది. ఆ తర్వాత కుటుంబమే ఆమె ప్రపంచం అయ్యింది. కానీ.. గీతా గుర్జర్ తను ఒక సాధారణ గృహిణిలా మిగిలిపోకూడదు అనుకుంది. జీవితంలో ఏదైనా సాధించాలనే బలమైన కోరికతో సోషల్ మీడియాలో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. కూతురితో కలిసి వీడియోలు చేసింది. కష్టపడి ఎడిటింగ్ నేర్చుకుంది. ఇప్పుడు తన క్రియేటి విటీతో నాలుగు కోట్ల మంది అభిమానాన్ని సంపాదించుకుంది. ఇండియాలోని టాప్ సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల లిస్ట్‌లో స్థానం దక్కించుకుంది.

గీ తా గుర్జర్ ఉత్తరప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతంలో పుట్టింది. తన ట్విన్ సిస్టర్‌తో కలిసి పెరిగింది. నాన్న ఉత్తరప్రదేశ్‌లోనే ఆర్మీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడవాళ్లకు సరైన విద్య అందుబాటులో లేని టైంలోనే గీత ఎమ్మెస్సీ పూర్తి చేసింది. ఆ తర్వాత బీఈడీ చేయాలి అనుకుంది. కానీ.. తల్లిదండ్రులు పెండ్లి చేశారు. అయినా.. వెనకడుగు వేయకుండా అత్తగారింటి నుంచి కాలేజీకి వెళ్తూ బీఎడ్ పూర్తి చేసింది. కొన్నాళ్లు గవర్నమెంట్ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేసింది. కానీ.. ప్రయోజనం లేకపోవడంతో తన దిశను మార్చుకుని సోషల్ మీడియాలో అడుగుపెట్టింది.

### వద్దన్నా వినకుండా..

గీత మొదటగా తన కూతురు అమైరా పేరుతో యూట్యూబ్ చానెల్ పెట్టింది. అప్పుడు కుటుంబసభ్యులు అమైరా వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడాన్ని వ్యతిరేకించారు. ఆమె భర్త మాత్రమే సపోర్ట్ చేశాడు. ఆ చానెల్‌లో వీడియోలకు వ్యూస్ కూడా చాలా తక్కువగా వచ్చేవి. అప్పటివరకు గీతకు ఎడిటింగ్ చేయడం పెద్దగా తెలియదు. అందుకే సక్సెస్ కాలేకపోయింది.

దాంతో అనుభవం వచ్చాక 2021 జనవరి 26న "ది గీతా గుర్జర్" పేరుతో రెండో చానెల్ పెట్టింది. అందులో గ్రీన్ స్క్రీన్ ఎఫెక్ట్స్‌తో షార్ట్ వీడియోలు చేయడం మొదలుపెట్టింది. కానీ.. ఈ చానెల్‌కు కూడా మొదట్లో పెద్దగా వ్యూస్ రాలేదు. అయినా రెగ్యులర్‌గా వీడియోలు చేసేది. కొన్నాళ్లకు ఒక వీడియో బాగా వైరల్ అయ్యింది. దానికి 34 నెలల్లోనే మిలియన్ వ్యూస్ వచ్చాయి. అప్పటినుంచి గీతకు వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే రాలేదు.

### రెండేండ్లలో..

గీత చానెల్ పెట్టిన మొదటి రెండేండ్లలో చానెల్‌ను 7 మిలియన్ల మంది సబ్‌స్క్రయిబ్ చేసుకున్నారు. కానీ.. ఆ తర్వాత మూడేండ్లలో అంటే ఇప్పుడు ఆ సంఖ్య 40.3 మిలియన్లకు చేరింది. అంతేకాదు.. 2024 మొదటి మూడు నెలల్లో మోస్ట్ వ్యూడ్ ఇండియన్ యూట్యూబ్ చానెల్స్‌లో 3వ స్థానం సాధించింది. ప్రస్తుతం నెలకు దాదాపు 530 మిలియన్ వ్యూస్ వస్తున్నాయి. దాంతో గీత బ్రాండ్ కొలాబరేషన్లు, ప్రమోషన్స్ చేస్తూ ప్రతి నెలా లక్షల్లో సంపాదిస్తోంది.గీత చేసే కంటెంట్‌లో ఎక్కువగా ఫ్యామిలీ వ్లాగ్స్, బ్యూటీ టిప్స్, కామెడీ స్కిట్స్, ట్రావెల్, ట్రెండింగ్ టాపిక్‌లే ఉంటాయి. అందుకే వీడియోలు

అన్ని వర్గాల వాళ్లను ఆకట్టుకుంటున్నాయి. చానెల్‌లో ప్రస్తుతం బిలియన్ వ్యూస్ దాటిన వీడియోలు కూడా ఉన్నాయి. ఇక వంద మిలియన్ల వ్యూస్ సాధించిన వీడియోలైతే బోలెడు ఉన్నాయి. ఇప్పటివరకు చానెల్‌లో 3,700 వీడియోలు అప్‌లోడ్ చేసింది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా లక్షకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఫేస్‌బుక్ పేజీని నాలుగు లక్షలమందికి పైగా ఫాలో అవుతున్నారు.

### ఎన్నో సవాళ్లు

చానెల్ పెట్టిన తొలి రోజుల్లో గీత ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముఖ్యంగా ఎడిటింగ్ నేర్చుకోవడానికి చాలా ఇబ్బంది పడింది. మొదట్లో వీడియోలు చేయడంలో ఏవైనా తప్పులు దొర్లితే సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తారనే భయం ఉండేది. అందుకే రోజుకు 12 గంటలపాటు కష్టపడి షూటింగ్, ఎడిటింగ్ చేసేది.

# సోలార్ ప్యానెల్స్ బిగించుకునేందుకు సరిపడా ప్లేస్ లేదా.. ఈ కరెంట్ ఇచ్చే చెట్లు ట్రై చేయండి !



**హైదరాబాద్ పెన్ పవర్:** సోలార్ పవర్ వల్ల ఖర్చు తగ్గుతుంది. పర్యావరణానికి మేలు కలుగుతుంది... అయినా సోలార్ ప్యానెల్స్‌ని బిగించుకునేందుకు సరిపడా ప్లేస్ లేక చాలామంది వెనకడుగు వేస్తున్నారు. అలాంటివాళ్ల కోసమే. గుజరాత్‌కు చెందిన ఇంజనీర్ శని పాండ్య సోలార్ చెట్లను తయారుచేశాడు. వీటిని రెండు అడుగుల ప్లేస్‌లో కూడా బిగించుకోవచ్చు. అంతేకాదు.. బాల్కనీల్లో, రూఫ్ మీద వేసుకునేందుకు ప్రత్యేకంగా ప్లాస్టిక్ వేస్ట్‌తో టైల్స్ తయారుచేశాడు. అవి కూడా ఎండ పడితే కరెంట్‌ని ఉత్పత్తి చేస్తాయి. ఈ ఆవిష్కరణలు ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కూడా అందుకున్నాయి.

గుజరాత్‌కు చెందిన శని పాండ్య పండిట్ దీన్‌దయాల్ ఎనర్జీ యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్ చదివాడు. ఆ తర్వాత అదే యూనివర్సిటీ ఇన్‌క్యుబేటర్‌లో చేరి, సోలార్ పవర్ మీద రీసెర్చ్ చేశాడు. అప్పుడే అతను సాధారణ సోలార్ ప్యానెల్స్ బిగించుకోవడానికి ప్లేస్ చాలా ఎక్కువగా అవసరం అవుతుందని, పైగా ఆ స్థలాన్ని 30 ఏళ్ల పాటు ఇతర అవసరాలకు వాడడం కుదరదని తెలుసుకున్నాడు.

అందుకే ప్లేస్ తక్కువగా ఉండే పెద్ద పెద్ద నగరాల్లో ప్రజలు సోలార్ ఎనర్జీపై ఆసక్తి చూపించడం లేదని గమనించాడు. "ఒకచోట ఆరెకరాల భూమిలో కేవలం ఒక మెగావాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ను ఇన్‌స్టాల్ చేయడం చూశా. ఈ సమస్యకు ఎలాగైనా పరిష్కారం కనిపెట్టాలని నిర్ణయించుకున్నా. ఆ లక్ష్యంతోనే స్టార్టప్ ప్రయాణాన్ని మొదలుపెట్టా' అన్నాడు శని.

### ఇమాజిన్ పవర్‌ట్రీ

శని 2018లో ఇమాజిన్ పవర్‌ట్రీ పేరుతో స్టార్టప్ పెట్టాడు. దానిద్వారా 'సోలార్ ట్రీ'ని మార్కెట్‌లోకి తీసుకొచ్చాడు. ఇది ఒకే స్తంభంపై 45 సోలార్ మాడ్యూల్స్‌ని బ్యాలెన్స్ చేయగలదు. సింపుల్‌గా చెప్పాలంటే ఒక చెట్టు లాంటి ఆకారంలో ఉన్న సోలార్ ప్యానెల్ అన్నమాట. దీనిద్వారా రోజుకు 20 కిలోవాట్ల వరకు పవర్ ఉత్పత్తి అవుతుంది. దాంతో దాదాపు ఆరు ఇళ్లకు పవర్‌ని సప్లై చేయొచ్చు. దీని వల్ల భూమి అవసరం 2,200 చదరపు అడుగుల నుంచి కేవలం 2 చదరపు అడుగులకు తగ్గింది.

"ఈ చెట్లు ప్రతిరోజూ పవర్‌ని అందించగలవు. ఇలాంటి సోలార్ ట్రీస్‌ని ఇప్పటికే అమెరికాలో ఉపయోగిస్తున్నారు. కానీ, వాటిని సుందరీకరణ, వైఫై, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు.. ఇలా చిన్న చిన్న అవసరాలకు మాత్రమే వాడుతున్నారు. మన దగ్గర సిటీల్లో సోలార్ సిస్టమ్ బిగించుకోవాలి అనుకునేవాళ్లకు ఇది బెస్ట్ చాయిస్" అంటున్నాడు శని.

### గాంధీనగర్‌శ్రీలో..

శని మొదటగా ఈ సోలార్‌ట్రీ ఇన్‌స్టాలేషన్స్‌ని గాంధీనగర్‌లో మొదలుపెట్టాడు. అక్కడి అధికారులు గాంధీనగర్‌లో "స్మార్ట్ సిటీ మిషన్" మొదలుపెట్టారు. అందులో భాగంగా సిటీలో వాడే కరెంట్‌లో కనీసం 10 శాతం సోలార్ ద్వారా ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకున్నారు. అది తెలుసుకున్న శని సిటీ ప్లానర్లతో మాట్లాడి స్ట్రీట్ లైట్ల ఖర్చు తగ్గించేందుకు సోలార్ లైట్లను బిగించాడు. ఆ అనుభవం శనికి మరిన్ని సిటీలకు బిజినెస్‌ని విస్తరించడానికి సాయపడింది. ముంబై నుంచి జమ్మూ వరకు ఉన్న ఎన్నో నగరాల్లో ఇప్పటివరకు 150కి పైగా సోలార్ చెట్లు నాటాడు శని.సోలార్ టైల్స్

శని సోలార్ ట్రీ తర్వాత సోలార్ టైల్స్‌ని అందుబాటులోకి తీసుకొచ్చాడు. ఒక టైల్‌కు 20-వాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంటుంది. 150 టైల్స్‌తో ఒక ఇంటికి కావాల్సినంత కరెంట్‌ని ఉత్పత్తి చేయొచ్చు. వీటిని రూఫ్‌పై, గోడలు, బాల్కనీలు, ఫసేడ్‌లు, రోడ్లపై కూడా వేసుకోవచ్చు. ఈ టైల్స్ ఎలాంటి వాతావరణాన్ని అయినా తట్టుకోగలవు. ఒక్క టైల్ ధర రూ. 1,200 మాత్రమే."మేము గుజరాత్‌లో జనవరిలో గాలిపటాల పండుగ చేసుకుంటాం. ఆకాశమంతా రంగురంగుల గాలిపటాలతో నిండిపోతుంది. గుజరాతీలు సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్‌లను ఇష్టపడకపోవడానికి ఇది కూడా ఒక కారణం. ఎందుకంటే సాధారణ సోలార్ ప్యానెల్స్ బిగించుకుంటే పైకప్పు పూర్తిగా నిండిపోతుంది. కానీ.. మా టైల్స్ వల్ల ఎలాంటి సమస్య ఉండదు. వాటిపై నడవొచ్చు" అని చెప్పొకొచ్చాడు శని. పైగా ఈ టైల్స్‌ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వేస్ట్‌తో తయారుచేశారు. వీటి వల్ల ప్లాస్టిక్‌ని రీయూజ్ చేసినట్టు అవుతుంది. ఎన్నో సవాళ్లుశని స్టార్టప్ పెట్టిన మొదట్లో ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముఖ్యంగా పెట్టుబడి కోసం తన ఇంటిని మార్ట్‌గేజ్ చేసి లోన్ తీసుకున్నాడు. అప్పటివరకు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసిన డబ్బుని విత్‌డ్రా చేశాడు. ఇంకా కొంత డబ్బుని తెలిసినవాళ్ల దగ్గర అప్పుగా తీసుకున్నాడు. కానీ.. ఇప్పుడు మాత్రం ప్రతియేటా కోట్లలో సంపాదిస్తున్నాడు. 2024లో రూ. 7 కోట్లు, 2025లో సుమారు రూ. 13 కోట్ల ఆదాయం వచ్చింది. అంతేకాదు.. శనికి జాతీయ స్థాయిలో గుర్తింపు కూడా దక్కింది.

"మా ఆవిష్కరణను ప్రధాని మోదీ కూడా ప్రశంసించారు. అది మా టీమ్‌కి మర్చిపోలేని క్షణం. ప్రధానమంత్రితో నన్ను చూసినప్పుడు మా ఫ్యామిలీ కళ్లలో నీళ్లు తిరిగాయి" అని తన జర్నీని పంచుకున్నాడు. శని 2025లో రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ ఎల్ఐటీ అడ్వాన్స్ అవార్డ్ గెలుచుకున్నాడు. ఇమాజిన్ పవర్‌ట్రీ 2025లో బెస్ట్ ఇండియన్ స్టార్టప్స్‌లో ఒకటిగా ఎంపికైంది.

## ఈ యాప్‌ఎతో రూట్లన్నీ ట్రాక్ చేయొచ్చు.. ఏ బస్ ఎక్కాలో.. మెట్రో ఎక్కడ మారాలో కూడా చెప్పేస్తుంది !




**హైదరాబాద్ పెన్ పవర్:** మన దేశ మ్యాపింగ్ సర్వీస్ మ్యాప్ మై ఇండియా తన యూజర్ల కోసం ఒక భారీ అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పటివరకు కేవలం వ్యక్తిగత వాహనాల నావిగేషన్ కోసం ఎక్కువగా ఉపయోగపడే ఈ యాప్, ఇకపై మెట్రో, బస్‌లు, రైళ్ల సమాచారం కోసం వాడొచ్చు. యూజర్లు తమ డెస్టినేషన్‌కి చేరుకోవడానికి బస్‌లు, మెట్రోలు, లోకల్ రైళ్ల రూట్లను ఈ యాప్ ద్వారా ట్రాక్ చేయొచ్చు. ఏ బస్ ఎక్కాలి? మెట్రో ఎక్కడ మారాలి? ఏ ప్లాట్‌ఫామ్ మీదికి రావాలి? వంటి వివరాల మ్యాప్స్‌ను అందిస్తుంది. రైళ్లు లేదా బస్‌లు ఏ టైంకి వస్తాయో, జర్నీకి ఎంత టైం పడుతుందో చూపిస్తుంది.

ఈ కొత్త ఫీచర్ మనదేశంలో హైదరాబాద్ సహా 18 సిటీల్లో అందుబాటులోకి వచ్చింది. సొంత వెహికల్స్ కంటే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఎంకరేజ్ చేయడమే ఈ అప్‌డేట్ వెనక ఉన్న ముఖ్య ఉద్దేశం అని కంపెనీ సీఈవో రోహన్ తెలిపారు. మ్యాప్‌ల్స్ యాప్‌లో ఇప్పటికే కొన్ని ప్రత్యేకమైన ఫీచర్లు ఉన్నాయి. ఇవి గూగుల్ మ్యాప్స్‌లో కూడా ఉండవు. త్రీడి జంక్షన్ వ్యూ.. క్లిష్టమైన ఫ్లై ఓవర్లు, జంక్షన్ల దగ్గర ఏ వైపు మళ్లాలో చూపిస్తుంది. స్పీడ్ బ్రేకర్లు లేదా ప్రమాదకరమైన మలుపులు ఉంటే ముందే వార్నింగ్ ఇస్తుంది. మహిళలు, ఒంటరి ప్రయాణికులు తమ లైవ్ లొకేషన్‌ను ఫ్యామిలీతో షేర్ చేసుకోవచ్చు. ప్రస్తుతానికి ఈ అప్‌డేట్ ఐఫోన్, వెబ్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను అప్‌డేట్ చేయడం ద్వారా ఈ కొత్త ఫీచర్లను పొందొచ్చు. ఆండ్రాయిడ్ యూజర్లకు కూడా త్వరలోనే ఈ అప్‌డేట్ రానుంది.

### వాట్సాప్ చానెల్‌లో క్విజ్!

వాట్సాప్ చానెల్స్ వాడే వారి కోసం కొత్త ఫీచర్‌ను తీసుకురానుంది. చానెల్స్‌లో ఉండే సభ్యుల కోసం క్విజ్ నిర్వహించేలా ఈ ఫీచర్‌ను డిజైన్ చేశారు. ఇందులో చానెల్ అడ్మిన్ ఒక ప్రశ్నను ఎంటర్ చేసి మల్టిపుల్ ఆప్షన్స్‌ను పెట్టడం ద్వారా క్విజ్‌ను క్రియేట్ చేయొచ్చు. అడ్మిన్స్ క్విజ్‌ను పబ్లిష్ చేసేముందు సరైన ఆప్షన్‌ని ఆన్సర్‌గా గుర్తించాలి. ఆ తర్వాత ఆన్సర్‌కు ఇమేజెస్ ట్యాగ్ చేయొచ్చు. క్విజ్‌లను ఇమేజ్ కంటెంట్, టెక్స్ట్ ప్రాంప్ట్‌లు లేదా బ్రాండ్‌లు ఎంగేజ్ చేస్తాయి.

క్విజ్ లైవ్‌లో నిర్వహిస్తే ఫాలోవర్లు, మెంబర్స్ ఆన్సర్‌ని సెలక్ట్ చేయొచ్చు. కరెక్ట్ ఆన్సర్ ఎంచుకున్నవాళ్లకు కన్ఫెట్టి యానిమేషన్‌తో గిఫ్ట్ వస్తుంది. ప్రతి ఆప్షన్‌ని ఎంతమంది సెలక్ట్ చేసుకున్నారు వంటివి చానెల్స్ ఓనర్‌లు చూడొచ్చు. ఈ క్విజ్‌ల వల్ల పబ్లిక్ అవేర్‌నెస్ లేదా ఇంట్రెస్ట్ అంచనా వేయొచ్చు. అంతేకాదు, అడ్మిన ఈ క్విజ్‌లో పార్టిసిపేట్ చేసేవారిని సేవ్ చేసుకోకపోతే లిమిటెడ్ ఇన్ఫర్మేషన్ మాత్రమే కనిపిస్తుంది. పర్సనల్ ప్రైవసీ సెట్టింగ్స్‌ను బట్టి అడ్మిన్‌లు ప్రొఫైల్ ఫొటోను మాత్రమే చూడగలరు. పేర్లు, నెంబర్లు సీక్రెట్‌గా ఉంటాయి. ప్రస్తుతానికి ఈ ఫీచర్ టెస్టింగ్ దశలో ఉంది.

# ఎముకలకు పుష్టినిచ్చే కూరగాయలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** చలికాలంలో ఒక్కోసారి ఎముకలు, కీళ్ళు తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. ముఖ్యంగా అరవై ఏళ్లు పైబడిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే నేటి కాలంలో యువత కూడా కీళ్ల నొప్పులతో సతమతం అవుతున్నారు. దీనికి అతిపెద్ద కారణం కాల్షియం లోపం. అందుకు కారణం ప్రోటీన్ కు ఇచ్చిన ప్రాముఖ్యత కాల్షియంకు ఇవ్వకపోవడమే. నేటి జీవనశైలి కారణంగా ఉదయం ఎండలో నడిచేవారే కరువయ్యారు. దీంతో శరీరంలో విటమిన్ డి లోపం తలెత్తుతుంది. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఎముకలు పెళుసుగా మారుతాయి. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉండేవారికి ఈ కింది కూరగాయల ద్వారా పుష్కలంగా కాల్షియం అందుతుంది. నువ్వులలో ఆరు రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో వీటిని సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. 100 గ్రాముల నువ్వులలో దాదాపు 975 గ్రాముల కాల్షియం లభిస్తుంది. నువ్వుల లడ్డులు, చట్నీలు, సలాడ్లలో కలిపి తినవచ్చు. శీతాకాలంలో క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. నువ్వులు చిన్నగా కనిపించినప్పటికీ వాటిని కాల్షియం సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. శీతాకాలంలో లభించే ఆకుకూరల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. పాలకూర, మెంతులు, పాలకూరలో కాల్షియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరుస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. కిడ్నీ బీన్స్, చిక్‌పీస్‌లో కూడా కాల్షియం అధికంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. ఒక కప్పు ఉడికించిన శనగల్లో 80 నుండి 100 గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది ప్రోటీన్, ఫైబర్, ఐరన్‌ను కూడా అందిస్తుంది. చల్లని చిక్‌పీస్, కిడ్నీ బీన్స్‌తో తయారు చేసిన వంటకాలు ఎముకలకు బలం చేకూరుస్తాయి. ఎండిన అంజీర్ పండ్లలో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు బలంగా ఉంటాయి. రోజుకు 4 నుండి 5 ఎండిన అంజీర్ పండ్లను తినడం వల్ల శరీర కాల్షియం అవసరాన్ని సులభంగా తీరుస్తుంది. అంజీర్ పండ్లు మలబద్ధకం సమస్యను కూడా తగ్గిస్తాయి. రక్తాన్ని పెంచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. జున్ను, పాలు లేకుండా కూడా శరీరం కాల్షియం పొందగలదు. అందుకు మీ ఆహారంలో సోయాబీన్స్, టోఫు, సోయా మిల్క్ చేర్చుకుంటే సరిపోతుంది. సోయాబీన్స్‌లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల టోఫులో దాదాపు 350 గ్రాముల కాల్షియం ఉంటుంది. పాలు తాగడానికి ఇష్టపడని వారు, లాక్టోస్ అసహనం ఉన్నవారికి ఇది చాలా మంచిది. జీడిపప్పు, వాల్‌నట్‌లతో పాటు డ్రై ఫ్రూట్స్‌లో బాదం ఒకటి. కానీ బాదం శరీరంలో కాల్షియం పనితీరును నెరవేరుస్తుందని చాలా మందికి తెలియదు. బాదం మెదడుతో పాటు ఎముకలకు

కూడా మంచిది. 100 గ్రాముల బాదంలో 260 మి.గ్రా కాల్షియం ఉంటుంది. చల్లని వాతావరణంలో రోజూ 5 నుంచి 7 బాదం పలుకులు నానబెట్టి తినడం వల్ల చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల రాగులు మూడు గ్లాసుల పాలలో ఉన్నంత శక్తిని కలిగి ఉంటాయి. ఎందుకంటే కేవలం 100 గ్రాముల రాగులు శరీరానికి 350 గ్రాముల కాల్షియం అందుతుంది. పిల్లలు నుంచి మహిళలు, సీనియర్ సిటిజన్లకు అందరికీ రాగులు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

# జీవితంలో ఎదగాలనుకుంటున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** చేస్తున్న పనిలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అది అందుకు తగిన విషయాలపై దృష్టి సారిస్తేనే సాధ్యమవుతుంది. అయితే, చాలా మంది చాలా కాలంపాటు శ్రమించినప్పటికీ ఆశించినంత ఎదుగుదల ఉండదు. కొందరు మాత్రం తమ జీవితంలో ఉన్నతస్థాలను తక్కువ సమయంలోనే చేరుకుంటారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికే ప్రయత్నిస్తుంటారు. ఉద్యోగం, వృత్తి, వ్యాపారం చేసేది ఏదైనా అందులో ఎదగాలని తమ ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంటారు. అయితే, చాలా మంది చాలా కాలంపాటు శ్రమించినప్పటికీ ఆశించినంత ఎదుగుదల ఉండదు. కొందరు మాత్రం తమ జీవితంలో ఉన్నతస్థాలను తక్కువ సమయంలోనే చేరుకుంటారు. రు చేసే పనిని మొదట ప్రేమించడం అలవర్చుకోండి. అందులో ప్రత్యేకతను చూపండి. తోపాటు చాలా మంది ఉన్నప్పటికీ ప్రత్యేకతను చాటుకోండి. ఇది మిమ్మల్ని అందరిలో ముఖ్యమైన వ్యక్తిగా నిలబెడుతుంది.

విజయగాథల నుంచి నేర్చుకోవడం కంటే రంగంలో వైఫల్య కథలను కనుగొని చదవండి. ఎందుకంటే, వైఫల్య కథల నుంచి నిజమైన పాఠాలు నేర్చుకుంటారు. ఎందుకు విఫలమయ్యామో తెలుసుకుంటే.. రు ఆ పొరపాట్లు చేయకుండా విజయ తీరాలకు చేరుతారు. లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా సరైన కార్యాచరణ ప్రణాళికతో పనిచేయడం వల్ల రు లక్ష్యాన్ని మరింత సులభంగా సాధించవచ్చు. రు సాధించాలని కలలు కంటున్న దానిపైనే పూర్తి దృష్టి సారిస్తే రు విజయం సాధిస్తారు. కలల్లో తేలుతూ ఉండటం కంటే నిజమైన జీవితంలో ఉన్న సమస్యలను మనం గ్రహించి వాటిపై తగిన స్పందించాలి. రు చదివిన పుస్తకాల నుంచి, వ్యక్తిగత, వృత్తి జీవితంలో పొందిన అనుభవాల నుంచి కొత్త విషయాలను నేర్చుకోవాలి. సమస్యలు ప్రతిచోటా ఉంటాయి కాబట్టి.. ఒత్తిడికి గురికాకుండా అక్కడివారిని అర్థం చేసుకోవడం, వారితో సంభాషించడం ద్వారా పురోగతిని సాధించవచ్చు. ప్రణాళికలకు సంబంధించిన విషయాలను కొన్నింటిని రహస్యంగా ఉంచాలి. తద్వారా ఇతరుల నుంచి రు గౌరవం పొందుతారు. రు చేస్తున్న ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలి. సాధన చేయాలి. అనేక ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు తెలుసుకుంటూ ఇతరుల కంటే ఎక్కువ నేర్చుకుంటూ ఉండాలి. వ్యక్తిగత క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యం. ఇది మొత్తం అభివృద్ధిని నిర్ణయిస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ నైతిక నియమాలను వదిలిపెట్టొద్దు. కు తెలిసిన వాటిని ఇతరులకు నేర్పించడం ద్వారా రు కూడా కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. రు చేపట్టిన ఏ పనినైనా 100శాతం కృషి చేస్తే పురోగతి సాధించడం సులభమవుతుంది. అదే సమయంలో తప్పు దిశలో వెళుతున్నామని తెలిస్తే వెనుకాడకుండా వెంటనే తిరిగి సరైన మార్గంలో వెళ్లడం ప్రారంభించాలి. ఇందుకు వెనకాడకూడదు.

రంగంలోని గొప్పవారిని కలవడం, వారితో సమయం గడపడం ద్వారా వారి నుంచి రు స్ఫూర్తి పొందుతారు. ప్రతి ఉదయం డబ్బు, సమయాన్ని వృథా చేయకుండా ఉండేందుకు ప్రణాళికలు వేసుకోవాలి. శారీరక, మానసిక ఆరోగ్యం అనేది మన ఎదుగుదలలో కీలకం కాబట్టి వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. మనస్సుకు, శరీరానికి కాసేపు విశ్రాంతినిచ్చే అవకాశాన్ని పరిశీలించాలి. వీటన్నిటినీ క్రమం తప్పకుండా చేయడం వల్ల రు చేస్తున్న ఉద్యోగం లేదా వృత్తి, వ్యాపారం ఇలా ఏ రంగంలోనైనా పురోగతి సాధిస్తారనడంలో సందేహం లేదు.

# భారతీయులు ఆహారాన్ని వృధా చేస్తున్నారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఉన్నా, టన్నుల కొద్దీ ఆహారం వృధా అవుతోంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటున ఒక వ్యక్తి ఏటా 79 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నాడు. ఈ వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయి. రీసైక్లింగ్, అవగాహనతో వృధాను అరికట్టడం, స్థిరమైన భవిష్యత్తుకు కీలకం. ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత ఒకవైపు వేధిస్తుంటే, మరోవైపు టన్నుల కొద్దీ ఆహారం చెత్తబుట్టల పాలవుతోంది. తాజాగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం విడుదల చేసిన ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ నివేదికలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ఒక వ్యక్తి సగటున ఏడాదికి 79 కిలోల ఆహారాన్ని వృధా చేస్తుండగా భారతీయులు కూడా ఈ విషయంలో తక్కువే కాదని నివేదిక స్పష్టం చేసింది. భారతదేశంలో సగటున ఒక వ్యక్తి ఏడాదికి 55 కిలోల ఆహార వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నాడు. ఇందులో మనం వండుకున్నాక మిగిలిపోయిన ఆహారం, కూరగాయల తొక్కలు, పాడైపోయిన పండ్లు వంటివి ఉన్నాయి. మన దేశ జనాభా దృష్ట్యా చూస్తే, ఇది పర్యావరణంపై ఎంతటి భారాన్ని మోపుతుందో అర్థం చేసుకోవచ్చు. అత్యధిక వ్యర్థాలు: మాల్దీవులు అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ఒక్కో వ్యక్తి ఏడాదికి ఏకంగా 207 కిలోల ఆహారాన్ని వృధా చేస్తున్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో ఈజిప్ట్ (163 కిలోలు), ఇరాక్ (143 కిలోలు), పాకిస్తాన్ (130 కిలోలు) ఉన్నాయి. అత్యల్ప వ్యర్థాలు: ఈ జాబితాలో రష్యా ఆదర్శంగా నిలుస్తోంది. రష్యాలో ఒక వ్యక్తి ఏడాదికి కేవలం 33 కిలోల వ్యర్థాలను

మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. కేవలం ఆహారమే కాదు ఇతర వ్యర్థాలను కూడా కలిపితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. భారత్‌లో ఒక వ్యక్తి రోజుకు సగటున 0.35 నుండి 0.6 కిలోల చెత్తను ఉత్పత్తి చేస్తున్నాడు. అంటే ఏడాదికి ఒక వ్యక్తి ద్వారా 125 కిలోల నుండి 200 కిలోల వరకు మొత్తం వ్యర్థాలు తయారవుతున్నాయి. దీనికి అదనంగా మారుతున్న టెక్నాలజీ వల్ల పాత సెల్ ఫోన్లు, వైర్లు వంటి ఈ-వ్యర్థాలు కూడా పెరిగిపోతున్నాయి. ఒక భారతీయుడు ఏడాదికి సగటున 2 కిలోల ఈ-వ్యర్థాలను సృష్టిస్తున్నాడు.

# డయాబెటిస్ రోగులు బంగాళాదుంప వంటకాలు తినొచ్చా?



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళా దుంపలను దాదాపు ప్రతి ఇంట్లోనూ నిల్వ ఉంటాయి. బంగాళాదుంపలతో కిచిడితో సహా అనేక రుచికరమైన వంటకాలు తయారు చేస్తారు. అయితే చాలా మంది బంగాళాదుంపలు తింటే బరువు పెరుగు తారని అనుకుంటారు. అందుకే వీటిని తినడానికి దూరంగా ఉంటారు. బంగాళా దుంపలను దాదాపు ప్రతి ఇంట్లోనూ నిల్వ ఉంటాయి. బంగాళాదుంపలతో కిచిడితో సహా అనేక రుచికరమైన వంటకాలు తయారు చేస్తారు. అయితే చాలా మంది బంగాళాదుంపలు తింటే బరువు పెరుగుతారని అనుకుంటారు. అందుకే వీటిని తినడానికి దూరంగా ఉంటారు. ఇక పిల్లల నుంచి వృద్ధుల వరకు దాదాపు అన్ని వయసుల వారు బంగాళాదుంపలను తినడానికి ఇష్టపడతారు. బంగాళాదుంపలతో చాలా వంటకాలు తయారు చేస్తారు. ఇవి తినేందుకు చాలా రుచికరంగా కూడా ఉంటాయి. అయితే బంగాళాదుంపలు తినడం వల్ల రక్తంలో చక్కెర పెరుగుతుందని మనం తరచుగా వింటుంటాం. దీని కారణంగా చాలా మంది బంగాళాదుంపలు తినకుండా ఉంటారు. బంగాళాదుంపలలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయని, ఇవి శరీరంలో గ్లూకోజ్‌గా మారుతాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే బంగాళాదుంపలను అధిక గ్లైసెమిక్ సూచిక కలిగిన ఆహారంగా పరిగణిస్తారు. బంగాళాదుంపలను ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే అవి డయాబెటిక్ రోగులలో రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల డయాబెటిస్ రోగులు వీటిని మితంగా తీసుకోవాలి.

# నల్లబెల్లం, తెల్లబెల్లం ఆరోగ్యానికి ఏది బెస్ట్?



**హైదరాబాద్ పెన్ పవర్:** బెల్లం అనగానే మనందరికీ గుర్తొచ్చేది తీపి. పంచదార కంటే బెల్లం ఆరోగ్యం అని అందరికీ తెలుసు. కానీ మార్కెట్లో దొరికే రకరకాల బెల్లాల్లో ఏది అసలైనదో, ఏది ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుందో చాలామందికి తెలియదు. ఏదైనా ఒకటే కదా అని అనుకుంటాం.

మన వంటకాల్లో, ముఖ్యంగా పండుగ ప్రసాదాల్లో బెల్లానికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం నుంచి మన పెద్దలు పంచదార కంటే బెల్లాన్నే ఎక్కువగా వాడేవారు. అయితే, నేటి కాలంలో మార్కెట్లో రంగురంగుల బెల్లాలు కనిపిస్తున్నాయి. అన్ని రకాల బెల్లాల్లో తాటి బెల్లం మంచిదని చెబుతారు. ఇది తాటి చెట్టు నుంచి తీసిన నీరా ద్వారా తయారవుతుంది. ఇందులో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా బాడీ డిటాక్స్ అవుతుంది. మనం నిత్యం వాడేది చెరకు బెల్లం. ఇది శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇందులో మనం గమనించాల్సింది రంగు. మార్కెట్లో తెల్లగా లేదా పసుపు రంగులో మెరిసిపోయే బెల్లం కనిపిస్తే అది కెమికల్స్ కలిసిన బెల్లం అని గుర్తుంచుకోవాలి. సహజమైన పద్ధతిలో తయారైన బెల్లం ముదురు గోధుమ రంగులో లేదా నలుపు రంగులో ఉంటుంది. రంగు తక్కువగా ఉన్న బెల్లమే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొబ్బరి పువ్వుల నుంచి తీసిన రసంతో ఈ బెల్లం తయారు చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలో కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఆరోగ్య పరంగా చూస్తే తాటి బెల్లం మొదటి స్థానంలో ఉంటుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. ఇక సాధారణ చెరకు బెల్లం కొనేటప్పుడు అది ముదురు రంగులో, గట్టిగా ఉండేలా చూసుకోవాలి. తెల్లటి బెల్లం తయారీలో సోడియం కార్బోనేట్ వంటి రసాయనాలు వాడతారు. ఇవి ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, మీరు ఇకపై బెల్లం కొనేటప్పుడు కేవలం రుచిని మాత్రమే కాకుండా, అది ఏ రకమో మరియు దాని రంగును బట్టి సరైనది ఎంచుకోండి. తీపి తింటూనే ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగితే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** కరివేపాకు నీటిని ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది., మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి జుట్టు, చర్మ సౌందర్యాన్ని పెంచుకోవాలనుకునే వారికి కరివేపాకు నీరు ఒక దివ్యౌషధం. మన వంటగదిలో పోపు పెట్టాలన్నా, వంటకానికి మంచి సువాసన రావాలన్నా కరివేపాకు ఉండాల్సిందే. అయితే కరివేపాకు కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. దానిలో దాగి ఉన్న పోషకాలు ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో కరివేపాకు మరిగించిన నీటిని తాగడం వల్ల అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కరివేపాకు నీరు శరీరంలోని జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపులో మంట వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలనుకునే వారికి ఇది ఒక సహజ సిద్ధమైన పరిష్కారం. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కరివేపాకు నీరు ఒక వరం లాంటిది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సాధారణ స్థితిలో ఉంచడానికి సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే కార్బజోల్ ఆల్కలాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. శరీరంలోని మెటబాలిజంను పెంచడంలో కరివేపాకు కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వు పేరుకుపోకుండా నిరోధించడమే కాకుండా శరీర బరువును ఆరోగ్యకరంగా తగ్గించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు తమ మార్నింగ్ డ్రింక్‌గా దీనిని ఎంచుకోవచ్చు. కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ తో పాటు ఇనుము, కాల్షియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. తలలో రక్త ప్రసరణను మెరుగుపరిచి జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గిస్తుంది. జుట్టు మందంగా, బలంగా పెరిగేలా చేస్తుంది. ముఖంపై నల్లటి మచ్చలు, పిగ్మెంటేషన్, పొడి చర్మం సమస్యలకు కరివేపాకు నీరు చక్కటి పరిష్కారం. ఇది చర్మ రంగును మెరుగుపరిచి మెరిసేలా చేస్తుంది.

# ముస్తాఫిజుర్ ఎఫెక్ట్: ఇండియాలో వరల్డ్ కప్ ఆడం.. ఐసీసీకి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు లేఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 వరల్డ్ కప్ లో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఆడేందుకు సిద్ధంగా లేనట్టు సమాచారం. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) ఈ నిర్ణయం తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. 2026 టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఇండియాకు వెళ్లడం ఇష్టం లేదని ఐసీసీకి బంగ్లాదేశ్ ఈమెయిల్ ద్వారా తెలిపింది. బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను ఐపీఎల్ 2026 నుంచి తొలగించిన తర్వాత బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తక్షణమే ఈ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ బంగ్లాదేశ్ కు మినహాయింపు ఇస్తే ఆ దేశం పాకిస్థాన్ లాగే తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకలోనే ఆడనుంది. వరల్డ్ కప్ కు నెల రోజుల సమయం మాత్రమే ఉండడంతో త్వరలోనే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ లను మార్చాలన్న నిర్ణయాన్ని బీసీసీఐ తిరస్కరించింది. దీనిని లాజిస్టికల్ పీడకలగా చెప్పుకొచ్చింది. ఐసీసీకి పంపిన మెయిల్ లో మూడు విషయాలను గురించి ప్రస్తావించారు. మొదటిది ముస్తాఫిజుర్ ను ఐపీఎల్ 2026 నుంచి ఎందుకు తొలగించారు. రెండోది ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ కు భద్రతా విషయంలో ఆందోళనలు ఉన్నాయని.. ఆటగాళ్లు మాత్రమే కాకుండా వారితో పాటు మీడియా, అభిమానులు, స్పాన్సర్లు కూడా ప్రపంచ కప్‌ను చూడటానికి ఇండియాకు వస్తారని దీజదీ అధికారి ఒకరు అన్నట్టు సమాచారం.

**అసలేం జరిగిందంటే..?**

ఐపీఎల్ 2026 నుంచి బంగ్లాదేశ్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను కోల్‌కతా నైట్‌రైడర్స్ తప్పించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. వేలంలో ముస్తాఫిజుర్‌ను రూ. 9.20 కోట్లకు నైట్‌రైడర్స్ దక్కించుకుంది. అయితే ప్రస్తుతం బంగ్లాలో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో అతన్ని ఐపీఎల్ నుంచి తప్పించాలనే డిమాండ్లు పెరిగాయి. ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి తప్పించాలని బీసీసీఐ.. నైట్‌రైడర్స్‌ను కోరింది. దాని ప్రకారమే అతన్ని రిలీజ్ చేశారు. ఇదిలా ఉంటే ముస్తాఫిజుర్ ను తప్పించడం పట్ల బంగ్లాదేశ్ ప్రభుత్వం అసహనంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ముస్తాఫిజుర్ ను కేకేఆర్ రిలీజ్ చేసిన వెంటనే.. భారత్ వేదికగా జరగబోయే టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రీడా మంత్రిత్వ శాఖ ఇప్పుడు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బిసిబి)ను ఆదేశించినట్టు సమాచారం. జై షా నేతృత్వంలోని ఐసీసీతో ఈ విషయాన్ని చర్చించి ఇండియాలో జరగనున్న బంగ్లాదేశ్ ప్రపంచ కప్ మ్యాచ్ లకు వేదిక మార్పు కోరాలని బీసీబీని కోరినట్లు క్రీడా మంత్రిత్వ శాఖ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ తెలిపారు. "క్రీడా మంత్రిత్వ శాఖకు బాధ్యత వహించే సలహాదారుగా నేను క్రికెట్ కంట్రోల్ బోర్డును మొత్తం విషయాన్ని లిఖితపూర్వకంగా అందించి ఐసీసీకి వివరించాలని ఆదేశించాను". అని నజ్రుల్ ఫేస్‌బుక్‌లో బెంగాలీలో రాశారు.టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్ తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ నాలుగు మ్యాచ్ లను శ్రీలంకలో ఆ దేశ క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు బంగ్లా క్రికెట్ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ వివాదంపై అటు ఐసీసీ.. ఇటు బీసీసీఐ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# అంత తొందర ఎందుకు బాస్.. 2027 యాషెస్‌కు ఆస్ట్రేలియా స్క్వాడ్ ప్రకటించిన పాంటింగ్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్టు మధ్య చివరిదైన ఐదో టెస్ట్ జరుగుతోంది. ఇప్పటికే యాషెస్ సిరీస్ ను గెలుచుకున్న ఆస్ట్రేలియాప్రస్తుతం 3-1 ఆధిక్యంలో నిలిచింది. 2025-26 యాషెస్ ముగియక ముందే ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ 2027 యాషెస్ కు ఆస్ట్రేలియా స్క్వాడ్ ను ప్రకటించి ఆశ్చర్యపరిచాడు. 2027లో యాషెస్ కోసం ఆస్ట్రేలియా ఇంగ్లాండ్ లో పర్యటించనుంది. ఈ టూర్ కు పాంటింగ్ ఆదివారం (జనవరి 4) తనకు నచ్చిన 17 మంది ప్రాబబుల్స్ తో జట్టును ప్రకటించాడు. పాంటింగ్ ఆస్ట్రేలియా జట్టుకు కమ్మిన్స్ ను కెప్టెన్ గా ప్రకటించాడు. ప్రస్తుతం కమ్మిన్స్ ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టుకు కెప్టెన్సీ చేస్తున్నాడు. 2027కూడా కమ్మిన్స్ ఉండాలని పాంటింగ్ కోరుకుంటున్నాడు. సూపర్ ఫామ్ లో ఉన్న అలెక్స్ కారీని వికెట్ కీపర్ గా కొనసాగించాడు. జోష్ ఇంగ్లిస్ ను బ్యాకప్ వికెట్ కీపర్ బ్యాటర్ గా తన జట్టులో ఉంచాడు. ఫామ్ లో లేకపోయినా మార్నస్ లాబుస్చాగ్నేను తన స్క్వాడ్ లో ఉంచాడు. యంగ్ బ్యాటర్ కాంప్‌బెల్ కెల్లావే, ఫాస్ట్ బౌలర్ ఆలివర్ పీక్ 2027 యాషెస్ లో ఉంటారని అంచనా వేశాడు. దిగ్గజ ఆటగాళ్లు స్టీవ్ స్మిత్ తో పాటు స్పిన్నర్ నాథన్ లియాన్ లను ఎంపిక చేశాడు. జోష్ హాజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, జే రిచర్డ్‌సన్ పేసర్లగా పాంటింగ్ జట్టులో స్థానం సంపాదించుకున్నారు. స్పిన్నర్ టాడ్ మర్ఫీని జట్టులో ఉంచాడు.. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్లుగా బ్యూ వెబ్‌స్టర్, కామెరాన్ గ్రీన్ లను ఎంపిక చేశాడు. ఇంగ్లాండ్ లో జరగబోయే యాషెస్ కు మరో రెండేళ్లు సమయం ఉన్నప్పటికీ ఇప్పుడే ఆస్ట్రేలియా స్క్వాడ్ ను అంచానా వేయడంతో నెటిజన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న యాషెస్ విషయానికి వస్తే మొదటి నాలుగు మ్యాచ్ లు ముగిసేసరికి ఆస్ట్రేలియా సిరీస్ లో 3-1 ఆధిక్యంలో నిలిచింది. ఆదివారం (జనవరి 4) ఐదో టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేస్తున్న ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది.

**2027 యాషెస్ కోసం రికీ పాంటింగ్ ఆస్ట్రేలియా జట్టు:**

పాట్ కమ్మిన్స్ (కెప్టెన్), అలెక్స్ కారీ (వికెట్ కీపర్), స్కాట్ బోలాండ్, ట్రావిస్ హెడ్, కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, కాంప్‌బెల్ కెల్లావే, మిచెల్ స్టార్క్, జే రిచర్డ్‌సన్, మార్నస్ లాబుస్చాగ్నే, జోష్ హాజిల్‌వుడ్, టాడ్ మర్ఫీ, స్టీవ్ స్మిత్, నాథన్ లియాన్, బ్యూ వెబ్‌స్టర్, ఆలివర్ పీక్

# ఒక ఆటగాడు జట్టులోకి రావాలంటే ఇంకేం చేయాలి?.. షమీకి అన్యాయం చేశారు.. సెలక్షన్ కమిటీపై కోచ్‌ల తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడం తీవ్ర వివాదానికి దారితీసింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ తీరుపై షమీ వ్యక్తిగత కోచ్, బెంగాల్ కోచ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇటీవల జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో అద్భుతంగా రాణించినప్పటికీ, షమీని పక్కనపెట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న ఈ సిరీస్ కోసం నిన్న ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో షమీ పేరు లేకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. దేశవాళీ వన్డే టోర్నీ అయిన విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ తరఫున ఆడిన షమీ, కేవలం 5 మ్యాచ్‌లలోనే 11 వికెట్లు పడగొట్టాడు. అయినా సెలక్టర్లు అతడిని పరిగణనలోకి తీసుకోలేదు.ఈ నిర్ణయంపై షమీ వ్యక్తిగత కోచ్ మండిపడ్డాడు. "ఒక ఆటగాడు జట్టులోకి రావాలంటే ఇంకేం చేయాలి? ఇంకా ఎన్ని వికెట్లు తీయాలి?" అని ఆయన ప్రశ్నించాడు. "దీన్నిబట్టి చూస్తే, వారికి షమీ వన్డే జట్టులో అవసరం లేదనిపిస్తోంది. కానీ, అతనిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉంది" అని ఇండియా టుడేతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశాడు.బెంగాల్ కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా కూడా సెలక్షన్ కమిటీ తీరును తప్పుబట్టాడు. "సెలక్టర్లు షమీకి తీవ్ర అన్యాయం చేశారు. ఇటీవల కాలంలో ఏ అంతర్జాతీయ ఆటగాడు కూడా ఇంత అంకితభావంతో దేశవాళీ క్రికెట్ ఆడలేదు. ఇంత కష్టపడినా షమీ విషయంలో సెలక్టర్లు వ్యవహరించిన తీరు సిగ్గుచేటు" అని రెవ్‌స్పోర్ట్జ్‌తో మాట్లాడుతూ అన్నాడు. ఈ సిరీస్‌కు జస్‌ప్రీత్ బుమ్రాకు కూడా విశ్రాంతినిచ్చారు. దీంతో పేస్ దళంలో మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డిలకు చోటు కల్పించారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

# బన్నీ..మహేష్ కెరీర్ గ్యాప్ ఎలా ఉందంటే?







సూపర్ స్టార్ మహేష్ కెరీర్ లో రిలీజ్ ల పరంగా పెద్దగా గ్యాప్ కనిపించదు. ఏడాదికి రెండు సినిమాలు టార్గెట్ గా పెట్టుకున్నా? ఒక సినిమా మాత్రం కచ్చితంగా రిలీజ్ అయ్యేలా చూసుకున్నారు. 'రాజకుమారుడు' నుంచి 'గుంటూరు కారం' వరకూ మహేష్ లైనప్ చూస్తే? విషయం క్లియర్ గా తెలుస్తోంది. 1999లో 'రాజకు మారుడు' రిలీజ్ అనంతరం 2007 వరకూ ఏడాదికో సినిమా చొప్పున రిలీజ్ చేసారు. అదే సమయంలో 'అతిది' రూపంలో భారీ డిజాస్టర్ పడింది. దీంతో మూడేళ్లు గ్యాప్ తీసుకుని 'ఖలేజా' సినిమా చేసాడు. కానీ ఈ సినిమా కూడా డిజాస్టరే అయింది. మహేష్ కెరీర్ లో బ్యాక్ టూ బ్యాక్ ఫ్లాప్ చిత్రాలు ఆ రెండు. ఆ తర్వాత ఏడాది 'దూకుడు'తో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. మహేష్ కెరీర్ లోనే భారీ వసూళ్ల చిత్రంగా నిలిచింది. ఆ తర్వాత మళ్లీ 2020 వరకూ ఎలాంటి గ్యాప్ లేకుండా సినిమాలు చేసుకుంటూ వచ్చాడు. 'సరిలేరు నీకెవ్వరుతో' మరో బ్లాక్ బస్టర్ పడింది. దీంతో తదుపరి సినిమా అంతకు మించి ఉండాలని రెండేళ్లు గ్యాప్ తీసుకుని 'సర్కారు వారి పాట'తో 2022లో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈసినిమా అంచనాలు అందుకోలేదు. దీంతో మళ్లీ రెండేళ్లు గ్యాప్ తీసుకుని త్రివిక్రమ్ తో 'గుంటూరు కారం' చేసాడు.

ఈ సినిమా మంచి విజయం సాధించింది. ప్రస్తుతం దర్శక శిఖరం రాజమౌళితో గ్లోబల్ స్థాయిలో 'వారణాసి' సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఏకంగా పాన్ వరల్డ్ టార్గెట్ గా రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఈ సినిమా రిలీజ్ కోసం రెండేళ్లు గ్యాప్ తీసుకుంటున్నాడు. 2027లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న సంగతి తెలిసిందే. అలాగే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్ లో కూడా పెద్దగా గ్యాప్స్ లేవు. నటుడిగా ప్రయాణం మొదలైన తర్వాత ఏడాదికో సినిమా చొప్పున రిలీజ్ చేసుకుంటూ వచ్చాడు. 2003 'గంగోత్రి' నుంచి 'నా పేరు సూర్య '(2018) వరకూ ఏడాదికో సినిమా థియేటర్లో కనిపించింది. అటుపై రెండేళ్లు గ్యాప్ తీసుకుని 'అల వైకుంఠపురములో' సినిమా చేసాడు.ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడంతో తదుపరి రిలీజ్ కు నో గ్యాప్ అనేసాడు. ఈసారి 'పుష్ప' ఫ్రాంచైజీతో పాన్ ఇండియానే షేక్ చేసాడు. బాలీవుడ్ ని సైతం ఒణికిం చిన స్టార్ గా నిలిచాడు. 2021 లో 'పుష్ప ది రైజ్' రిలీజ్ అవ్వగా..అటుపై మూడేళ్లు గ్యాప్ తీసుకుని 'ది రూల్' ని రిలీజ్ చేసారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ ఇంటర్నేషనల్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమతో గ్లోబల్ మార్కెట్ నే టార్గెట్ చేసాడు. ఈ సినిమా రెండేళ్ల గ్యాప్ అనంతరం 2027లో రిలీజ్ అవుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965